Follow: @ANNTELUGU
25-06-2025
ANN తెలుగు
మహా పత్రిక
బుధవారం, హైదరాబాద్ సంపుటి- 22 సంచిక- 202 పేజీలు-08 వెల-రూ.6
PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



# ఇన్ ఛార్జ్ మంత్రులదే బాధ్యత

## పనిచేస్తే ప్రమోషన్.. చేయకపోతే డిమోషన్

పార్టీలో క్రమశిక్షణ దాటితే వేటు తప్పదు

పదవుల కోసం ధర్నాలు చేస్తే ఊరుకోం

పదేండ్లు అధికారంలో ఉంచే బాధ్యత నేను తీసుకుంటా

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్ట్రాంగ్ వార్నింగ్

పీసీసీ రాజకీయ వ్యవహారాల కమిటీ సమావేశంలో పాల్గొన్న సీఎం

వివరాలు 2లో

టాప్ న్యూస్

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో

## కచ్చితంగా గెలవాల్సిందే

- పీఏసీ మీటింగ్‌లో మీనాక్షి నటరాజన్



02

## తీర్పు నేడే


- పంచాయతీ ఎన్నికలపై రానున్న క్లారిటీ
- పిటిషనర్లు, ప్రభుత్వం, స్టేట్ ఎలక్షన్ కమిషన్ వాదనలు పూర్తి
- ఎన్ని రోజుల్లో ప్రభుత్వం ఎన్నికలు నిర్వహిస్తుందో చెప్పాలన్న హైకోర్టు
- ఇవాళ ఎలాంటి తీర్పు వెలువడుతుందోనని ఉత్కంఠ



02

## త్వరలోనే మరో 30 వేల జాబ్స్

- సంక్షేమ కార్యక్రమాలకు రూ. 95,351 కోట్లు ఖర్చు చేస్తున్నాం
- మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు ఇస్తున్నాం
- కాంగ్రెస్ అంటేనే వ్యవసాయం.. వ్యవసాయం అంటేనే కాంగ్రెస్
- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క



02



## ఇజ్రాయెల్-ఇరాన్ యుద్ధంలో.. ట్రంపిజం

- ట్రంప్ దౌత్యం.. అయినా ఇంకా ఉద్రిక్తతలు
- శాంతిదూత బిరుదు కోసం ఆపసోపాలు


వివరాలు 4లో



## టీపీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ వ్యాసాల సంకలనం ఆవిష్కరణ

**మహా :** టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ వ్యాసాల సంకలనం విధ్వంసం నుంచి వికాసం వైపు పుస్తకాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆవిష్కరించారు. ఏఐసీసీ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్, ఉప ముఖ్య మంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహేశ్ కుమార్ గౌడ్ ను సీఎం తో పాటు నేతలు అభినందించారు. తెలంగాణలో 18 నెలల గోల్డెన్ పాలన సాగిందన్నారు.

# అసెంబ్లీలో చర్చకు కేసీఆర్ సిద్ధమా?



## గోదావరి జలాలపై సీఎం రేవంత్ సవాల్

ఆధారాలు.. మీ సంతకాలతో చర్చకు వస్తా

ఒక రోజు గోదావరి.. మరో రోజు కృష్ణా జలాలపై చర్చకు రెడీ

దమ్ముంటే చర్చకు రా.. వ్యవసాయాన్ని పండుగ చేశాం.. రైతు భరోసా పూర్తి చేశాం

రైతుల ఆశీర్వాదం వల్లే నేను సీఎం అయ్యా

రాష్ట్రం దివాలా తీస్తే ఆ ముగ్గురు ఎలా సంపన్నులయ్యారు?

**హైదరాబాద్ , మహా :** గోదావరి జలాలపై అసెంబ్లీలో చర్చకు కేసీఆర్ సిద్ధమా? అని సీఎం రేవంత్‌రెడ్డి సవాల్ విసిరారు. '' అసెంబ్లీలో చర్చ కోసం స్పీకర్‌కు లేఖ రాయాలి. కేసీఆర్ చెప్పిన తేదీన అసెంబ్లీలో చర్చ చేపట్టే బాధ్యతను మంత్రి శ్రీధర్‌బాబు తీసుకుంటారు. ఆధారాలు, సంతకాలతో అసెంబ్లీలో చర్చకు వస్తా. కేసీఆర్ సిద్ధమా?ఒకరోజు గోదావరి జలాలు, రెండో రోజు కృష్ణా జలాలపై చర్చిద్దాం. గతంలో సంతకాలు చేసిన కాగితాలు అసెంబ్లీ ముందు ఉంచుతా'' అని సీఎం అన్నారు. రైతుభరోసా కార్యక్రమం విజయవంతంగా పూర్తయిన సందర్భంగా సచివాలయం ఎదురుగా రాజీవ్‌గాంధీ విగ్రహం వద్ద 'రైతు నేస్తం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి మాట్లాడారు.

మిగతా 2లో

> ### కాంగ్రెస్ పాలనపై చర్చకు సిద్ధం
>
> కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే ప్రభుత్వ ధ్యేయం. మహిళలు సౌర విద్యుత్ ఉత్పత్తి చేసేలా చర్యలు చేపట్టాం. వెయ్యి మెగావాట్ల సౌర విద్యుత్‌పై విద్యుత్‌శాఖతో ఒప్పందం కుదుర్చుకున్నాం. మహిళలకు రూ.21వేల కోట్ల వడ్డీలేని రుణాలు ఇచ్చి ఆదుకున్నాం. మహిళా స్వయం సహాయక సంఘాల ఉత్పత్తుల విక్రయానికి చర్యలు చేపట్టాం. శిల్పారామంలో 150 షాపుల ఏర్పాటుకు స్థలం కేటాయించాం. వెయ్యి బస్సులు కొని ఆర్టీసీకి మహిళలు అద్దెకు ఇచ్చేలా చర్యలు చేపట్టాం. 8 వేల ఐకేపీ కేంద్రాలను మహిళల చేతుల్లో పెట్టాం. పాఠశాలల్లో ఆహార పదార్థాల సరఫరా బాధ్యతను స్వయం సహాయక సంఘాలకు అప్పగించాం. పదేళ్ల బీఆర్ ఎస్ పాలన, 18 నెలల కాంగ్రెస్ పాలనపై చర్చ పెట్టాలి." అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు.

## దొంగలను దోచుకున్న దొంగలు

### థ్రిల్లర్ సినిమాను తలపించిన ట్విస్ట్‌లు



**హైదరాబాద్, మహా :** దొంగలను దోచిన దొంగల కథ ఇది. వినడానికి ఆశ్చర్యంగా ఉన్నా.. అనేక దొంగల సినిమాలను మైమరిపించిన దొంగల కథను ట్విస్ట్ ల మీద్ ట్విస్ట్ లున్న స్టోరీని చాకచక్యంగా హైదరాబాద్ పోలీసులు ఛేదించారు. హైదరాబాద్ లో ఓ దోపిడీ దొంగతనం సినిమా ట్విస్టులను గుర్తుచేసింది. పథకం ప్రకారం ఒక ముఠా దోపిడీకి పాల్పడితే..

మిగతా 3లో

## తెలంగాణకు ఐఏఎస్ ఆమ్రపాలి

### ఐఏఎస్ అధికారిణికి క్యాట్‌లో ఊరట

### తిరిగి తెలంగాణకు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ



**ఢిల్లీ, మహా:** తెలంగాణ నుంచి రిలీవై ఏపీ క్యాడర్‌లో చేరిన ఐఏఎస్ అధికారిణి కాటా ఆమ్రపాలికి కేంద్ర పరిపాలనా ట్రైబ్యునల్ (క్యాట్)లో ఊరట లభించింది. ఆమెను తిరిగి తెలంగాణకు కేటాయిస్తూ క్యాట్ ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో తెలంగాణలో పని చేసిన ఆమె.. డిపార్ట్ మెంట్ ఆఫ్ పర్సనల్ అండ్ ట్రైనింగ్ విభాగం (డీఓపీటీ) ఉత్తర్వులతో నాలుగు నెలల క్రితం ఏపీకి వెళ్లిన సంగతి తెలిసిందే. అయితే, డీవోపీటీ ఆదేశాలను సవాల్ చేస్తూ తనను తెలంగాణకు కేటాయించాలని ఆమె క్యాట్‌లో పిటిషన్ దాఖలు చేశారు.

మిగతా 2లో

### రాజకీయాలకతీతంగా బోనాలు చేసుకుందాం

- భక్తులకు ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు
- బోనాల ఉత్సవాలపై మంత్రి పొన్నం ప్రభాకర్ సమీక్ష

02

## ఫోన్ ట్యాప్ వల్లే బీజేపీ ఓటమి

### సినీ ప్రముఖుల ఫోన్ కాల్స్ వినడం దారుణం

కాంగ్రెస్ ప్రభుత్వం కూడా పాల్పడే అవకాశం ఉంది: ఈటల

ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ ముందు వాంగ్మూలం ఇచ్చిన బీజేపీ ఎంపీ



**హైదరాబాద్, మహా:** ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్‌రావు ఎవరి ఆదేశాలతో ఫోన్లు ట్యాపింగ్ చేశారని మల్కాజిగిరి బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ ప్రశ్నించారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ ముందు వాంగ్మూలం ఇచ్చిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ''మా పార్టీ నాయకుల మధ్య జరిగిన సంభాషణను కూడా కాల్ డేటాలో చూపించారు. హుజూరాబాద్‌లో, 2023లో గజ్వేల్‌లో పోటీ చేసినప్పుడు దుర్మార్గమైన పద్ధతిలో నా ఫోన్ ట్యాప్ చేశారు.

మిగతా 2లో




# ఇన్ ఛార్జ్ మంత్రులదే బాధ్యత

- పనిచేస్తే ప్రమోషన్.. చేయకపోతే డిమోషన్
- పార్టీలో క్రమశిక్షణ దాటితే వేటు తప్పదు
- పదవుల కోసం ధర్నాలు చేస్తే ఊరుకోం
- పదేండ్లు అధికారంలో ఉంచే బాధ్యత నేను తీసుకుంటా
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్ట్రాంగ్ వార్నింగ్
- పీసీసీ రాజకీయ వ్యవహారాల కమిటీ సమావేశంలో పాల్గొన్న సీఎం

**హైదరాబాద్, మహా:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇన్‌చార్జ్ మంత్రుల పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆయా జిల్లాల్లో నామినేటెడ్ పదవులు భర్తీ చేసే బాధ్యత ఇన్‌చార్జ్ మంత్రులకు అప్పగించినా ఎందుకు చేయడం లేదని ప్రశ్నించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో 99 శాతం సీట్లు గెలిచేలా ఇన్‌చార్జ్ మంత్రులే బాధ్యత తీసుకోవాలని ఆదేశించారు. జిల్లా ఇన్‌చార్జ్ మంత్రులకు నిధులు ఇచ్చామని, వాటిని సరిగ్గా ఎందుకు ఆయా జిల్లాల్లో ఉపయోగించడం లేదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రశ్నల వర్షం కురిపించారు. మంత్రి పదవుల కోసం కొంతమంది కాంగ్రెస్ నేతలు ధర్నాలు చేయించడంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సీరియస్ అయ్యారు. పార్టీలో క్రమశిక్షణ దాటితే వేటు తప్పదని హెచ్చరించారు.

ముందు అందరికీ పని అప్పగించాలి.. పదవులు వచ్చిన వారు తెలంగాణ రాష్ట్రమంతా తిరగాలని ఆదేశించారు. పదవులు అడగటం తప్పు లేదు.. కానీ నిరసన హుందాగా ఉండాలని సూచించారు. పీసీసీ కార్యవర్గంలో ఉన్న వారిని రెండుగా చేసి జాబితా సిద్ధం చేయాలని.. ముందు అందరికీ పని అప్పగించాలని ఆదేశించారు. పని చేసిన వాళ్లది ఒక జాబితా, పని చేయని వాళ్లది మరో జాబితా సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్దేశించారు. మంగళవారం గాంధీభవన్‌లో జరిగిన పీసీసీ రాజకీయ వ్యవహారాల కమిటీ సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. పని చేయకపోతే డిమోషన్.. పని చేస్తే ప్రమోషన్ ఇస్తామని స్పష్టం చేశారు. పని చేయకపోతే పక్కన పెట్టడంలో మొహమాటం అవసరం లేదని తేల్చిచెప్పారు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి. గతంలో తాను టీపీసీసీ చీఫ్ అయిన తర్వాత ఫ్రంటల్ ఆర్గనైజేషన్ చైర్మన్ బాధ్యతలు తీసుకోమంటే కొందరు నేతలు తీసుకోలేదని గుర్తుచేశారు. తాము సీనియర్లం, ఆ చిన్న బాధ్యత తీసుకోమని తనకు ఆ నేతలు చెప్పారని అన్నారు. ఆ రోజు బాధ్యత తీసుకున్ననాయకులకు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే కార్పొరేషన్ పదవులు ఇచ్చామని స్పష్టం చేశారు.

### 2029 ఎన్నికలకు అందరూ సిద్ధం..

పార్టీ నిర్మాణంలో భాగస్వామ్యం అయితే పదవులు వాటంతట అవే వస్తాయని ఉద్ఘాటించారు. ఇంకో నాలుగు సంవత్సరాలు తమ ప్రభుత్వమే అధికారంలో ఉంటుందని అన్నారు. త్వరలోనే మహిళా రిజర్వేషన్ వచ్చే అవకాశం ఉందని తెలిపారు. 2029 ఎన్నికలకు అందరూ సిద్ధంగా ఉండాలని కోరారు. పార్టీలో పనిచేయని వారిని పదవుల నుంచి తొలగించాలని ఆదేశించారు. తెలంగాణలో కాంగ్రెస్ రెండోసారి అధికారంలోకి రావాలంటే.. పార్టీ నేతల పనితీరుపైనే ఆధారపడి ఉందని తేల్చిచెప్పారు. పదేళ్లు అధికారం మనదేనని స్పష్టం చేశారు. పార్టీ పదవిని చిన్నచూపు చూస్తే వారికే నష్టమని హెచ్చరించారు. పార్టీ, ప్రభుత్వం జోడెద్దుల్లాగా పనిచేయాలని సూచించారు. 18 నెలల ప్రభుత్వ పాలన గోల్డెన్ పీరియడ్ అని అభివర్ణించారు. బూత్, గ్రామ, మండల స్థాయిలో పార్టీ కమిటీలు ఏర్పాటు చేయాలని కోరారు. బూత్ స్థాయిలో పార్టీ బలంగా ఉంటే ప్రభుత్వ పథకాలు ప్రజల్లోకి సమర్థవంతంగా తీసుకెళ్లగలుగుతామని ఉద్ఘాటించారు. పార్టీ నిర్మాణంపైన టీపీసీసీ దృష్టి సారించాలని అన్నారు. పార్టీ నాయకులంతా ఐక్యంగా పని చేయాలని సూచించారు సీఎం రేవంత్‌రెడ్డి. మరోసారి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చేలా నేతలు అందరూ కలిసి పని చేయాలని సీఎం రేవంత్‌రెడ్డికోరారు. పార్టీ కమిటీల్లో ఉన్న నాయకులు గ్రౌండ్ లెవెల్లో పని చేయాల్సిందేనని స్పష్టం చేశారు. పని చేస్తేనే పదవులు వస్తాయని చెప్పారు.

### రాబోయే రోజుల్లో చాలా సవాళ్లు..

పార్టీకి కష్టకాలంలో పనిచేసిన వారికి పదవులు ఇచ్చామని ఉద్ఘాటించారు. లక్ష్యాన్ని నిర్దేశించుకొని పార్టీ నాయకులు పని చేయాలని సూచించారు. మార్కెట్ కమిటీలు, టెంపుల్ కమిటీల వంటి నామినేటెడ్ పోస్టులు భర్తీ చేసుకోవాలని ఆదేశించారు. పార్టీ నాయకులు క్రమశిక్షణతో వ్యవహరించాలని కోరారు. మన ప్రభుత్వం చాలా సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని ఉద్ఘాటించారు. అనేక సామాజిక అంశాలను కూడా ప్రభుత్వం పరిష్కరించిందని గుర్తుచేశారు. రాబోయే రోజుల్లో చాలా సవాళ్లు ఎదుర్కొవడానికి సిద్ధంగా ఉండాలని అన్నారు. డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్ బిల్లు, జమిలి ఎన్నికలు లాంటి అంశాలు మన ముందుకు రాబోతున్నాయని వెల్లడించారు. తాను గ్రామాల్లోకి వెళ్లడానికి సిద్ధంగా ఉన్నానని తెలిపారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక కోసం పార్టీని సిద్ధం చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

## జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కచ్చితంగా గెలవాల్సిందే...

### పీఏసీ మీటింగ్‌లో మీనాక్షి నటరాజన్

జూబ్లిహిల్స్ ఉప ఎన్నికలో కచ్చితంగా గెలవాల్సిందేనని ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్ ఛార్జి మీనాక్షి నటరాజన్ స్పష్టం చేశారు. మంగళవారం గాంధీ భవన్ లో జరిగిన సమావేశంలో.. ఉప ఎన్నికపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ ఉప ఎన్నికలో కచ్చితంగా గెలవాల్సిందేనని ఆమె సూచించారు. జూబ్లీహిల్స్ ఎన్నికల కోసం గ్రేటర్ పరిధిలోని నాయకులందర్నీ సమన్వయం చేయాల్సిందిగా మంత్రి పొన్నం ప్రభాకర్ కు బాధ్యతలు అప్పగించారు. జూబ్లీహిల్స్ బై ఎలక్షన్స్ కు ఎవరిని నియమిస్తున్నారని అడిగిన ప్రశ్నకు.. ఇంకా అభ్యర్థిని ఖరారు చేయలేదని సీఎం రేవంత్ చెప్పారు. ఈ సందర్భంగా అభ్యర్థి ఎంపికపై ఎవరూ మాట్లాడకూడదని ఆదేశించారు. పార్టీ నిర్ణయించి అభ్యర్థిని ప్రకటించే వరకు ఎవరూ కామెంట్స్ చేయొద్దని సూచించారు. పార్టీలో క్రమశిక్షణ దాటితే వేటు తప్పదని సీఎం రేవంత్ హెచ్చరించారు . ఈ సందర్భంగా తమ సేవలను ఉపయోగించుకోవాలని పలువురు సీనియర్లు తెలిపారు. అయితే పదవులు వచ్చిన వాళ్ళు రాష్ట్రమంతా తిరిగి పార్టీని బలోపేతం చేయాలని నాయకులకు పిలుపునిచ్చారు .

# ఫోన్ ట్యాప్ వల్లే బీజేపీ ఓటమి



(మొదటిపేజీ తరువాయి)

మునుగోడు ఉప ఎన్నిక వచ్చినప్పుడు మేం.. ఎవరితో మాట్లాడుతున్నాం, ఏం చేస్తున్నామనేది ట్యాపింగ్ ద్వారా తెలుసుకున్నారు. ధైర్యంగా ఎదుర్కోలేని వారే ఇలాంటి అక్రమాలకు పాల్పడతారు. ప్రభాకర్‌రావు ఐపీఎస్ అధికారి కాదు. అయినా, ఎస్ఐబీ చీఫ్‌గా నియమించారు. విశ్రాంత అధికారిని అక్రమంగా నియమించారు. మార్గదర్శకాలను తుంగలో తొక్కారు. ఫోన్లు ట్యాప్ చేయడం ప్రజాస్వామ్య విరుద్ధం. జడ్జిలు, మంత్రులు, పార్టీ ముఖ్యనేతల ఫోన్లు ట్యాప్ చేశారు. గతంలో ఇంటెలిజెన్స్ మొత్తం కేసీఆర్ వద్దే ఉండేది. కాళేశ్వరంపై కమిటీ నివేదికను ఇంకా బయటపెట్టలేదు. ఫోన్ ట్యాపింగ్‌పై విచారణ కమిషన్ వేసి ఏడాదిన్నర కావొస్తుంది. బీఆర్ఎస్, కాంగ్రెస్ లాలూచీపడకపోతే విచారణ నివేదికలు ఎందుకు భయటపెట్టడంలేదో సీఎం రేవంత్‌రెడ్డి సమాధానం చెప్పాలి'' అని ఈటల రాజేందర్ డిమాండ్ చేశారు.

### బీజేపీ దెబ్బ తీసేందుకే ఫోన్ ట్యాపింగ్..

**ఎన్నికల సమయంలో తన రెండు ఫోన్లు ట్యాప్ చేశారని సిట్ అధికారులు చెప్పారని బీజేపీ నేత ప్రేమేందర్ రెడ్డి మీడియాకు వెల్లడించారు. రాజకీయ పార్టీ నేతలు, ఉద్యమకారులు, జర్నలిస్టులు, సినీ ప్రముఖుల ఫోన్ కాల్స్ వినడం దారుణమన్నారు. "బీజేపీని దెబ్బతీయడానికే ఫోన్ ట్యాపింగ్‌కి పాల్పడ్డారు. ఫోన్ ట్యాపింగ్‌పై కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి స్థాయిలో విచారణ జరపాలి. బాధితులు వేల సంఖ్యలో ఉన్నారు. కానీ, కొద్ది మందిని మాత్రమే సాక్షులుగా పిలుస్తున్నారు. దేశ రక్షణ, భద్రత కోసం చేయాల్సిన ఫోన్ ట్యాపింగ్‌ను రాజకీయం కోసం వాడుకున్నారు. ఈ కేసులో అసలైన దోషులు తెలియాలంటే సీబీఐతో విచారణ చేయించాలి. కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడే అవకాశం ఉంది. ఫోన్ ట్యాపింగ్ వల్ల రాష్ట్రంలో బీజేపీ చాలా చోట్ల ఓడిపోయింది"అని చెప్పారు.**



# తీర్పు నేడే

- పంచాయతీ ఎన్నికలపై రానున్న క్లారిటీ
- పిటిషనర్లు, ప్రభుత్వం, స్టేట్ ఎలక్షన్ కమిషన్ వాదనలు పూర్తి
- ఎన్ని రోజుల్లో ప్రభుత్వం ఎన్నికలు నిర్వహిస్తుందో చెప్పాలన్న హైకోర్టు
- ఇవాళ ఎలాంటి తీర్పు వెలువడుతుందోనని ఉత్కంఠ

**హైదరాబాద్, మహా:** గ్రామ పంచాయతీ ఎన్నికలపై నేడు హైకోర్టు తీర్పు వెలువరించనుంది. పంచాయతీ ఎన్నికలు సకాలంలో నిర్వహించాలంటూ దాఖలైన పిటీషన్లపై హైకోర్టులో సోమవారం వాదనలు ముగిశాయి. ఇరువైపులా వాదనలు ముగియడంతో హైకోర్టు తీర్పును రిజర్వు చేసింది. బుధవారం తీర్పు వెలువడనుండటంతో ఎన్నికలపై ఉత్కంఠ నెలకొంది. 2024 జనవరి 31వ తేదీన సర్పంచుల పదవీ కాలం ముగిసినప్పటికీ ఎన్నికలు నిర్వహించడం లేదంటూ 6 పిటిషన్లు దాఖలయ్యాయి. సర్పంచ్ పదవీకాలం ముగిసిన అభ్యర్థులు ఈ పిటిషన్లు దాఖలు చేశారు. ఈ పిటిషన్లపై జస్టిస్ టి.మాధవిదేవి విచారణ నిర్వహించారు. ఫిబ్రవరిలో పంచాయతీ ఎన్నికలు నిర్వహించేలా తేదీలు వెల్లడిస్తామని, ప్రభుత్వం చెప్పినప్పటికీ ఎలాంటి చర్యలు చేపట్టలేదని పిటిషనర్ల తరపు న్యాయవాదులు కోర్టుకు తెలిపారు.

**సర్కార్ రిక్వెస్ట్..**

ఏడాదిన్నర పంచాయతీలో సరైన పాలన లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వాదించారు. పంచాయతీలకు పాలకవర్గం లేకుండా ఉండొద్దని సుప్రీంకోర్టు తీర్పులు చెబుతున్నాయన్నారు. గడువులోగా ఎన్నికలు నిర్వహించాలని నిబంధనలున్నా అమలు చేయడంలేదని పిటిషనర్ల తరపు న్యాయవాదులు వాదించారు. బీసీ రిజర్వేషన్ల వల్ల ఎన్నికల నిర్వహణ ఆలస్యమైందని, పంచాయతీ ఎన్నికలు నిర్వహించడానికి నెల రోజుల గడువు కావాలని అదనపు అడ్వకేట్ జనరల్ కోర్టుకు తెలిపారు. ప్రభుత్వం నిర్ణయం వెలువర్చిన తర్వాత ఎన్నికలు నిర్వహించడానికి 60 రోజుల సమయం కావాలని రాష్ట్ర ఎన్నికల సంఘం తరపు న్యాయవాది కోర్టుకు తెలిపారు.

# అసెంబ్లీలో చర్చకు కేసీఆర్ సిద్ధమా?



(మొదటిపేజీ తరువాయి)

రైతు భరోసా కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేశామని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. వ్యవసాయాన్ని దండగ అనే స్థాయి నుంచి పండగ చేసేందుకే వైఎస్ఆర్ ఆనాడు ఉచిత విద్యుత్ అందించారని చెప్పారు. రైతుల ఆశీర్వాదం వల్లనే చిన్న వయస్సులో సీఎం అయ్యానని, రైతాంగం అభివృద్ధికి సాయశక్తులా కృషి చేస్తానని చెప్పారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన రైతు భరోసా నిధుల పంపిణీ కార్యక్రమం ఇవాళ్టితో పూర్తయింది. 9 రోజుల్లో 9 వేల కోట్ల మొత్తాన్ని రైతుల ఖాతాల్లో జమ చేశారు. రైతుభరోసా కార్యక్రమం విజయవంతంగా పూర్తయిన సందర్భంగా సచివాలయం ఎదురుగా రాజీవ్‌గాంధీ విగ్రహం వద్ద 'రైతు నేస్తం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి మాట్లాడారు. 'మా ప్రజాప్రభుత్వంలో మా మొదటి ప్రాధాన్యం రైతులే. రైతుల తర్వాత మహిళలు, యువత మా ప్రాధాన్యం. రైతులకు రుణమాఫీ చేస్తామని ఎన్నికల్లో మాట ఇచ్చాం.. నిలబెట్టుకున్నాం. 25 లక్షల మందికిపైగా రైతులకు రుణమాఫీ చేశాం. గత ముఖ్యమంత్రి వరి వేసుకుంటే ఉరి వేసుకోవడమే అని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక సన్నవడ్లు పండిస్తే బోనస్ ఇస్తామని చెప్పాం. అంతేకాకుండా 48 గంట్లలో డబ్బు జమ చేశాం. దేశంలోనే అత్యధికంగా వరి పండించే రాష్ట్రమని గర్వంగా చెప్పుకొంటున్నాం. వ్యవసాయం అంటే.. రైతును రాజును చేయడం. గత ముఖ్యమంత్రి కేసీఆర్ రూ.8 లక్షల కోట్లకుపైగా అప్పులు మా నెత్తిన పెట్టి వెళ్లారు. రూ.లక్ష కోట్లతో కాళేశ్వరం కట్టడం.. కూలడం కూడా జరిగిపోయింది. కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావుకు ఫామ్‌హౌస్‌లు ఎలా వచ్చాయి? రాష్ట్రం దివాలా తీస్తే వాళ్లంతా ఎలా సంపన్నులయ్యారు? కేసీఆర్ వేలాది ప్రభుత్వ పాఠశాలలు మూత వేయించారు. కానీ, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత 60 వేల ఉద్యోగాలు ఇచ్చాం. గ్రామాల్లో అమ్మ ఆదర్శ పాఠశాలలు తీసుకువచ్చాం.

# త్వరలోనే మరో 30 వేల జాబ్స్

### సంక్షేమ కార్యక్రమాలకు రూ. 95,351 కోట్లు ఖర్చు చేస్తున్నాం

### మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు ఇస్తున్నాం

### కాంగ్రెస్ అంటేనే వ్యవసాయం.. వ్యవసాయం అంటేనే కాంగ్రెస్

### ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క



**హైదరాబాద్, మహా:** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 56,000 ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ పూర్తయ్యిందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. త్వరలోనే మరో 30,000 ఉద్యోగాలకు నోటిఫికేషన్లు జారీ చేయనున్నట్లు ప్రకటించారు. ఉద్యోగ నియామకాల్లో పారదర్శకత, సామాజిక న్యాయం ప్రాముఖ్యతను గుర్తిస్తూ ప్రభుత్వం ముందుకు సాగుతోందని చెప్పారు. ఈ క్రమంలోనే రాష్ట్రంలోని నిరుద్యోగులకు మరో తీపికబురు అందనుందని హర్షం వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్ అంటేనే వ్యవసాయం.. వ్యవసాయం అంటేనే కాంగ్రెస్ అని భట్టి విక్రమార్క వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో వ్యవసాయ రంగ అభివృద్ధే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని.. రైతు సంక్షేమమే తమ ప్రధాన అజెండా పేర్కొన్నారు. రైతు భరోసా పథకం ద్వారా ఇప్పటి వరకు రాష్ట్రంలో 69.70 లక్షల మంది రైతులకు చెందిన 1.49 కోట్ల ఎకరాల సాగుభూమికి రూ.9,000 కోట్లు నేరుగా ఖాతాల్లో జమ చేశామన్నారు. కేవలం 9 రోజుల్లో పెట్టుబడి సాయం రూపంలో ఇంత భారీ మొత్తం అందించామని వెల్లడించారు.

**42.16 లక్షల మంది రైతులకు బీమా..**

ఇక ఉగాది పండుగ నుంచి ప్రారంభమైన ఉచిత సన్నబియ్యం పంపిణీ పథకంతో రాష్ట్రంలోని 3.10 కోట్ల మంది పేదలకు ఉపశమనం లభించిందని భట్టి వెల్లడించారు. దీనికోసం ప్రభుత్వం ప్రతి సంవత్సరం రూ.13,525 కోట్లు ఖర్చు చేస్తోందని చెప్పారు. అంతే కాకుండా సన్న ధాన్యాలు సాగు చేసిన రైతులకు ప్రోత్సాహకంగా క్వింటాకు రూ.500 చొప్పున ప్రభుత్వం బోనస్ ఇచ్చిందని గుర్తు చేశారు. ఇప్పటి వరకు రూ.1,199 కోట్లను తమ ప్రభుత్వం విడుదల చేసిందని తెలిపారు.రైతు అనుకోని విధంగా మృతి చెందితే.. ఆ కుటుంబాన్ని ఆదుకునేందుకు రైతు బీమా పథకాన్ని ప్రభుత్వం అమలు చేస్తోందని భట్టి చెప్పారు. ఇప్పటి వరకు 42.16 లక్షల మంది రైతులకు బీమా సదుపాయం కల్పించామని తెలిపారు. ఇది కేవలం ఆర్థిక భరోసానే కాదని.. రైతుల పట్ల ప్రభుత్వానికి ఉన్న బాధ్యతను కూడా తెలియజేస్తుందన్నారు.పేద కుటుంబాల పిల్లలకూ ప్రపంచ స్థాయి విద్య అందించేందుకు యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటు చేస్తున్నామని భట్టి వివరించారు. ప్రతి పాఠశాలను 25 ఎకరాల్లో, రూ.200 కోట్లతో నిర్మించనున్నట్టు స్పష్టం చేశారు. మొదటి దశలో 58 స్కూల్స్ కోసం రూ.11,600 కోట్లు కేటాయించామని చెప్పారు. ఇది విద్య రంగంలో ఒక మైలురాయిగా నిలుస్తుందని అభిప్రాయపడ్డారు.

# తెలంగాణకు ఐఏఎస్ ఆమ్రపాలి

**ఐఎఎస్ అధికారిణికి క్యాట్‌లో ఊరట**

**తిరిగి తెలంగాణకు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ**



(మొదటిపేజీ తరువాయి)

పిటిషన్‌ను అనుమతించిన క్యాట్.. తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది.

**ఇటీవల ఏపీకి..**


ఏపీ, తెలంగాణ కేడర్ ఐఏఎస్, ఐపీఎస్ అధికారులపై ఇటీవల కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. తెలంగాణలో పనిచేస్తున్న ఏపీ కేడర్ ఐఏఎస్ , ఐపీఎస్ అధికారులను ఆంధ్రప్రదేశ్‌లో రిపోర్టు చేయాలని ఆదేశించింది. తమను తెలంగాణకు కేటాయించాలన్న వారి అభ్యంతరాలను తోసిపుచ్చిన కేంద్రం ఏపీలో రిపోర్టు చేయాలని ఆదేశించింది. ఈ మేరకు రెండు రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులకు కేంద్రం ఉత్తర్వులు జారీ చేసింది. కేంద్రం ఆదేశాలతో తెలంగాణలో పనిచేస్తున్న ఐఏఎస్ అధికారులు ఆమ్రపాలి కాట, రొనాల్డ్ రోస్, వాకాటి కరుణ, వాణీప్రసాద్, ప్రశాంతి ఏపీలో రిపోర్టు చేయనున్నారు. అలాగే ఐపీఎస్ అధికారులు అంజనీకుమార్, అభిలాష, అభిషేక్ మొహంతి కూడా ఏపీలో రిపోర్టు చేయాలని ఆదేశించింది.

# రాజకీయాలకతీతంగా బోనాలు చేసుకుందాం

### భక్తులకు ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు

### బోనాల ఉత్సవాలపై మంత్రి పొన్నం ప్రభాకర్ సమీక్ష

**హైదరాబాద్, మహా:** నగరంలో ఎంతో వైభవంగా జరిగే సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి బోనాల జాతర ఉత్సవాలపై ఇన్‌ఛార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. అమ్మవారి బోనాల ఉత్సవాల్లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా తీసుకోవాల్సిన జాగ్రత్త చర్యలపై సమావేశంలో చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. చారిత్రాత్మకమైన ఉజ్జయిని మహంకాళి అమ్మవారి బోనాల ఉత్సవాలు రాజకీయాలకు అతీతంగా చేసుకుందామని పిలుపునిచ్చారు. ప్రభుత్వం పక్షాన ఎన్ని కార్యక్రమాలు చేపట్టినా స్థానికుల సహకారం లేకపోతే విజయవంతం కాదన్నారు. గత సంవత్సరం ఏమైనా పొరపాటు జరిగితే సమీక్షించుకుని మరిన్ని ఏర్పాట్లు చేయడానికి ఈ సమీక్ష ఏర్పాటు చేసినట్లు తెలిపారు.



**భక్తులకు ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు..**

దేవాలయ ఏర్పాట్ల కోసం భాగస్వామ్యం అవుతున్న అందరికీ అభినందనలు తెలియజేశారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఆలయం లోపల కేబుల్ వైర్‌లు కొత్తవి వేసి ఇబ్బందులు, ప్రమాదాలు జరగకుండా చూసుకోవాలన్నారు. భారీ కెడింగ్ జాలి ఏర్పాటు చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. ఆతిథ్యం ఇవ్వడంలో హైదరాబాద్ నగర ప్రజలు ఎవరికీ తీసి పోరన్నారు. దేశ విదేశాల నుంచి వచ్చే భక్తులకు స్థానిక హైదరాబాద్ ప్రజలు వారి ఆతిథ్యం ఇవ్వాలన్నారు. ఒక్కో వారం ఒక్కో ఏరియాలో పండుగ జరుగుతుంది కాబట్టి ఆయా ప్రాంతాల్లో వాటర్ ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని.. అవసరమైతే రెండు సార్లు నీటిని ఇవ్వాలని ఆదేశించారు. హైదరాబాద్ మొత్తం ఒకేసారి పండుగ జరిగితే కొంత ఇబ్బంది ఉంటుందని.. కానీ ఒక్కో వారం ఒక్కో ఆలయంలో ఉంటుందని, భద్రత విషయంలో పోలీసులు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు.

# దొంగలను దోచుకున్న దొంగలు

## థ్రిల్లర్ సినిమాను తలపించిన ట్విస్ట్‌లు

(మొదటిపేజీ తరువాయి)

ఈఎంఐ కట్టలేదని వాహనం జప్తుకు వెళ్ళిన గ్యాంగ్ బ్యాగు నిండా డబ్బు చూసే సరికి కొత్త ఆలోచన వచ్చింది. అంతే నగదు ఉన్న బ్యాగుతో ఉడాయించారు. దోపిడీకి గురైన బాధితుడు ఫిర్యాదుతో దర్యాప్తు చేసిన పోలీసులకు సినీ థ్రిల్లర్ ను తలపించే క్రైం సీన్ కనిపించింది. మొత్తం 28 మందిని ఈ నేరంలో గుర్తించిన హైదరాబాద్ నార్త్ జోన్ పోలీసులు మంగళవారం 18 మందిని అరెస్టు చేశారు. మరో 10 మంది పరారీలో ఉన్నారు. నార్త్ జోన్ డీసీపీ సాధన రష్మి పెరుమాల్ , అదనపు డీసీపీలు అశోక్ కుమార్, మహంకాళి ఏసీపీ సైదయ్యలతో కలిసి వివరాలను వెల్లడించారు. ఏపీ క్రిష్ణా జిల్లాకు చెందిన చంద్రశేఖర్ వర్మ, నాగరాజు కుమార్ లు అన్నదమ్ములు. వీరు తక్కువ ధరకు బంగారం ఇస్తామని నమ్మించి దోపిడీలకు పాల్పడుద్దామని పథకం వేశారు. నగదులో చెల్లించే వారికి మాత్రమే ఈ ఆఫర్ ఇద్దామని ప్లాన్ చేశారు. అలా నగదుతో ముందుకు వచ్చే వారిని టార్గెట్ చేసి లావాదేవిలు జరుపుతున్న సమయంలో తమ అనుచరులను నకిలీ పోలీసు రూపంలో దించి నగదును దోచుకుని పారిపోవాలని స్కెచ్ వేసుకున్నారు. ఇలా సికింద్రాబాద్ పాట్ మార్కెట్ ప్రాంతంలోని బంగారం దుకాణం యజమానులను టార్గెట్ చేశారు.

### పోలీసు వేషంలో..

సికింద్రాబాద్ పాట్ మార్కెట్ లో హరిరామ్ బంగారం వ్యాపారం నిర్వహిస్తున్నాడు. అతని దగ్గర రాంబాబు, రాధేశ్యామ్ పని చేస్తున్నారు. చంద్రశేఖర్ వర్మ స్కెచ్ ను తెలుసుకున్న రాధేశ్యామ్, హరిరామ్ కు మీ దగ్గర నగదు ఉంటే ఐదు శాతం తక్కువ ధరకు కేజీ బంగారాన్ని ఇవ్వడానికి తెలిసిన వారు ఉన్నారని చెప్పారు. హరిరామ్ కు ఈ ఆఫర్ నచ్చి బంగారాన్ని కొనడానికి సిద్ధమయ్యాడు. నగదుతోనే కొనేందుకు రెడీ అన్నాడు. ఈ నెల 18 వ తేదిన చంద్రశేఖర్ వర్మ, నాగరాజులు తన అనుచరులతో సికింద్రాబాద్ బ్లూ సీ హోటల్ వద్ద సమావేశమయ్యారు. ఆ తర్వాత రాధేశ్యామ్ రాంబాబును హరిరామ్ దగ్గరకు తీసుకుపోయాడు. అక్కడ రాంబాబు డబ్బు చూసుకుని మా వాళ్లు బంగారం తీసుకువస్తారని చెప్పి లొకేషన్ ను తన గ్యాంగ్ కు పంపాడు. మొత్తం నలుగురు హరిరామ్ ఉన్న చోట కు వెళ్ళి మేము రాచకొండ ఎస్ఓటీ పోలీసులమంటూ ఐడి కార్డును చూపించి హరిరామ్ ను చితకబాదారు, రాధేశ్యాంను బెదిరించారు. 46 లక్షలు నగదు ఉన్న బ్యాగుతో అక్కడి నుంచి వెళ్ళిపోయారు. కారులో నలుగురు వెళ్ళిపోగా డబ్బును రాంబాబు, మరో అనుచరుడుభానులకు అప్పగించారు. ఈ ఇద్దరు డబ్బు ఉన్న బ్యాగుతో ద్విచక్రవాహనం మీద సికింద్రాబాద్ నుంచి తిరుమలగిరి వైపు వస్తున్నారు.



### సినిమా థ్రిల్లర్ లా

దోచుకున్న 46 లక్షల నగదుతో ఫుల్ ఖుషిలో ద్విచక్రవాహనం పై వస్తున్న భాను, రాంబాబులను తిరుమలగిరి వద్ద నలుగురు గుర్తు తెలియని వ్యక్తుల ఆపారు. దీంతో భయాందోళనకు గురైన రాంబాబు, భానులు అప్పుడే పోలీసులకు తెలిసిపోయిందా అంటూ కంగారు పడ్డారు. వాహనాన్ని ఆపిన వారు మీ ద్విచక్రవాహనం పై ఈఎంఐలు పెండింగ్ లో ఉన్నాయి మీ బైక్ ను సీజ్ చేస్తున్నామని గొడవకు దిగారు. ఈ గొడవలో నలుగురు వారి దగ్గర ఉన్న బ్యాగును తనిఖీ చేశారు. అందులో డబ్బులు ఉండడంతో వారు ఈ ఇద్దర్నీ బెదిరించి ఆ నగదు ఉన్న బ్యాగుతో పారిపోయారు. వెంటనే ఈ విషయాన్ని రాంబాబు ప్రధాన సూత్రధారి చంద్రశేఖర్ వర్మకు చెప్పాడు. అతను వాహనాన్ని సీజింగ్ చేసిన రోషన్ అండ్ గ్యాంగ్ తో గొడవపడ్డాడు.

### 100 సీసీ కెమెరాలు జల్లెడ పట్టారు

హరిరామ్ ఫిర్యాదుతో దర్యాప్తును ప్రారంభించిన పోలీసులు మొత్తం 100 సీసీ కెమెరాలను శోధించారు. అందులో దొరికిన ఆధారాలతో మొత్తం 28 మందిని గుర్తించారు. అందులో 18 మందిని అరెస్టు చేశారు. విచారణలో దోపిడీకి స్కెచ్ వేసిన ఒక ముఠా అయితే.... సీజింగ్ కోసం వచ్చి దోపిడీ చేసిన వారి నుంచి నగదును దోచుకుని వెళ్ళింది మరో ముఠా అని గుర్తించి పోలీసులే ఆశ్చర్యానికి గురయ్యారు. మోసగాళ్లకు మొసగాళ్లుగా ఈ దోపిడీ సంఘటన ఇప్పుడు సంచలనం రేపుతుంది. పరారీలో ఉన్న మరో 10 మంది కోసం పోలీసులు గాలిస్తున్నారు. 46 లక్షల నగదు, 23 మొబైల్ ఫోన్ లు , రెండు కార్లు, నాలుగు ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నారు. రాచకొండ ఎస్ఓటీ పోలీసు అంటూ ఐడి కార్డు చూపించి బెదిరించిన వ్యక్తి నాగర్ కర్నూలు కు చెందిన కేశవులుగా పోలీసులు గుర్తించారు. అతను టీజీఎస్పి విభాగంలో కానిస్టేబుల్ గా పని చేస్తున్నట్లు తెలిపారు.

# ఏం చేస్తున్నారో అర్థం అవుతోందా?

## మంత్రులు, నేతలకు సీఎం రేవంత్ వార్నింగ్

## కొందరు ఎమ్మెల్యేలపై కూడా సీఎం ఫైర్

**హైదరాబాద్, మహా:** వర్గవిభేదాలు పక్కన పెట్టి, పార్టీ బలోపేతమే లక్ష్యంగా పని చేయాలని సీఎం రేవంత్ రెడ్డి మంత్రులు, నేతలకు స్పష్టం చేశారు. పీఏసీ మీటింగ్ లో మంత్రుల పనితీరుపై సీఎం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. కొందరు ఎమ్మెల్యేలపై కూడా రేవంత్ ఫైర్ అయినట్లు సమాచారం. అంతర్గతంగా మాట్లాడుకోవాల్సిన పార్టీ విషయాలను ప్రెస్ మీట్లు పెట్టి, సభల్లో మాట్లాడడం ఏంటని ఆయన ఫైర్ అయ్యారు. గొడవలతో పార్టీకి నష్టం చేస్తామంటే ఊరుకోనని వార్నింగ్ ఇచ్చినట్లు సమాచారం. పార్టీకి వ్యతిరేకంగా ర్యాలీలు, ధర్నాలు చేస్తే బాగుండదని తేల్చిచెప్పినట్లు పార్టీ వర్గాల్లో చర్చ సాగుతోంది. రానున్న జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఖచ్చితంగా గెలవాల్సిందేనని స్పష్టం చేసినట్లు సమాచారం. పొన్నం ప్రభాకర్ సారథ్యంలో హైదరాబాద్ జిల్లా నేతలు ఇందు కోసం పని చేయాలని చెప్పినట్లు తెలుస్తోంది. పీఏసీ సమావేశంలో స్థానిక సంస్థల ఎన్నికలపై హాట్ హాట్ గా చర్చ జరిగింది. వీలైనంత త్వరగా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని మంత్రులు కోరారు. స్థానిక ప్రజా ప్రతినిధులు లేకపోవడంతో తమపై ఒత్తిడి పెరుగుతుందని చెప్పారు. ప్రతి చిన్న పనికి మంత్రుల వద్దకు రావడంతో పని భారం పెరుగుతుందని తెలిపారు. వీలైనంత త్వరలో స్థానిక ఎన్నికలు నిర్వహిద్దామని.. పార్టీ బలోపేతం, స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపు బాధ్యతలు మంత్రులు తీసుకోవాలని ఈ సందర్భంగా సీఎం సూచించారు.

# కవిత బీసీ ఉద్యమానికి మార్క్సిస్టుల మద్దతు

## రైల్ రోకో కార్యక్రమానికి సీపీఎం మద్దతు ప్రకటన

### కవిత అభ్యర్థనకు జాన్ వెస్లీ సానుకూల స్పందన

### ఢిల్లీకి వెళ్లడంలో రేవంత్ హాఫ్ సెంచరీ: ఎమ్మెల్సీ కవిత



**హైదరాబాద్, మహా:** తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత సాగిస్తున్న బీసీ ఉద్యమానికి సీపీఎం మద్దతు ప్రకటించింది. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీతో మంగళవారం కవిత భేటీ అయ్యారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల సాధనకై జూలై 17న చేపట్టనున్న రైల్ రోకో కార్యక్రమానికి మద్ధతివ్వాలని ఆమె వారికి వినతి పత్రం అందించారు. కవిత అభ్యర్థనకు జాన్ వెస్లీ సానుకూలంగా స్పందించారు. భేటీ అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. కవిత బీసీ ఉద్యమానికి సంపూర్ణ మద్ధతు ప్రకటిస్తున్నట్లుగా ప్రకటించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు న్యాయమైన డిమాండ్ అని.. సామాజిక న్యాయం కోసం ఎమ్మెల్సీ కవిత చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల సాధనకై జూలై 17న చేపట్టనున్న రైల్ రోకోకు మద్దతునిస్తామని తెలిపారు. రిజర్వేషన్లను పెంచి అసమానతలను తొలగించాల్సిన బాధ్యత కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలపై ఉందని స్పష్టం చేశారు. బీజేపీ సామాజిక న్యాయానికి వ్యతిరేకంగా ఉంటుందని.. మొన్నటి వరకు కులగణనను కూడా బీజేపీ పార్టీ వ్యతిరేకించిందన్నారు. ప్రజా ఉద్యమాలకు తలొగ్గి కులగణన చేయడానికి తాజాగా బీజేపీ ముందుకొచ్చిందని.. అయితే రిజర్వేషన్ల పెంపుపై రాష్ట్ర బీజేపీ నాయకులు నోరువిప్పడం లేదని విమర్శించారు. 42 శాతం రిజర్వేషన్ల విషయంలో కేంద్రంపై ఒత్తిడి చేసే బాధ్యత బీజేపీ నాయకులపై కూడా ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా బీసీ రిజర్వేషన్ బిల్లు ఆమోదం కోసం కేవలం కేంద్రానికి వినతి పత్రాలు అందించే వరకు మాత్రమే పరిమితం కావద్దన్నారు. బిల్లు ఆమోదం కోసం అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లాల్సిన బాధ్యత సీఎం రేవంత్ రెడ్డిదేనని స్పష్టం చేశారు. ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ బీసీలకు ఇచ్చిన ఎన్నికల హామీ కామారెడ్డి డిక్లరేషన్ అమలు కోసం గత రెండేళ్లుగా ఉద్యమిస్తున్నామని తెలిపారు. అందులో భాగంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల బిల్లును అసెంబ్లీ ఆమోదించిందన్నారు. రాష్ట్రపతి ఆమోదానికి బిల్లు మూడు నెలల క్రితమే వెళ్లినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి చేయడం లేదని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు తీరని అన్యాయం చేస్తోందని విమర్శించారు.

ఢిల్లీకి వెళ్లడంలో హాఫ్ సెంచరీ చేసినా సీఎం రేవంత్ రెడ్డి ప్రధాని మోదీతో బీసీ రిజర్వేషన్ బిల్లు ఆమోదం అంశంపై మాట్లాడకపోవడం శోచనీయమన్నారు. బిల్లు ఆమోదం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి పెంచాలంటే ఉద్యమబాటనే మార్గం అని.. అందుకోసం జూలై 17న రైల్ వ్యవస్థను స్థంభించే విధంగా రైల్ రోకో చేపట్టబోతున్నామని తెలిపారు. కలిసివచ్చే భావసారుప్యతగల శక్తులన్నింటినీ మద్దతు కోసం కలుస్తున్నామన్నారు. ఉద్యమాలకు పేరెన్నికగల సీపీఎం పార్టీ నాయకులను కూడా కలిశామని..బిల్లు ఆలస్యమైతే బీసీలు ఉద్యోగులు, విద్యార్థులు రిజర్వేషన్లలో వాటాను కోల్పోతారన్నారు. కాంగ్రెస్ పార్టీ కలెక్టరేట్ లలో పెట్టే తెలంగాణ తల్లి విగ్రహాలను తాము కాంగ్రెస్ తల్లి విగ్రహాలుగానే చూస్తున్నామని..మళ్లీ మేం అధికారంలోకి వచ్చిన వెంటనే వాటిని తొలగించి గాంధీ భవన్ కు తరలిస్తామన్నారు. కాంగ్రెస్ తల్లి విగ్రహాల స్థానంలో తెలంగాణ తల్లి విగ్రహాలను ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. తెలంగాణ ఉద్యమ ప్రతీకలను పక్కకు తోసి కొత్త వాటిని ఉద్యమ ప్రతీకలుగా చేస్తున్న కాంగ్రెస్ కుట్రలను ప్రజలు అర్థం చేసుకుంటారన్నారు

# ఆపరేషన్ నార్నియా..

## నిద్రలో ఉండగానే 10 మంది ఇరాన్ సైంటిస్టులు హతం!



**టెహ్రాన్ :** ఇజ్రాయెల్ బలగాలు (ఐడీఎఫ్) ఆపరేషన్ నార్నియాతో.. ఇరాన్ అణు కార్యక్రమంపై ఊహించని విధంగా దెబ్బకొట్టాయి. రాత్రిపూట తమ ఇంటిలో నిద్రిస్తున్న 10 మంది ఇరాన్ సైంటిస్టులను.. ఐడీఎఫ్ హతమార్చినట్టు 'చానల్ 12' వార్తా కథనం పేర్కొన్నది. ఇరాన్ అణు కార్యక్రమం నిలిచిపోవాలంటే, అందులో కీలకంగా ఉన్న సైంటిస్టుల్ని మట్టుబెట్టేందుకు ఇజ్రాయెల్ సిద్ధమైంది. ఇందుకోసం ఐడీఎఫ్ ప్రత్యేక సైనిక ఆపరేషన్ 'నార్నియా'ను చేపట్టింది. అణ్వస్త్రాల తయారీలో అపార అనుభవం, ఇరాన్ అణు కార్యక్రమంలో కీలకంగా ఉన్న సైంటిస్టుల జాబితా సిద్ధం చేసుకొని..నిఘా వర్గాల కచ్చితమైన సమాచారంతో లక్ష్యాలను ఐడీఎఫ్ పూర్తిచేసింది. బయటి ప్రపంచానికి తెలియని ఓ ప్రత్యేక ఆయుధాన్ని ఈ ఆపరేషన్ నార్నియాలో ఇజ్రాయెల్ వాడినట్టు తెలిసింది.

**ఎవరా సైంటిస్టులు?**

ఫెరియెదౌన్ అబ్బాసీ (అణు ఇంజనీరింగ్), మహమ్మద్ మాహ్దీ టెహ్రాంచీ (ఫిజిక్స్) అక్బర్ మటాలి జాదే (కెమికల్ ఇంజనీర్), సయీద్ బెరాజీ (మెటీరియల్స్ ఇంజనీర్), ఆమీర్ హస్సన్ ఫాకాహీ (ఫిజిక్స్), అల్ హమీద్ మినుషార్ (రియాక్టర్ ఫిజిక్స్), మాన్సోర్ అస్గరీ (ఫిజిక్స్), రెజా దవలపార్కీ దర్యానీ (అణు ఇంజనీర్), అలీ బాఖియా కాథెహెర్కి (మెకానికల్).. వీళ్లంతా ఆపరేషన్ నార్నియాకు బలయ్యారని చానల్ 9, చానల్ 12 వార్తా కథనాలు తెలిపాయి.

# గాజాలో 56 వేలు దాటిన మృతుల సంఖ్య



**డేర్ అల్ బలాహ్ :** హమాస్ అంతమే లక్ష్యంగా దాడులు ప్రారంభించిన సుమారు రెండేండ్ల కాలంలో ఇజ్రాయెల్ మిలిటరీ చేతిలో గాజాలో 56 వేల మందికి పైగా మరణించారని పాలస్తీనా ఆరోగ్య శాఖ వెల్లడించింది. 2023, అక్టోబర్ 7 నుంచి జరుగుతున్న దాడుల్లో 56,077 మంది మరణించారని, 1,31,848 మంది గాయపడ్డారని తెలిపింది. రెండింటి మధ్య కాల్పుల విరమణ ఒప్పందం జరిగిన మార్చి 18 తర్వాత జరిగిన దాడుల్లో 5,759 మంది మరణించారని పేర్కొన్నది.

# రైతు భరోసా పేరిట డ్రామాలు

- విజయోత్సవాలు కాదు.. రైతులకు క్షమాపణ చెప్పాలి
- కాంగ్రెస్ పార్టీది రైతు సంక్షోభ ప్రభుత్వం
- దుర్మార్గ పాలనలో 511 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నందుకా సంబరాలు?
- మాజీ మంత్రి హరీశ్ రావు మండిపాటు



**హైదరాబాద్, మహా:** స్థానిక సంస్థల ఎన్నికల ముందు రైతు భరోసా పేరిట ఆడుతున్న డ్రామాలు ఆపి, 19 నెలల కాలంలో రైతన్నను అరిగోస పెట్టుకున్నందుకు కాంగ్రెస్ ప్రభుత్వం క్షమాపణలు చెప్పాలని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు డిమాండ్ చేశారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఎకరాకు 15,000 చొప్పున ఇస్తామని చెప్పి 12,000కి పరిమితం చేయడం మోసం చేయడమే అని ధ్వజమెత్తారు. గత వానకాలం రైతు భరోసా ఎగ్గొట్టి, యాసంగిలో ఎగ్గొట్టి, ఓట్ల కోసం ఇప్పుడు విజయోత్సవాల పేరిట సంబరాలు జరపడం రైతులను మోసం చేయడమే అని మండిపడ్డారు. చెప్పింది కొండంత, చేసింది గోరంత. ఎన్నికల ప్రచారంలో రైతులను మభ్య పెట్టావు. అధికారంలోకి వచ్చాక నిండా ముంచావు. రైతులకు ఏం చేశావని సంబరాలు చేస్తున్నావ్ రేవంత్ రెడ్డి..? రెండు సీజన్ల రైతు భరోసా ఎగ్గొట్టినందుకా? కౌలు రైతులకు రైతు భరోసా ఇవ్వనందుకా? రైతు కూలీలందరికి ఆత్మీయ భరోసా అని ఇవ్వకుండా మోసం చేసినందుకా? రుణమాఫీ చారణ చేసి బారాణ మందిని మోసం చేసినందుకా? అన్ని పంటలకు బోనస్ అని, సన్నాలకే పరిమితం చేసినందుకా అంటూ ప్రశ్నించారు.

**రైతు బీమా అమలు ప్రశ్నార్థకం..**

1200 కోట్ల బోనస్ డబ్బులు చెల్లించినందుకా? ప్రీమియం చెల్లించక రైతు బీమా అమలు ప్రశ్నార్థకం చేస్తున్నందుకా? పంట బీమా అని చెప్పి ఉసురుమనిపించినందుకా? దేశానికి అన్నం పెట్టే రైతన్నలపై అక్రమ కేసులు బనాయించి అరెస్టులు చేసినందుకా? లగచర్ల, రాజోలి రైతుల చేతులకు బేడీలు వేసినందుకా? ఏడాదిన్నర పాలనలో ఒక్క చెరువు నింపకుండా, ఒక్క చెక్ డ్యాం కట్టకుండా, కొత్తగా ఒక్క ఎకరాకు నీళ్ళు ఇవ్వనందుకా? ధాన్యం కొనుగోళ్ళు సక్రమంగా జరపనందుకా? జనుము, జీలుగు విత్తనాల ధరలు పెంచి, రైతులకు సకాలంలో అందించినందుకా? వరంగల్ రైతు డిక్లరేషన్ ను అటకెక్కించినందుకా? మీ దుర్మార్గ పాలనలో 511 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నందుకా? ఎందుకు సంబురాలు చేస్తున్నావు రేవంత్ రెడ్డి? అని హరీశ్‌రావు నిలదీశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఇప్పటివరకు రైతుల బతుకులు సంక్షోభంలో కూరుకుపోయాయి. బిఆర్ఎస్ పాలనలో ఎలాంటి ఆందోళన లేకుండా ఉన్న రైతన్న నేడు ప్రభుత్వ పథకాలు అందక పంట పొలాల్లోనే కుప్ప కూలుతున్నడు. బీఆర్ఎస్ పార్టీది రైతు సంక్షేమ ప్రభుత్వం అయితే, కాంగ్రెస్ పార్టీది రైతు సంక్షోభ ప్రభుత్వం. కేసీఆర్ నాట్లకు నాట్లకు మధ్య రైతు బంధు ఇస్తే, మీరు ఓట్లకు ఓట్లకు మధ్య రైతు భరోసా ఇచ్చి మభ్య పెట్టాలని చూస్తున్నారు. స్థానిక ఎన్నికల నేపథ్యంలో చేస్తున్న నీ జిమ్మిక్కులను రైతులు నమ్మరు. రైతులను కన్నీళ్లు పెట్టించినందుకు, ఉసురు తీసుకున్నందుకు విజయోత్సవాలు కాదు క్షమాపణలు చెప్పండి. ఇచ్చిన హామీలు ఇప్పటికైనా అమలు చేయండి అని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

# 400 కిలోల యురేనియం అదృశ్యంపై ఆందోళన!

## దానితో 10 అణ్వస్త్రాలు తయారు చేయొచ్చు..

## అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ వెల్లడి

**న్యూఢిల్లీ:** ఇరాన్‌లోని మూడు అణు పరిశోధనా కేంద్రాలపై అమెరికాకు చెందిన ఆరు బంకర్ బస్టర్ బాంబులు దాడి చేసిన తర్వాత ఆచూకీ తెలియకుండా పోయిన 400 కిలోల యురేనియం నిల్వలపై ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ యురేనియం నిల్వలతో 10 అణు బాంబులను తయారు చేయవచ్చని అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ ఏబీసీ న్యూస్‌కు తెలిపారు. నూతన అణ్వస్త్ర ఒప్పందంపై అమెరికాతో చర్చలు పునరుద్ధరించే సందర్భం వచ్చినపుడు మాయమైన యురేనియం నిల్వలను బూచిగా చూపించి ఇరాన్ తన షరతులను ముందుకు తెచ్చే అవకాశం ఉంది. ప్రస్తుతం 60% శుద్ధి చేసిన ఈ నిల్వలను దాదాపు 90% శుద్ధి చేసిన తర్వాత అణ్వస్త్రాలకు ఉపయోగించవచ్చు. అమెరికా బాంబులు వేయడానికి ముందే యురేనియం నిల్వలతోపాటు కొన్ని పరికరాలను వేరే రహస్య ప్రదేశానికి తరలించి ఉంటుందని ఇజ్రాయెలీ అధికారులు తెలిపారు. ఇరాన్‌లోని ఫోర్డో, నటాంజ్, ఇస్ఫాహన్ అణు పరిశోధనా కేంద్రాలపై అమెరికా బంకర్ బస్టర్ బాంబులతో



దాడి చేసింది. ఈ దాడి జరగడానికి ముందు తీసిన ఉపగ్రహ చిత్రాలలో భూగర్భ ఫోర్డో అణు కేంద్రం వెలుపల వరుసగా నిలిపి ఉన్న 16 ట్రక్కులు కనిపించాయి. బాంబు దాడి తర్వాత తీసిన ఉపగ్రహ చిత్రాలలో మూడు అణు కేంద్రాల వెలుపల విధ్వంసం జరిగినట్లు కనిపిస్తుండగా ట్రక్కులు మాత్రం మాయమయ్యాయి. అయితే ఈ ట్రక్కులలో వేటిని తరలించారు, ఎక్కడకు తరలించారు స్పష్టం కానప్పటికీ ఇస్ఫాహన్ సమీపంలో ఉన్న మరో భూగర్భ స్థావరానికి యురేనియం నిల్వలను తరలించి ఉండవచ్చని అనుమానిస్తున్నారు.

# భారత్ ఓటమి

- 5 వికెట్ల తేడాతో ఇంగ్లాండ్ ఘన విజయం
- 81 ఓవర్లలోనే 371 పరుగుల లక్ష్యం ఛేదన
- కెప్టెన్ గా గిల్ కు తొలి ఓటమి



**స్పోర్ట్స్, మహా:** అండర్సన్ టెండూల్కర్ ట్రోఫీలో భాగంగా ఇంగ్లాండ్‌తో జరిగిన తొలి టెస్టులో భారత్ ఓటమిపాలైంది. టీమ్ ఇండియా నిర్దేశించిన 371 పరుగుల లక్ష్యాన్ని ఆతిథ్య జట్టు 5 వికెట్లు కోల్పోయి ఛేదించింది. ఓపెనర్ బెన్ డకెట్ (149; 170 బంతుల్లో 21 ఫోర్లు, 1 సిక్స్) భారీ శతకం బాదాడు. జాక్ క్రాలీ (65), జో రూట్ (53*; 84 బంతుల్లో 6 ఫోర్లు) హాఫ్ సెంచరీలు సాధించారు. బెన్ స్టోక్స్ (33; 51 బంతుల్లో 4 ఫోర్లు) రాణించాడు. చివర్లో జేమీ స్మిత్ (44; 55 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్స్‌లు) దూకుడుగా ఆడాడు. భారత బౌలర్లలో ప్రసిద్ధ్ కృష్ణ 2, శార్దూల్ ఠాకూర్ 2, రవీంద్ర జడేజా ఒక వికెట్ పడగొట్టారు.

**గిల్ కు తొలి ఓటమి..**

రెండో ఇన్నింగ్స్‌లో 21/0 ఓవర్‌నైట్ స్కోరుతో ఐదో రోజు ఆటను ప్రారంభించిన ఇంగ్లాండ్.. తొలి సెషన్‌లో ఒక్క వికెట్టూ కోల్పోకుండా 96 పరుగులు చేసింది. రెండో సెషన్‌లో ఆతిథ్య జట్టు 152 పరుగులు చేసి నాలుగు వికెట్లు కోల్పోయింది. జాక్ క్రాలీ, తర్వాత వచ్చిన ఓలీ పోప్ (8)ని ప్రసిద్ధ్ కృష్ణ వరుస ఓవర్లలో పెవిలియన్‌కు పంపాడు. క్రాలీ, డకెట్ తొలి వికెట్‌కు 188 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు. ఆరంభం నుంచి దూకుడుగా ఆడిన డకెట్ 121 బంతుల్లోనే శతకం పూర్తి చేసుకున్నాడు. సెంచరీ తర్వాత మరింత జోరు పెంచి ఆడాడు. అయితే, టీ విరామానికి ముందు డకెట్, హ్యారీ బ్రూక్ (0)లను శార్దూల్ ఠాకూర్ వరుస బంతుల్లో ఔట్ చేయడంతో భారత్ పోటీలోకి వచ్చింది. అయితే, స్టోక్స్, రూట్ నిలకడగా ఆడి ఇన్నింగ్స్‌ను గాడిలో పెట్టారు. జడేజా బౌలింగ్‌లో స్టోక్స్ వెనుదిరిగినా రూట్, జేమీ స్మిత్ జట్టును విజయతీరాలకు చేర్చారు.

EDITORIAL సంపాదకీయం

# ఇజ్రాయెల్-ఇరాన్ యుద్ధంలో..
# ట్రంపిజం

## ట్రంప్ దౌత్యం.. అయినా ఇంకా ఉద్రిక్తతలు
## శాంతిదూత బిరుదు కోసం ఆపసోపాలు

**మహా :** ట్రంపిజం నవ్వులపాలవుతున్న ఏదో ఒక చోట సర్దుబాటుకు కారణమవుతోంది. ఇజ్రాయెల్ ఇరాన్ పరస్పర దాడుల తో పశ్చిమాసియా గత కొన్ని రోజులుగా అట్టుడికింది. క్షిపణులు, డ్రోన్ల దాడులతో ఇరుదేశాలూ దద్దరిల్లాయి. ఈ వివాదం లోకి అమెరికా తలదూర్చడంతో పరిస్థితి మరింత దిగజారింది. చివరకు టెల్అవీవ్, టెహ్రాన్‌లు కాల్పుల విరమణకు అంగీకరించినట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించడంతో.. తాజా యుద్ధానికి దాదాపు తెరపడినట్లయ్యింది. ట్రంప్ ప్రకటన తర్వాత ఉద్రిక్తలు కొంత కొనసాగినా, మొత్తానికి యుద్ధవాతావరణం స్లో డౌన్ అయినట్లు కనబడుతోంది.



**ఈ నేపథ్యంలో గత 12 రోజుల్లో చోటుచేసుకున్న కీలక ఘటనలు, పరిణామాలు, .**

**జూన్ 13:**

ఆపరేషన్ 'రైజింగ్ లయన్' పేరిట ఇరాన్‌లోని అణు కేంద్రాలు, క్షిపణి అభివృద్ధి ప్రాంతాలు, సైనిక స్థావరాలే లక్ష్యంగా ఇజ్రాయెల్ దాడులు ప్రారంభించింది. ఈ దాడుల్లో ఆరుగురు అణు శాస్త్రవేత్తలు, పలువురు ఉన్నతాధికారులు మృతి చెందారు. ఇరాన్ సైతం 'ఆపరేషన్ ట్రూ ప్రామిస్ 3' పేరిట ప్రతీకార దాడులు ప్రారంభించింది.

**జూన్ 14:**

ఇరాన్ దాడుల్లో ముగ్గురు ఇజ్రాయెల్ పౌరులు మృతి చెందగా.. మరో 76 మంది గాయపడ్డారు. మరోవైపు.. ఒమన్ వేదికగా అమెరికా ఇరాన్ మధ్య జరగాల్సిన తదుపరి రౌండ్ 'అణు' చర్చలు రద్దయ్యాయి.

**జూన్ 15:**

ఐఆర్‌జీసీ ఇంటెలిజెన్స్ చీఫ్ హుస్సేన్ తైబ్, అతడి డిప్యూటీని టెల్అవీవ్ మట్టుబెట్టింది. ప్రతిదాడుల్లో ఇజ్రాయెల్ బాత్ యామ్‌లోని ఓ నివాస భవనం కూలి తొమ్మిది మంది మృతి చెందారు. తమ దాడుల ఫలితంగా ఇరాన్‌లో పాలనాపర మార్పు సంభవించొచ్చని ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు అంచనా వేశారు. మరోవైపు.. ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీని హత్య చేయాలన్న టెల్అవీవ్ ప్రతిపాదనను ట్రంప్ తిరస్కరించారంటూ వార్తలు వెలువడ్డాయి.

**జూన్ 16:**

ఇరాన్ అధికార టీవీ భవనాన్నీ ఇజ్రాయెల్ లక్ష్యంగా చేసుకుంది. టెహ్రాన్ సైతం టెల్అవీవ్, హైఫాలపై దాడులు చేసింది. తమ దేశం అణ్వాయుధాలను కోరుకోవడం లేదని ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియాన్ పార్లమెంటును ఉద్దేశించి ప్రసంగించారు. ఖమేనీని హతమారిస్తేనే యుద్ధం ముగుస్తుందని నెతన్యాహు పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ వెంటనే టెహ్రాన్‌ను ఖాళీ చేయాలని ట్రంప్ సూచించారు.

**బాంబులు.. క్షిపణులు భయపెట్టలేవు: 'ది డిప్లొమాట్' జేపీ సింగ్ గురించి తెలుసా?**

**జూన్ 17:**

ఇరాన్ వ్యాప్తంగా పేలుళ్లు సంభవించాయి. ఇజ్రాయెల్‌లోని మిలిటరీ ఇంటెలిజెన్స్ సెంటర్, మొసాద్ ఆపరేషన్స్ ప్లానింగ్ సెంటర్‌పై క్షిపణి దాడులు చేసినట్లు టెహ్రాన్ ప్రకటించింది. జీ7 సదస్సు నుంచి ట్రంప్ ఆగమేఘాలపై అమెరికాకు చేరుకున్నారు. ఖమేనీ ఎక్కడ దాక్కున్నారో తమకు తెలుసని, కానీ.. ఆయన్ను ఇప్పుడు చంపాలనుకోవడం లేదన్నారు. ఇరాన్ లొంగిపోవాలని హెచ్చరించారు.

**జూన్ 18:**

ఇరాన్‌లోని 40 స్థావరాలను ఇజ్రాయెల్ లక్ష్యంగా చేసుకుంది. టెహ్రాన్ సైతం దీర్ఘశ్రేణి సెజ్జిల్ క్షిపణులను ప్రయోగించింది. ఇరుదేశాల దాడుల్లో జోక్యం చేసుకుంటానో లేదో తెలియదంటూ ట్రంప్ పేర్కొన్నారు. తమ దేశం లొంగిపోయే ప్రసక్తే లేదని, అమెరికా కలగజేసుకుంటే కోలుకోలేని పరిణామాలను ఎదుర్కోవాల్సి ఉంటుందని ఖమేనీ హెచ్చరించారు. మరోవైపు, ఇరాన్‌లో చిక్కుకున్న భారతీయులను స్వదేశానికి తీసుకొచ్చేందుకు 'ఆపరేషన్ సింధు' ప్రారంభించినట్లు భారత విదేశాంగ శాఖ ప్రకటించింది.

**జూన్ 19:**

అరాక్ భార జల అణుకేంద్రం, నతాంజ్‌తోపాటు ఆయా ప్రాంతాలపై టెల్అవీవ్ దాడి చేసింది. మరోవైపు.. టెహ్రాన్ క్షిపణులు ఇజ్రాయెల్‌లోని సొరొక ఆస్పత్రిని తాకాయి. ఈ దాడిలో అనేక మంది తీవ్రంగా గాయపడ్డారు. ఖమేనీకి ఉనికిలో ఉండే హక్కే లేదంటూ.. ఇజ్రాయెల్ రక్షణశాఖ మంత్రి కాట్జ్ తీవ్రంగా స్పందించారు.

**జూన్ 20:**

టెహ్రాన్ 17వ విడత క్షిపణి దాడులు చేసింది. టెల్అవీవ్ దాడుల్లో ఇరాన్‌లో అప్పటివరకు 639 మంది మృతి చెందారని హ్యూమన్ రైట్స్ యాక్టివిస్ట్ న్యూస్ ఏజెన్సీ తెలిపింది.

**జూన్ 21:**

ఇరాన్‌లోని ఇస్ఫహాన్‌లోని అణు కేంద్రంపై వైమానిక దాడులు జరిగాయి. ఐఆర్‌జీసీకి చెందిన ముగ్గురు సీనియర్ కమాండర్లను హతమార్చినట్లు కాట్జ్ తెలిపారు. తొమ్మిది రోజుల్లో తమ దేశంలో 430 మంది మృతి చెందారని, 3,500 మంది గాయపడ్డారని ఇరాన్ తెలిపింది.

**జూన్ 22:**

'ఆపరేషన్ మిడ్‌నైట్ హ్యామర్' పేరిట అమెరికా నేరుగా యుద్ధ రంగంలోకి దిగింది. ఇజ్రాయెల్‌కు మద్దతుగా ఇరాన్‌లోని మూడు అణుశుద్ధి కేంద్రాలే లక్ష్యంగా అత్యంత శక్తిమంతమైన బాంబర్లు, క్షిపణులతో విరుచుకుపడింది. ఈ క్రమంలోనే.. ప్రపంచ చమురు జీవనాడి అయిన హర్మూజ్ జలసంధి మూసివేయాలని ఇరాన్ పార్లమెంటు నిర్ణయించినప్పటికీ.. అది కార్యాచరణలోకి తీసుకురాలేదు.

**జూన్ 23:**

పశ్చిమాసియాలోని అమెరికా సైనిక స్థావరాలే లక్ష్యంగా టెహ్రాన్ ప్రతీకార దాడులకు దిగింది. ఖతార్‌లోని అల్ ఉదీద్ ఎయిర్‌బేస్‌తోపాటు ఇరాక్‌లోని మరో స్థావరంపై క్షిపణులు ప్రయోగించింది. మరోవైపు.. ఇరాన్‌లోని ఎవిన్ జైలుతోపాటు ఐఆర్‌జీసీ కమాండ్ సెంటర్, ప్రభుత్వ సంస్థలను టెల్అవీవ్ లక్ష్యంగా చేసుకుంది.

**జూన్ 24:**

ఇరుదేశాలు కాల్పుల విరమణకు అంగీకరించాయని ట్రంప్ పోస్ట్ చేశారు. దీంతో 12 రోజుల యుద్ధానికి ముగింపు కార్డు పడనుందన్నారు. అయినప్పటికీ.. ఇరు దేశాల మధ్య దాడులు కొనసాగినట్లు సమాచారం. దీన్ని ట్రంప్ తీవ్రంగా తప్పుపట్టారు. దీంతో నెతన్యాహు సైన్యం వెనక్కి తగ్గింది.

**టెల్అవీవ్ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం..**

జూన్ 13 నుంచి ఇరాన్ 500కిపైగా క్షిపణులు, వెయ్యికి పైగా డ్రోన్లను ప్రయోగించింది. ఈ దాడుల్లో 25 మంది మృతి చెందారు. 1,300 మంది గాయపడ్డారు. మరోవైపు.. టెహ్రాన్‌లోని కోటి మంది జనాభాలో పెద్ద సంఖ్యలో పౌరులు సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లినట్లు తెలుస్తోంది.

# స్థానిక సంస్థల ఎన్నికలు జరిగితే గెలుపెవరిది..?

ప్రజాస్వామ్య వికేంద్రీకరణ లక్ష్యంతో గ్రామ పంచాయతీలు, మండల పరిషత్‌లు, జిల్లా పరిషత్‌లు, మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్‌ల ఎన్నికలు స్థానికంగా ప్రభుత్వ పాలనను బలోపేతం చేయడానికి జరుగుతాయి. ఈ స్థానిక ఎన్నికల నేపథ్యం రాజ్యాంగంలోని 73వ, 74వ సవరణలపై ఆధారపడి ఉంది. 1992లో ఈ సవరణల ద్వారా గ్రామీణ, పట్టణ స్థానిక సంస్థలకు రాజ్యాంగ హోదా లభించింది, వీటి ద్వారా స్థానిక స్వపరిపాలన, సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల అమలుకు చట్టబద్ధమైన వేదిక ఏర్పడింది. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత ఈ సంస్థలు రాష్ట్ర చట్టాలకు అనుగుణంగా పునర్వ్యవస్థీకరించబడ్డాయి. పంచాయతీ రాజ్ చట్టం, మున్సిపల్ చట్టాల ద్వారా ఎన్నికల నిర్వహణ, రిజర్వేషన్లు, అధికారాలు నిర్దేశించబడ్డాయి. ప్రస్తుతం తెలంగాణలో 12,769 గ్రామ పంచాయతీలు, ఐదు వేలకు పైగా ఎంపీటీసీ, ఐదు వందలకు పైగా జెడ్పీటీసీ స్థానాలు, 129 మున్సిపాలిటీలు, 13 మున్సిపల్ కార్పొరేషన్‌లు ఉన్నాయి.

గత ఏడాది జరగాల్సిన స్థానిక ఎన్నికలు పలు కారణాల రీత్యా వాయిదా పడుతూ వచ్చాయి. ఈ నెల చివరి వారంలో ఎన్నికల నగారా మోగనుందనీ, జులై నెలలో మొదట ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు తదనంతరం గ్రామ పంచాయతీ ఎన్నికలు జరుపనున్నారని వార్తలు వస్తున్నాయి. ఆయా స్థానాల్లో ఇంకా రిజర్వేషన్లు ఖరారు కావాల్సి ఉంది. కాంగ్రెస్ పార్టీ అధికారాన్ని చేపట్టిన తర్వాత జరిగే మొదటి స్థానిక ఎన్నికలు ఇవి. గత ఏడాదిన్నర పాలనకు రిఫరెండంగా అధికార పార్టీ భావిస్తూ ఉంటే, ప్రభుత్వం పై వ్యతిరేకత తమకు అనుకూలంగా ఉంటుందని ప్రతిపక్ష బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు భావిస్తూ ఉన్నాయి. ఈ ఎన్నికల్లో గెలిచిన వారే రాబోయే అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో రాజకీయ పార్టీల గెలుపు, ఓటముల్ని ప్రభావితం చేసే పోల్ మేనేజ్మెంట్ లో ముఖ్య భూమిక పోషించనున్న నేపథ్యంలో అన్ని పార్టీలకు స్థానిక ఎన్నికలు కీలకంగా మారాయి.

రాష్ట్రంలో ప్రధానంగా కాంగ్రెస్,బీఆర్ఎస్,బీజేపీ మధ్య త్రిముఖ పోటీ నెలకొంది. ఎంఐఎం ప్రస్తుతానికి పాత బస్తీకే పరిమితమైనప్పటికీ ముస్లిం ఓటు బ్యాంక్ గణనీయంగా ఉన్న మున్సిపాలిటీ, మున్సిపల్ కార్పొరేషన్లలో ఈ మూడు ప్రధాన పార్టీల గెలుపోటముల్ని ప్రభావితం చేసే స్థాయిలో ఉంది. 2023 శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ 64 సీట్లతో అధికారంలోకి రాగా, బీఆర్ఎస్ 39 సీట్లతో ప్రధాన ప్రతిపక్షంగా నిలిచింది. బీజేపీ 8 సీట్లకి పరిమితమైనప్పటికీ, 2024 లోక్‌సభ ఎన్నికల్లో 8 సీట్లు గెలుచుకొని బలీయమైన శక్తిగా ఎదిగింది. స్థానిక ఎన్నికలు గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో పార్టీల బలాబలాల్ని పరీక్షించే అవకాశంగా చెప్పవచ్చు. గ్రామ పంచాయతీల ఎన్నికలు పార్టీ గుర్తులపై జరగవు కాబట్టి వ్యక్తిగత ప్రభావం, స్థానిక సామాజిక సమీకరణాలు కీలకంగా మారతాయి, అయితే ఎంపీటీసీ, జెడ్పీటీసీ, మున్సిపాలిటీల ఎన్నికలు పార్టీ గుర్తులపై జరగడం వల్ల పార్టీల రాజకీయ ఆధిపత్యాన్ని ప్రతిబింబిస్తాయి.

గత ఏడాదిన్నర నుండి కాంగ్రెస్ ప్రభుత్వం పలు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల్ని అమలు చేస్తూ ఉందని, దాదాపు 21 వేల కోట్లతో 25 లక్షల మంది రైతులకు ఏకకాలంలో రుణమాఫీ, మహిళలకు ఉచితంగా ఆర్టీసీ బస్సు ప్రయాణం, రూ.500కే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రైతు భరోసా కింద ఏడాదికి రెండు విడతల్లో ఎకరానికి రూ.12,000, రేషన్ కార్డుల ద్వారా సన్నబియ్యం పంపిణి, ఇందిరమ్మ ఇండ్లు మొదలైన పథకాలు తమకు ఎన్నికల్లో లబ్ధి చేకూరుస్తాయని కాంగ్రెస్ పార్టీ విశ్వసిస్తుంది. అసెంబ్లీ ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు హామీల అమలులో జాప్యం, లగచర్ల ఘటన, హైడ్రా, మూసీ రివర్‌ఫ్రంట్ వంటి కార్యక్రమాల వల్ల ప్రజల్లో ప్రభుత్వంపై వ్యతిరేకత పెరిగిందంటూ బీఆర్ఎస్ చెప్తోంది, గతంలో అమలు చేసిన రైతు బంధు, కల్యాణ లక్ష్మి వంటి పథకాలతో తన రికార్డును ప్రచారం చేస్తూ, కాంగ్రెస్ హామీల అమలు వైఫల్యాన్ని ఎత్తిచూపుతోంది. బీజేపీ, జాతీయ స్థాయిలో దృఢమైన నాయకత్వం, వివిధ కేంద్ర ప్రభుత్వ పథకాలతో గ్రామీణ ప్రాంతాల్లో పట్టు సాధించేందుకు ప్రయత్నిస్తోంది.

పార్టీల బలాబలాల విషయానికొస్తే, కాంగ్రెస్ గ్రామీణ ప్రాంతాల్లో బలంగా ఉంది. 2023 శాసనసభ ఎన్నికల్లో సాధించిన స్థానాలు దీనికి ఉదాహరణగా చెప్పవచ్చు. బీఆర్ఎస్ గత పదేళ్ల పాలనలో వివిధ కుల వృత్తులకు చేదోడుగా ఆర్థిక సాయం అందించడం,వివిధ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల వల్ల గ్రామ స్థాయిలో బలమైన ఓటు బ్యాంకును సంపాదించుకుంది, కానీ 2023లో అధికారం కోల్పోవడం, అవినీతి ఆరోపణలు పార్టీ ప్రతిష్టను దెబ్బతీశాయి. అసెంబ్లీ ఎన్నికల తదనంతరం జరిగిన లోక్ సభ ఎన్నికల్లో ఒక్క ఎంపీ సీటును కూడా గెలువలేక పోయింది. ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీకి కూడా దూరంగా ఉంది. నేటికీ కాళేశ్వరం, ఫోన్ ట్యాపింగ్, ఫార్ములా ఈ రేస్ వంటి కేసుల పై విచారణ కొనసాగుతూనే ఉంది. ఇటీవలి కాలంలో జరిగిన పార్టీ రజతోత్సవం గులాబీ శ్రేణుల్లో కొంత జోష్ నింపిందని చెప్పవచ్చు. బీజేపీ ఉత్తర తెలంగాణలో బలపడుతున్నప్పటికీ, గ్రామస్థాయిలో సంస్థాగత బలం పరిమితంగానే ఉంది. కులగణన సర్వేతో పాటు 42% బీసీ రిజర్వేషన్ల అంశంపై కాంగ్రెస్ చేసిన ప్రయత్నాలు బీసీ ఓటర్లను ఆకర్షించే అవకాశం ఉన్నప్పటికీ, రాజ్యాంగ సవరణ అవసరం వల్ల ఇది అమలు కాకపోవడంతో రాజకీయంగా ఎవరి వాదనలు వారు వినిపిస్తున్నారు.

అసెంబ్లీ ఎన్నికలకు మరో మూడున్నర ఏండ్ల పాటు సమయం ఉన్నందున అధికార పార్టీకి స్థానిక ఎన్నికల్లో సహజంగానే కొంత లబ్ధి చేకూరే అవకాశం ఉంటుందా..? లేదా ఏడాదిన్నర కాంగ్రెస్ పాలన చూసిన ప్రజల నుండి ప్రభుత్వం మీద వ్యతిరేకత వ్యక్తం కానుందా అన్నది తేలాల్సి ఉంది. అధికార కాంగ్రెస్ పార్టీ వ్యూహాత్మకంగా స్థానిక ఎన్నికల నోటిఫికేషన్ కన్నా ముందే రాష్ట్రంలో ఉన్న దాదాపు 70 లక్షల మంది రైతులకు రైతు భరోసా సాయం అందించేందుకు సిద్ధమైంది. దీంతో పాటు ఏకకాలంలో రైతు రుణమాఫీ, రైతు భరోసా పథకాలు గేమ్ చేంజర్ గా మారబోతాయో వేచి చూడాలి..గ్రామీణ ప్రాంతాల్లో కాంగ్రెస్,బీఆర్ఎస్ పార్టీల మధ్య ప్రధాన పోటీ ఉంటే, పట్టణ ప్రాంతాల్లో కాంగ్రెస్, బీజేపీ,బీఆర్ఎస్ పార్టీల మధ్య త్రిముఖ పోటీ ఉంది. స్థానికంగా సామాజిక సమీకరణాలు, ఓటర్ల మనోగతం, పార్టీల వ్యూహాలపై ఫలితాలు ఆధారపడతాయి. ఈ ఎన్నికలు తెలంగాణ రాజకీయ పార్టీల భవిష్యత్తును నిర్దేశించే కీలక ఘట్టంగా నిలువనున్నాయి. అంతిమంగా ఏ పార్టీ గెలిచినా, ప్రజలకు మేలు జరిగితేనే ప్రజాస్వామ్యం గెలిచినట్టు అవుతుంది.



వ్యాసకర్త
డాక్టర్.అశోక్ మంద
రాజకీయ విశ్లేషకులు, 9959046499

జూన్-25 ఆచార్య ఎన్.గోపి గారి జన్మదినం సందర్భంగా....



# కాలాన్ని నిద్రపోనివ్వని కవి

ఎక్కడ కలం నిద్రిస్తుందో
అక్కడ ఆయన రాత్రిగా మారతాడు
ఓ వాక్యానికి వెలుగు కావాలంటే
అతని చూపు ఆలోచన కావాల్సిందే
"ముట్టుకుంటే తగలాలి కవిత్వం
మనిషిలాగా"
అన్నది కవిత కాదు,ఆయన బతుకు రేఖ

తంగేడు వాసనలతో మొదలైన మాట
తెలంగాణ తల్లి ఒడిలో పలికిన నినాదం
ఆవేదనకు అక్షరమయి,కవితాజ్వాల
దావనలము గా మారింది అతని చేతిలో
నానీల గింజను సాహిత్యములో నాటి
నాలుగు పాదాల్లో నలుదిక్కులు పంచాడు

నిక్కిగా నిలిచే ఎక్కదీపం,
ఎక్కి తిరుగాడే విమానం,
నక్కి చూస్తే నల్లపిల్లి,
తొక్కి మట్టి తీయదగిన పార
ముక్కిమూలిగే రెయిన్ కోట్,
లెక్కలేసే అంగీ జేబు
ఎక్కడెక్కడి పాత బట్టల మధ్య
కొత్త పాత్రలు కనిపించే మాటల మాయ.
కాదేదీ కవిత్వానికీ కనర్హం
మరోసారి నిరూపితమవుతుంది
అతని కవిత్వంలో

నవ్వులను మాలగా అల్లే గుణం
మనిషికి చిరునవ్వుల స్వాగతం
ప్రతివారికీ అనురాగ ఆశీర్వాదం
మానవత్వం విస్తరించిన వ్యక్తిత్వం

ఆత్మీయ అనురాగాల చలీవేంద్రం
ఆతని శిష్య గణం సాహిత్య కులశేఖరం
సాటిలేని మేటి బృందానికి నేత,
వర్తమాన కవులకు ఆదర్శంగా
నిలిచినవాడు

నూతనోతేజపు కాంతిపుంజంలా
తప్పొప్పుల తీర్పుకు కొత్తచూపులు
ప్రక్రియ సంధిగ్ధత కు ఓదార్పునిచ్చాడు
వాడిపోతున్న పచ్చదనానికి
కిరణజన్య సాహిత్యమయ్యాడు
గోపి సృజియించిన అక్షర శిల్పి

- డా.ఐ. చిదానందం
8801444335

రచనలకు ఆహ్వానం
ప్రతీరోజు ప్రచురితమయ్యే ఎడిట్ పేజీకి దేశ, రాష్ట్ర రాజకీయాలు, అంతర్జాతీయ పరిణామాలు, ప్రభుత్వాల తీరుతెన్నులు, వివిధ రంగాలపై విశ్లేషణలు, వ్యాసాలు, తాజా అంశాలపై అభిప్రాయాలు పంపండి.
మీ రచనలు పంపాల్సిన చిరునామా:
mahaapatrika@gmail.com
whatsapp-
9247580946



# డీసీసీబీ బ్యాంక్ భవనాన్ని ప్రారంభించిన శాసన సభాపతి

- డీసీసీబీ బ్యాంకులతో రైతులకు మేలు: ప్రసాద్ కుమార్
- వ్యవసాయ అవసరాలకు రుణాలు పొందొచ్చు చైర్మన్ సత్తయ్య

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** మోమిన్ పేటలో నూతనంగా నిర్మించిన డిసిసిబి బ్యాంక్ భవనాన్ని, తెలంగాణ రాష్ట్ర శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ ప్రారంభించారు. మంగళవారం వికారాబాద్ జిల్లాలోని మోమిన్ పెట మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన డీసీసీబీ బ్యాంక్ భవనాన్ని, తెలంగాణ రాష్ట్ర శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్,తెలంగాణ రాష్ట్ర కోఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్ వైస్ చైర్మన్, డీసీసీబీ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్యతో కలిసి ప్రారంభించారు. అనంతరం శాసనసభాపతి మాట్లాడుతూ... జిల్లా రైతులు వ్యవసాయ అవసరాలకు అనుగుణంగా తక్కువ వడ్డీతో ఎక్కువ రుణం పొందేందుకు డిసిసిబి బ్యాంకులు ఎంతో ఉపయోగకరమని అన్నారు. మోమిన్ పేటలో బ్యాంకు నిర్మించడం సంతోషంగా ఉందని అన్నారు. జిల్లా రైతులకు అందుబాటులో ఉండడం బ్యాంకులో రుణాలు తీసుకొని వ్యవసాయ పరికరాలు కొనుగోలు చేసుకుని, సకాలంలో తీసుకున్న రుణం చెల్లించినట్లయితే రైతులకు మేలు జరుగుతుందని తెలిపారు. యొక్క బ్యాంకును రైతులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా డిసిసిబి చైర్మన్ సత్తయ్య మాట్లాడుతూ... మోమిన్ పెట్ బ్యాంక్ శాఖను శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ ప్రత్యేక చొరవతో నిర్మించి, ప్రారంభించడం జరిగిందని, అందుకు ఆయనకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలపడం జరిగిందన్నారు. రైతులకు కో ఆపరేటివ్ విధానం, రుణాలపై వివరణ ఇచ్చారు. డీసీసీబీ బ్యాంక్ ద్వారా రైతులకు కలిగే ప్రయోజనాలను ఆయన తెలిపారు. అనంతరం రుణాలు పొందిన రైతులకు శాసన సభాపతి గడ్డం ప్రసాద్ చేతుల మీదుగా చెక్కులు అందజేశారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి బ్యాంక్ అధికారులు, రైతులు, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# రైతు భరోసా సంబరాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే జీఎస్సార్



**భూపాలపల్లి, మహా :** వానాకాలం పంటల సాగు కోసం రైతుభరోసా నగదు బదిలీ విజయవంతంగా పూర్తయిన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం 'రైతు పండుగ' పేరుతో సంబరాలు నిర్వహిస్తున్న సందర్భంగా మంగళ వారం భూపాలపల్లి జిల్లా కేంద్రంలో అంబేద్కర్ సెంటర్ లో భూపాలపల్లి కాంగ్రెస్ పార్టీ టౌన్ అధ్యక్షులు ఇస్లావత్ దేవన్ అధ్యక్షతన రైతు భరోసా సంబరాలు జరుపుకున్నారు. ముఖ్య అతిథిగా భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు ముఖ్య మంత్రి చిత్ర పటానికి పాలాభి శేఖం చేశారు. అనంతరం ఎమ్మెల్యే జీఎస్సార్ మాట్లాడుతూ ఇచ్చినమాట ప్రకారం 9 రోజుల్లో రూ.9 వేల కోట్ల నగదు బదిలీ చేయడం రాష్ట్ర చరిత్రలోనే అరుదైన రికార్డు అని, ఇప్పటి వరకు కోటి 49 లక్షల 39 వేల 111 ఎకరాలకు రైతు భరోసా అందించిన ఘనత సీఎం రేవంత్ రెడ్డిది, కాంగ్రెస్ ప్రభుత్వానిది అని ఎమ్మెల్యే జీఎస్సార్ అన్నారు. ఎలాంటి పరిమితులు లేకుండా సాగులో ఉన్న ప్రతి ఎకరానికీ పెట్టుబడి సాయం అందిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగాలేకపోయినా రైతు సంక్షేమం విషయంలో రాజీ పడకుండా పెట్టుబడి సాయం అందించారంటూ సీఎం రేవంత్ రెడ్డి గారికి కృతజ్ఞతలు తెలిపారు. రుణమాఫీ పథకాన్ని కూడా ఇలాగే 2024 ఆగస్టు 15 లోగా పూర్తిచేశామని చెప్పారు. గత ప్రభుత్వం ఎకరానికి 5 వేలు చొప్పున ఇస్తే కాంగ్రెస్ ప్రభుత్వం ఎకరానికి 6 వేల చొప్పున సంవత్సరానికి 12 వేలు చొప్పున రైతులకు అందించడం జరిగింది. కేంద్రం కొనుగోలు చేయలేని పంట ఉత్పత్తులను రాష్ట్ర ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేయిస్తోందని తెలిపారు. ఇట్టి కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మరియు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## మైనర్ బాలికపై లైంగిక వేధింపులు

**నిందితుడిపై ఫోక్సో కేసు నమోదు**

**ఆదిలాబాద్, మహా** షీటీం అవగాహనతో బాధితురాలికి జరిగిన అన్యాయం బట్టబయలు కాగా నిందితుడిపై ఫోక్సో కేసు నమోదు చేసినట్లు షీటీం ఇన్చార్జి, ఏఎస్ఐ బి. సుశీల తెలిపారు. జిల్లా వ్యాప్తంగా జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఆదేశాల మేరకు షీ టీం బృందం వివిధ కళాశాలలు, పాఠశాలల్లో విద్యార్థిని, విద్యార్థులు, మహిళలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తుంది. ఈ కార్యక్రమాల నిర్వహిస్తున్న సమయంలో పట్టణంలోని ఒక పాఠశాలలో షీటీం బృందం మహిళలు, విద్యార్థుల పట్ల గుడ్ టచ్, బ్యాడ్ టచ్ లపై అవగాహన కల్పించారు. ఇదే సందర్భంలో ఒక విద్యార్థిని షీ టీం బృందాన్ని సంప్రదించి తనకు జరుగుతున్న అన్యాయాన్ని వివరించింది. వెంటనే స్పందించిన షీ టీం బృందం కుటుంబ సభ్యులకు వివరాలను వెల్లడించి, తండ్రి ద్వారా ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయించగా నిందితుడిపై ఫోక్సో కేసు నమోదు చేసి మంగళవారం అరెస్ట్ చేసినట్లు తెలిపారు. బంగారిగూడకు చెందిన జాదవ్ కృష్ణ అనే వ్యక్తి పది సంవత్సరాల మైనర్ అమ్మాయికి ప్రతి రోజు రూ.10 ఇస్తూ చాక్లెట్లు, బిస్కెట్లు కొనిస్తూ లైంగికంగా వేధిస్తూ అసభ్యకరంగా ప్రవర్తించారని తెలిపారు.

# డ్రగ్స్ రహిత వరంగల్ కమిషనరేటే మనందరి లక్ష్యం

**వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్**




**హన్మకొండ మహా;** డ్రగ్స్ రహిత వరంగల్ పోలీస్ కమిషనరేట్‌గా గుర్తింపు సాధించడమే మనందరి లక్ష్యమని వరంగల్ పోలీస్ కమిషనర్ పిలుపునిచ్చారు. మాదక ద్రవ్యాల వ్యతిరేక వారోత్సవాలను పురస్కరించుకొని డ్రగ్స్ వ్యతిరేకంగా , ప్రజలకు అవగాహన కల్పించేందుకు రూపొందించిన వాల్ పోస్టర్లను వరంగల్ పోలీస్ కమిషనర్ మంగళ వారం అవిష్కరించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ మత్తుపదార్థాలను ఈ సమాజం నుండి తరిమి కొట్టేందుకు ప్రతి ఒక్కర పౌరుడు భాగస్వాములు కావడంతో పాటు పోలీసులుకు పూర్తి సహకారం అందించాలని, ఈ వారోత్సవాలను పురస్కరించుకోని వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో అన్ని వర్గాల ప్రజలకు మత్తు పదార్థాలపై అవగాహన కల్పించడంతో పాటు, వాటి వినియోగం వల్ల కలిగే నష్టాలపై ప్రజలకు పోలీసుల వివరించడం జరుగుతుందని తెలిపారు. ముఖ్యంగా ఉన్నత విద్యాసంస్థలతో పాటు ప్రభుత్వ ప్రైవెయిట్ పాఠశాల్లో ఈ డ్రగ్స్‌పై అవగాహన కల్పించడంతో పాటు, ర్యాలీలు, డ్రాయింగ్, వ్యాస రచన పోటీలను ఏర్పాటు చేయడం జరుగుతొందని, ఎవరైన మత్తు పదార్థాలు విక్రయించిన, వినియోగించిన తక్షణమే 8712584473 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని, సమచారం ఇచ్చిన వారి వివరాలను పూర్తి గోప్యంగా ఉంచబడుతాయని పోలీస్ కమిషనర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు డిసిపి రవి, సిసిఆర్‌బి ఏసిపి దేవిడ్‌రాజు, ఇన్‌స్పెక్టర్ ముష్క శ్రీనివాస్, పాల్గోన్నారు.

# స్థానిక సమస్యలను పరిష్కరించండి

**డివిజన్‌లో పర్యటించిన కమిషనర్, ఎమ్మెల్యే**

**వరంగల్ మహా;** బల్దియా పరిధి లోని వర్ధన్న పేట నియోజక వర్గానికి చెందిన 45వ డివిజన్ కుమ్మరి గూడెం ఇందిరమ్మ కాలనీ లో స్థానిక శాసనసభ్యులు కేఆర్ నాగరాజు, బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ లు మంగళవారం క్షేత్రస్థాయిలో పర్యటించి స్థానికులు ఎదుర్కొంటున్న సమస్యలను స్థానిక ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు సమస్యల పరిష్కారానికి తగు చర్యలు తీసుకోవాల్సిందిగా అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సిఎంహెచ్ఓ డా. రాజారెడ్డి, ఏసిపి రజిత, తహసీల్దార్ బావు సింగ్, ఏఈ మేనక, తదితరులు పాల్గొన్నారు.



# ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సత్కారం

- విద్యార్థులు ఉన్నతమైన విద్యను అభ్యసించాలి.. విద్యార్థులకు అండగా డా.ఎస్ కె బిక్షపతి
- విద్యార్థులను సత్కరించిన ఎంపీడీవో ఎంఈఓ



**రంగారెడ్డి జిల్లా మహా:** పదవ తరగతిలో ఉత్తమ ప్రతిభను కనబర్చిన విద్యార్థులకు డా.ఎస్ కె బిక్షపతి, బహుమతులు అందజేశారు. రంగారెడ్డి జిల్లా, మంచాల మండలం గ్రామీణ ప్రాంతం, జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల పదవ తరగతిలో కష్టపడి చదివి ఉన్నతమైన మార్కులను సాధించిన, తమ ప్రతిభను కనబరిచిన విద్యార్థులకు, డా. ఎస్ కె బిక్షపతి, గత పది సంవత్సరాల నుండి విద్యార్థులను ప్రోత్సహిస్తూ పారితోషికాలు అందజేస్తున్నారు. ఇందులో బాగంగా 2024 25 సంవత్సరంలో పదవ తరగతిలో మంచి ఉత్తీర్ణతను సాధించిన విద్యార్థులకు, మంగళవారం మండల కేంద్రంలో ఎంపీడీవో బాల శంకర్, ఎంఈఓ రాందాస్ శాలువాతో సత్కరించి, కాలికులేటర్స్, నోటు బుక్స్, ప్రశంసా పత్రాలు అందజేశారు. ఎంపీడీవో మాట్లాడుతూ మండలంలోని పేద విద్యార్థిగా విద్యనభ్యసించి, ఉన్నత స్థాయికి వచ్చిన డా. బిక్షపతిని ఆదర్శంగా తీసుకోవాలని విద్యార్థులకు సందేశమిచ్చారు. మండలంలో వంద శాతం ఉత్తీర్ణత సాధించిన జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల మంచాల (బాలికలు), చెన్నారెడ్డిగూడ ఉపాధ్యాయులను శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సీఆర్పిలు, ఆర్గనైజర్ అశ్వాల బాలరాజు, జగదీష్, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# సిఐటియు వరంగల్ జిల్లా ఆధ్వర్యంలో సమావేశం

**సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలి**

**వరంగల్ మహా;** సిఐటియు వరంగల్ జిల్లా విస్తృత సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కాసు మాధవి ఇటీవల కొత్తగా సిఐటియు బాధ్యతలు స్వీకరించిన ఆమె జరిగిన తొలి సమావేశంలో పాల్గొని కార్మికుల సమస్యల పై ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు ఎండి బషీర్, జిల్లా కార్యదర్శి అరూరి కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా సీనియర్ నాయకత్వానికి జిల్లా కమిటీ సభ్యులు, నాయకులందరికీ ధన్యవాదాలు తెలుపుతూ జూలై 9న సార్వత్రిక సమ్మెను ఐక్యంగా ఉండి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ కు సిఐటియు ఆధ్వర్యంలో బాబన్న నేతృత్వంలో సమ్మె నోటీస్ ను అందజేశారు.



# యువ జర్నలిస్ట్ దత్తురెడ్డికి సంతాపం

**మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, కొండా సురేఖ**

**వరంగల్ మహా;** వరంగల్ ఈనాడు రిపోర్టర్, యువ జర్నలిస్ట్ దత్తురెడ్డి అకాల మరణం చాలా బాధాకరమని అత్యంత చిన్న వయస్సులోనే గుండె పోటుకు గురై ఆయన ప్రాణాలు కోల్పోవటం తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిందని సమాజం కోసం నిరంతరం తపించే ఒక మంచి జర్నలిస్ట్ ను కోల్పోయామని మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, కొండా సురేఖ, వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద పేర్కొన్నారు. దత్తురెడ్డి ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులకు మా ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

# దత్తు రెడ్డికి నివాళులర్పించిన టీయూడబ్ల్యూజే హెచ్ 143




**గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ ఆవరణలో సంతాపం**

**హన్మకొండ మహా;** వరంగల్ ఈనాడు బ్యూరో చీఫ్ దత్తు రెడ్డి అకాల మరణం పట్ల టీయూడబ్ల్యూజే హెచ్ 143 ఆధ్వర్యంలో గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ ఆవరణలో ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి సంతాపం తెలియజేస్తూ నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టియుడబ్ల్యూజే హెచ్143 హనుమకొండ జిల్లా కార్యదర్శి అర్షం రాజ్ కుమార్, ఉపాధ్యక్షుడు గోకారపు శ్యాం కుమార్, ఉమ్మడి వరంగల్ జిల్లా ఫోటో జర్నలిస్టు అసోసియేషన్ అధ్యక్షులు సంపేట సుధాకర్ కార్యదర్శి గొట్టే వెంకన్న, యూనియన్ నాయకులు ఆదర్శ్ మెండు రవీందర్ సాల్మన్ రంజిత్, పాత్రికేయులు రజాక్, ప్రసాద్, చిన్న అమర్, కిషోర్, కుదుతల రమేష్, దాసరి శ్రీనివాసులు, గోపగాని రమేష్, సంపేట వెంకటేశ్వర్లు, గోరింటల శ్యామ్ తదితరులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలుపుతూ యాజమాన్యం తెలంగాణ రాష్ట్ర ప్రెస్ అకాడమీ పక్షాన వారి కుటుంబానికి అండగా ఉంటామని తెలిపారు.

**యువ జర్నలిస్ట్ దత్తు రెడ్డి హఠాన్మరణం బాధాకరం**

సంతాపం తెలిపిన వరంగల్ తూర్పు జర్నలిస్ట్ సంఘాలు, యూనియన్లు వరంగల్ నగరానికి చెందిన యువ జర్నలిస్ట్ దత్తు రెడ్డి హఠాత్ గా కార్డియాక్ అరెస్టుతో మంగళవారం మృతి చెందారు. ఈయన మరణం వరంగల్ నగరంలోని జర్నలిస్టుల్లో తీవ్ర విషాదం నింపింది. అనారోగ్యానికి దారి తీసే జీవనశైలి, పనిబరువు, యాజమాన్యాల ఒత్తిడి వంటి అంశాలే ఈ తీరని విషాదానికి కారణమయ్యాయని ఆయా యూనియన్ల సహచర జర్నలిస్టులు అభిప్రాయపడుతున్నారు. పత్రికా రంగంలో దత్తు రెడ్డి సేవలు విస్తృతంగా గుర్తించబడ్డాయి. తన పదునైన శైలి, సామాజిక అంశాల పై అవగాహనతో రెండు దశాబ్దాలకు పైగా సమాజాన్ని చైతన్యపరిచే మార్గదర్శకుడిగా నిలిచే సామర్థ్యం ఉన్నప్పటికీ కాలం మాత్రం ఆయన ఆశయాలను మధ్యలోనే అడ్డగించేసింది. మండే వార్తా వేడిలో, ఉక్కిరిబిక్కిరయ్యే డెడ్‌లైన్ల ఒత్తిడిలో సుదీర్ఘకాలంగా పనిచేస్తున్న మీడియా సిబ్బంది ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయడం మనం తరచూ చూస్తున్నదే. ఉద్యోగ భద్రత లేకపోవడం ఒక కారణమైన, యాజమాన్యాల నిరంకుశ ఒత్తిడి, ఆర్థిక ఒత్తిళ్లే ఎక్కువ మందిని మానసికంగా కుంగదీస్తున్నాయని పలువురు పాత్రికేయులు చెబుతున్నారు.



## డ్రగ్స్ ని నిర్మూలించడంలో విద్యార్థులు ముందుండాలి

**సిఐ రామ్ నరసింహారెడ్డి**

**ధర్మపురి, మహా:** మంగళవారం జగిత్యాల ఎస్పీ అశోక్ కుమార్ ఆదేశాల మేరకు వెల్గటూర్ పోలీస్ ఆధ్వర్యంలో ఎండపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశలలో అంతర్జాతీయ మాదకద్రవ్య దుర్వినియోగం,అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ధర్మపురి సర్కిల్ ఇన్స్పెక్టర్ రాంనరసింహరెడ్డి హాజరయ్యారు. ఇందులో భాగంగా సీఐ మాట్లాడుతూ..విద్యార్థులకు డ్రగ్స్,గంజాయి ,మత్తు పదార్థాలు సేవించడం వలన జరిగే అనర్థాల గురించి వివరించడం జరిగిందని మాట్లాడారు. సైబర్ నేరాలు, ట్రాఫిక్ నియమాల గురించి అవగాహన కల్పించడం జరిగిందని అన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో వెల్గటూర్ ఇంచార్జి సబ్ ఇన్స్పెక్టర్ ఎం. శ్రీధర్ రెడ్డి, ట్రైని సబ్ ఇన్స్పెక్టర్ సతీష్, పోలీస్ సిబ్బంది, పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు శ్రీనివాస్,ఉపాధ్యాయ బృందం,విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# వరంగల్ తూర్పులో ఘనంగా రైతు భరోసా సంబరాలు




- సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేసిన గోపాల్ నవీన్ రాజు
- పాల్గొన్న వరంగల్ తూర్పు కాంగ్రెస్ నాయకులు

**వరంగల్ మహా;** వరంగల్ తూర్పు నియోజకవర్గంలో వానాకాలం పంటల సాగు కోసం రైతు భరోసా నగదు బదిలీ విజయవంతంగా పూర్తయిన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం 'రైతు పండుగ' పేరుతో సంబరాలు నిర్వహిస్తున్న సందర్భంగా వరంగల్ తూర్పు నియోజకవర్గంలో అటవీ,పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి ఆదేశాల మేరకు రైతు భరోసా సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు గోపాల నవీన్ రాజు హాజరై ముఖ్య మంత్రి చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం గోపాల నవీన్ రాజు మాట్లాడుతూ ఇచ్చినమాట ప్రకారం 9 రోజుల్లో రూ.9 వేల కోట్ల నగదు బదిలీ చేయడం రాష్ట్ర చరిత్రలోనే అరుదైన రికార్డు అని, ఇప్పటి వరకు కోటి 49 లక్షల 39 వేల 111 ఎకరాలకు రైతు భరోసా అందించిన ఘనత సీఎం రేవంత్ రెడ్డిది, కాంగ్రెస్ ప్రభుత్వానిదే అని అన్నారు. ఎలాంటి పరిమితులు లేకుండా సాగులో ఉన్న ప్రతి ఎకరానికీ పెట్టుబడి సాయం అందిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగా లేకపోయినా రైతు సంక్షేమం విషయంలో రాజీపడకుండా పెట్టుబడి సాయం అందించారంటూ సీఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. రుణమాఫీ పథకాన్ని కూడా ఇలాగే 2024 ఆగస్టు 15 లోగా పూర్తిచేశామని గుర్తు చేశారు. గత ప్రభుత్వం ఎకరానికి 5 వేలు చొప్పున ఇస్తే కాంగ్రెస్ ప్రభుత్వం ఎకరానికి 6 వేల చొప్పున సంవత్సరానికి 12 వేలు చొప్పున రైతులకు అందించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో తూర్పు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## కాటారం డివిజన్ ఎలక్ట్రానిక్ మీడియా నూతన కార్యవర్గం

**కాటారం, మహా :** కాటారం డివిజన్ ( కాటారం, మహాదేవపూర్,మలహర్, మహాముత్తారం, పలిమేల) మండలాల ఎలక్ట్రానిక్ మీడియా నూతన కమిటీని మంగళవారం రోజున ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కాటారం మండల కేంద్రంలోని బిఎల్ఎన్ గార్డెన్ లో జర్నలిస్టులు సమావేశమై కమిటీని ఎన్నుకున్నారు.. గౌరవ అధ్యక్షులు అడప రమేష్ (10టీవీ), అధ్యక్షుడిగా పెండ్యాల రంజిత్ కుమార్ (వీ6 న్యూస్),ఉపాధ్యక్షుడిగా వీరమనేని సంపత్ రావు..( మహా న్యూస్),ప్రధాన కార్యదర్శిగా సయ్యద్ షఫిక్ హైమద్ (టీవీ5 న్యూస్), సహాయ కార్యదర్శిగా ములుకల రాజబాబు (సాక్షి టీవీ),కోళ్ల మహేష్ (ప్రైమ్ 9), కోశాధికారిగా షేక్ దీన్ మహమ్మద్ (రాజ్ న్యూస్),కార్యవర్గ సభ్యులు బత్తుల మహేష్.(హెచ్ఎం టీవీ), కీర్తి శ్రవణ్.(N టీవీ),కొక్కు సాకేత్ (ABN న్యూస్),బాసాని రాజబాబు (ఐన్యూస్), కమిటీ సభ్యులుగా సయ్యద్ జమీల్ (Tన్యూస్), వేల్పుల వెంకటేష్ (టీవీ9),ఎన్నుకున్నారు.. ఈ సందర్భంగా అధ్యక్షుడు మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించడంలో ముందుంటానని హామీ ఇచ్చారు.

# టీజీబీ బ్యాంకు సేవలపై అవగాహన

**ఆదిలాబాద్, మహా:** తెలంగాణ గ్రామీణ బ్యాంకులు వినియోగదారులకు అందిస్తున్న సేవలపై అధికారులు అవగాహన కల్పించారు. టీజీబీ ప్రధాన శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం స్థానిక ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో డిపాజిట్ల సేకరణ మహోత్సవం కార్యక్రమంలో భాగంగా ప్రజలకు వివిధ స్కీంలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రీజనల్ మేనేజర్ ధారావత్ గిర్మాజీ నాయక్ మాట్లాడారు. బ్యాంకులో డిపాజిట్ పథకాలైన ఫిక్స్ డ్, ఆర్డీ,ఎస్బీ తదితర వాటిని వివరించారు. బ్యాంకు ద్వారా అందిస్తున్న రుణాలపై వివరించారు. బ్యాంకుల్లో ఖాతా తెరిచి సేవలను వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమం లో చీఫ్ మేనేజర్ వెంకట స్వామి, ఆయా బ్యాంకుల మేనేజర్లు ప్రసన్న కుమార్, అప్పారావు,మధుసూదన్, రాహుల్,విష్ణు,కిరణ్ రెడ్డి, రమణ రెడ్డి,అనీస్ తదితరులు పాల్గొన్నారు.



# ఇబ్రహీంపట్నం మున్సిపల్ కమిషనర్‌గా సత్యనారాయణరెడ్డి


**ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి కమిషనర్**

**రంగారెడ్డి జిల్లా మహా:** ఇబ్రహీంపట్నం నూతన మున్సిపల్ కమిషనర్ గా సత్యనారాయణరెడ్డి మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఈ మున్సిపాలిటీలో బాధ్యతలు చేపట్టినందుకు సంతోషం వ్యక్తం చేశారు. గతంలో తుర్కయంజాల్లో పనిచేసిన అనుభవం ఆయనకు ఉందని అన్నారు. మున్సిపాలిటీ ప్రజలకు అందుబాటులో ఉంటూ, అందరితో సమన్వయం చేసుకుంటూ, ప్రజా సమస్యలపై పరిష్కారానికి కృషి చేస్తానని కమిషనర్ తెలిపారు. ఇబ్రహీంపట్నం మున్సిపల్ కమిషనర్ గా విధులు నిర్వహించిన రవీందర్ సాగర్ బదిలీపై వెళ్లారు.



# రాష్ట్రంలో రెండు లక్షల 30 వేల ఇందిరమ్మ ఇండ్ల మంజూరు

## రాష్ట్ర సిఎస్‌కె రామకృష్ణ రావు





**హైదరాబాద్, మహా :**ప్రజలను భాగస్వామ్యం చేస్తూ వనమహోత్సవం కార్యక్రమం విజయవంతం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కే రామ కృష్ణా రావు అన్నారు. మంగళవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కే.రామకృష్ణారావు ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాలపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆన్ లైన్ లో అటవీ పర్యావరణ శాఖ మంత్రి వర్యులు కోండా సురేఖ హాజరయ్యారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి వన మహోత్సవం కార్యక్రమం, ఇందిరమ్మ ఇండ్ల, ఎరువుల లభ్యత, ఆయిల్ పామ్ పంట విస్తరణ, సీజనల్ వ్యాధుల నియంత్రణకు చర్యలు, భూ భారతి దరఖాస్తుల పరిష్కారం వంటి పలు అంశాలపై సుదీర్ఘంగా చర్చించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా సి. ఎస్. మాట్లాడుతూ, 2 లక్షల 30 వేలకు పైగా ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలను లబ్ధిదారులకు పంపిణీ చేశామని, లక్షకు పైగా ఇండ్ల నిర్మాణ పనులు గ్రౌండ్ అయ్యాయని అన్నారు. పెద్ద వర్షాలు కురవడానికి ముందే మంజూరు చేసిన ఇందిరమ్మ ఇండ్ల గ్రౌండింగ్, బేస్మెంట్ స్థాయి వరకు నిర్మాణం జరిగేలా చూడాలని సీఎస్ సూచించారు. ఇందిరమ్మ ఇండ్ల కోసం ఉచితంగా ఇసుక సరఫరా చేస్తూ సీనరేజి చార్జీలను ప్రభుత్వం రద్దు చేసిందని అన్నారు. డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పెండింగ్ పనులు లబ్ధిదారులు పూర్తి చేసుకునేలా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని అన్నారు. ప్రస్తుతం ఎంత మేరకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణం జరిగిందో, ఎంబీ రికార్డులను నమోదు చేసి లబ్ధిదారులకు ఇండ్లను కేటాయించాలని, ప్రభుత్వం మిగిలిన పనులు పూర్తి చేసేందుకు అవసరమైన నిధులు లబ్ధిదారుల ఖాతాలో జమ చేస్తుందని అన్నారు. పిఎం ఆవాస్ యోజన అర్బన్ 2.0 క్రింద మనకు లక్షా 13 వేల ఇండ్లను కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిందని, ప్రతి పట్టణం నుంచి కనీసం 500 మంది నిరు పేదలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని కలెక్టర్ లకు సీఎస్ సూచించారు.

**వనమహోత్సవంలో మొక్కల పెంపకం...**

వన మహోత్సవం కార్యక్రమం క్రింద ఇండ్లకు పంపిణీ చేసే మొక్కల పెంపకం సైతం పరిశీలించాలని, మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని సీఎస్ కలెక్టర్ లకు సూచించారు. ప్రతి జిల్లా ప్రత్యేకమైన ప్రణాళికను సిద్ధం చేసుకుని వన మహోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించాలని, నాటిన మొక్కల వివరాలను ఎప్పటికప్పుడు జియో కోఆర్డినేట్స్ తో ఆన్ లైన్ లో నమోదు చేయాలని అన్నారు.

**ప్రతి జిల్లాలో ఎరువుల లభ్యత స్టాక్ పై రివ్యూ...**

ప్రతి జిల్లాలో ఎరువుల లభ్యత స్టాక్ పై రివ్యూ పెట్టాలని అన్నారు. జూలై వరకు అవసరమైన స్టాక్ ప్రస్తుతం అందుబాటులో ఉందని, సెప్టెంబర్ నాటికి అవసరమైన ఎరువుల స్టాక్ ప్రోక్యూర్ చేస్తున్నామని అన్నారు. ఎరువుల స్టాక్ ను ప్రత్యేక అధికారులను నియమించి ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని అన్నారు. రిటైల్ విక్రయాలను డిజిటలైజ్ చేయాలని కలెక్టర్లకు సీఎస్ సూచించారు. వ్యవసాయ సహకార సంఘాలు, ఎరువుల షాప్ వద్ద ఎక్కడ కొరత రాకుండా జాగ్రత్త చర్యలు తీసుకోవాలని అన్నారు.

**లక్షా 25 వేల ఎకరాలలో ఆయిల్ పామ్ పంట సాగు...**

లక్షా 25 వేల ఎకరాలలో ఆయిల్ పామ్ పంట సాగు ప్రస్తుత సంవత్సరం విస్తరించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని అన్నారు. రైతులకు లాభసాటి పంట ఆయిల్ పామ్ పట్ల అవగాహన కల్పిస్తూ పంట విస్తరణకు చర్యలు తీసుకోవాలని అన్నారు. భూ భారతి చట్టం రెవెన్యూ సదస్సుల ద్వారా దాదాపు 8 లక్షల 27 వేల దరఖాస్తులు వచ్చాయని, వీటిని సాధా బైనామా, ఆర్ఓఆర్ సమస్యలు, పట్టాలో కరెక్షన్స్ వంటి వివిధ సమస్యల పై దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. ఆగస్టు 15 నాటికి ఈ దరఖాస్తుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సీఎస్ ఆదేశించారు.

**సీజనల్ వ్యాధులను నియంత్రించేందుకు చర్యలు...**

డెంగ్యూ, మలేరియా, చికెన్ గున్యా వంటి సీజనల్ వ్యాధులను నియంత్రించేందుకు జిల్లాల్లో పటిష్ట చర్యలు తీసుకోవాలని, కలెక్టర్ లు ప్రత్యేక శ్రద్ధ వహించి సీజనల్ వ్యాధుల నియంత్రణ పై అవగాహన కల్పన, పర్యవేక్షణ వంటి పలు కార్యక్రమాలు చేపట్టాలని అన్నారు. టీబీ ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా జిల్లాలో వల్నరబుల్ ప్రాంతాల్లో మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేసి లక్షణాలు గల ప్రతి ఒక్కరికి పరీక్షలు నిర్వహించి వ్యాధి నిర్ధారణ జరిగిన వారికి అవసరమైన చికిత్స అందించాలని అన్నారు.

**ప్రజలను భాగస్వామ్యం చేస్తూ వనమహోత్సవం...**

ఆన్ లైన్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గోన్న అటవీ, పర్యావరణ శాఖ మంత్రి వర్యులు కొండా సురేఖ మాట్లాడుతూ... ప్రజలను భాగస్వామ్యం చేస్తూ వన మహోత్సవం కార్యక్రమం నిర్వహించాలని అన్నారు. జిల్లాలో మంత్రులు, ప్రజాప్రతినిధులు పెద్ద ఎత్తున పాల్గోన్నాలని అన్నారు. గతం కంటే మెరుగ్గా ప్రజల్లో వన మహోత్సవం కార్యక్రమం తీసుకుని వెళ్ళాలని, ప్రతి రోజూ ఒక్కో శాఖ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించాలని అన్నారు. జిల్లాలో వి.ఐ.పి పర్యటనల సందర్భంగా తప్పనిసరిగా మొక్కలు నాటేలా చూడాలని అన్నారు. అవెన్యూ ప్లాంటేషన్ పరిధిలో ఎత్తైన మొక్కలు నాటి వాటి రక్షణకు చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. అటవీ ప్రాంతంలో కోతులకు అవసరమైన పండ్ల మొక్కలను పెద్ద ఎత్తున బ్లాక్ ప్లాంటేషన్ పెంచాలని అన్నారు. జిల్లాలకు కేటాయించిన వన మహోత్సవం లక్ష్యాలను కలెక్టర్ల ఆధ్వర్యంలో ప్రత్యేక శ్రద్ధ వహించి పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు.

**భూ భారతిలో దరఖాస్తులను పూర్తి స్థాయిలో విచారణ**

వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి మాట్లాడుతూ... భూ భారతిలో వచ్చిన దరఖాస్తులను పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి భవిష్యత్తులో మళ్లీ సమస్య తలెత్తి దరఖాస్తు చేసుకునే పరిస్థితి రాకుండా పరిష్కరిస్తున్నామని తెలిపారు. రెవెన్యూ సదస్సులలో భాగంగా ఇప్పటివరకు భూ భారతి కింద 21,050 దరఖాస్తులు స్వీకరించామని, 17,345 దరఖాస్తులను ఆన్ లైన్ లో నమోదు చేసి 1932 దరఖాస్తులకు నోటీసులు జారీ చేశామని, ఇందులో 6849 దరఖాస్తులను పరిష్కరించామని వివరించారు. ఆగస్టు 15 నాటికి ప్రతి దరఖాస్తు పరిష్కారానికి చర్యలు చేపట్టామని అన్నారు. అదే విధంగా పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టామని, ఇప్పటికే మండలాల వారిగా సమావేశాలు ఏర్పాటు చేశామన్నారు.

# ఇంటింటా రైతు భరోసా సంబరాలు

## కేశంపేటలో రైతు భరోసా సంబరాల్లో పాల్గొన్న మాజీ జడ్పీటీసీ తాండ్ర విశాల శ్రావణ్ రెడ్డి



**షాద్ నగర్, మహా:** రాష్ట్ర వ్యాప్తంగా 9 రోజుల్లో 9 వేల కోట్ల రూపాయలు రైతు భరోసా నిధులు విడుదల చేసి ఇప్పటివరకు 1 కోటి 49 లక్షల 39 వేల 111 ఎకరాలకు రైతు భరోసా అందించిన రేవంత్ సర్కార్ కు కృతజ్ఞతలు తెలియజేస్తూ ఈ రోజు తెలంగాణ వ్యాప్తంగా రైతు భరోసా సంబరాలు జరుపుకుంటున్న సందర్భంగా రంగారెడ్డి జిల్లా కేశంపేట మండల కేంద్రం లో నిర్వహించిన రైతు భరోసా సంబరాల్లో పాల్గొన్న కేశంపేట మాజీ జడ్పీటీసీ తాండ్ర విశాల శ్రావణ్ రెడ్డి. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఫోటో లకు పాలాభిషేకం చేసి కృతజ్ఞతలు తెలియజేశారు.

# పాలమూరు ఎంపీగా అభివృద్ధి పథంలో డీకే అరుణమ్మ

## బీజేవైఎం రాష్ట్ర నాయకులు వంశీకృష్ణ



**షాద్ నగర్, మహా:** పాలమూరు ఎంపీగా సంవత్సరంకాలం పూర్తిచేసుకుని 562 కోట్లతో పార్లమెంటును అభివృద్ధి పథంలో నడిపిస్తున్న సందర్భంగా పాలమూరు క్యాంపు కార్యాలయంలో ఎంపీ డీకే అరుణమ్మని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అందే బాబయ్యతో కలిసి శుభాకాంక్షలు తెలియజేసిన బీజేవైఎం రాష్ట్ర నాయకులు వంశీకృష్ణ, గిరిజన మోర్చా నాయకులు వినోద్ నాయక్.

# కాంట్రాక్టర్ల మధ్య వివాదం

## కాంటాక్ట్ ల మధ్య వివాదం తన దృష్టికి వస్తే పరిష్కారానికి కృషి చేస్తానన్న కమిషనర్ సరస్వతి

### నిబంధనల ప్రకారమే టెండర్ల కేటాయింపులు



**బాలాపూర్ మహా:** బడంగ్ పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధి లో కార్పొరేషన్ కార్యాలయం ముందు కాంట్రాక్టర్లు రెండు గ్రూపులుగా విడిపోయి ఆందోళన చేశారు. ఒక వర్గం కొంత మందికే అధికారులు కాంటాక్ట్ ను కట్టబెడుతున్నారు ఆరోపించగా, మరొక వర్గం అధికారులకు ఎలాంటి సంబంధం లేదని మా మధ్య వివాదాలను త్వరలోనే పరిష్కరించుకుంటాము అని అసోసియేషన్ అధ్యక్షుడు చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. ఒకరిద్దరూ కాంట్రాక్టర్ల వ్యక్తిగత ఆరోపణలు తప్ప అధికారులకు ఎలాంటి సంబంధం లేదని చంద్రశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. ఆరోపణలు చేసిన కాంట్రాక్టర్లకు 5 కోట్ల వరకు బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ లో పనులు ఉన్నాయని తెలిపారు. నిబంధనలను ప్రకారమే కాంటాక్ట్ పనులు కేటాయించడం జరుగుతుందని కమిషనర్ సరస్వతి తెలిపారు. కొంత మంది కాంట్రాక్టర్ చేసిన ఆరోపణలు ఖండిస్తున్నట్టు పేర్కొన్నారు. టెండర్ల విషయం లో నిష్పక్షపాతంగా వివరిస్తామని ప్రభుత్వ నిబంధనల ప్రకారమే నడుచుకుంటాము అని కమిషనర్ సరస్వతి,డిఇ వెంకన్న తెలిపారు. కాంటాక్ట్ ల మధ్య వివాదం తన దృష్టికి వస్తే పరిష్కారానికి కృషి చేస్తానని కమిషనర్ సరస్వతి వెల్లడించారు.

# అక్రమంగా తరలిస్తున్న బియ్యం పట్టివేత



**ఆదిలాబాద్, మహా:** పట్టణంలో అక్రమంగా తరలిస్తున్న పీడీ ఎస్ బియ్యాన్ని అధికారులు పట్టుకున్నారు. టాస్క్ ఫోర్స్, విజిలెన్స్ అధికారులు నిర్వహించిన దాడుల్లో అక్రమంగా తరలిస్తున్న బియ్యం బ్యాగులను స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. గత రెండు రోజులుగా పక్క సమాచారంతో అధికారులు తనిఖీలు నిర్వహిస్తున్న నేపథ్యంలో మంగళవారం స్థానిక శివాజీ చౌక్ లోని రజిత కిరాణ దుకాణంలో వంద బ్యాగులు, గోదాం లో రెండు వందల బ్యాగులను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. డీఎస్ ఓ వాజిద్ అలీ, టాస్క్ సీఐ చంద్రమౌళి, ఎస్సై ఉశన్న తదితరులు ఈ దాడుల్లో పాల్గొన్నారు. మూడు నెలల రేషన్ సరకులు ఒకేసారి ఇవ్వడంతో అక్రమంగా అమ్ముకుంటున్నారని తమకు సమాచారం అందినట్లు డీ ఎస్ ఓ తెలిపారు. రేషన్ బియ్యం అమ్మితే లబ్దిదారుల కార్డులను రద్దు చేస్తామన్నారు. మార్కెట్ లో అనుమానం రాకుండా లబ్దిదారుల నుండి ఖరీదు చేసి బ్యాగుల్లో ప్యాక్ చేసి తరలిస్తున్నారని పేర్కొన్నారు. ఇందుకోసం ప్రత్యేకంగా గోదాం ఏర్పాటు చేసి యంత్రాలను సైతం అందుబాటులో ఉంచుకున్నట్లు గుర్తించామన్నారు. అక్రమ వ్యాపారంలో ఉన్న వారిపై సమగ్ర విచారణ చేపడతామని తెలిపారు.

# యూత్ కు క్రికెట్ కిట్ పంపిణీ



**ఆదిలాబాద్, మహా :** ఆదిలాబాద్ అసెంబ్లీ ఇంచార్జ్ కంది శ్రీనివాస రెడ్డి నేతృత్వంలో ఆయన క్యాంప్ కార్యాలయం లో భోరజ్ మండలం గిమ్మ స్ఫూర్తి యూత్ సభ్యులకు కాంగ్రెస్ సీనియర్ నాయకుడు గిమ్మ సంతోష్ రావు మంగళవారం క్రికెట్ కిట్ పంపిణి చేశారు. యూత్ సభ్యులు హర్షం వ్యక్తం చేస్తూ కంది శ్రీనివాస రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మునిగెల విఠల్,మాజీ సర్పంచ్ రాజేశ్వర్, నిఖిలేష్, రాజీవ్ యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఇరాన్ పై దాడిని వెంటనే ఆపేయాలి

- సీపీఎం జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్
- వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో అమెరికా, ఇజ్రాయిల్ యుద్దోన్మాద దిష్టిబొమ్మ దగ్ధం




**ఆదిలాబాద్, మహా** అమెరికా సామ్రాజ్యవాద యుద్ధకాంక్ష మూలంగానే ఇరాన్ పై దుస్సాహసానికి పాల్పడుతుందని సీపీఎం జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్ అన్నారు.వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో మంగళవారం బస్టాండ్ ఎదుట ఇరాన్ పై దాడులను ఆపాలని అమెరికన్ సామ్రాజ్యవాద దిష్టిబొమ్మను దహనం చేశారు ఈ సందర్భంగా మల్లేష్ మాట్లాడారు. అమెరికా ఇరాన్ దేశంలోని సహజ వనరులను సంపదను కాజేయాలని దుర్బుద్ధితో ఆ దేశాన్ని లొంగదీసుకోవడం కోసం దాడులను మొదలుపెట్టిందని మండిపడ్డారు. బాంబర్లను ప్రయోగించడం ద్వారా శాంతిని దూరం చేస్తూ ప్రజల ప్రాణాలను హరిస్తోందని తెలిపారు. మరోవైపు ట్రంప్ అనాలోచిత విధానాల ఫలితంగా ఇప్పటికే అనేక దేశాలపై దాడులు చేయడంతో పాటు మిగితా వాటిని భయభ్రాంతులకు గురిచేస్తుందని పేర్కొన్నారు. గ్రీన్ ల్యాండ్, పనామా కాలువను ఆక్రమిస్తామని చెప్పడం, కెనడాను 51 వ రాష్ట్రంగా అమెరికాలో కలిపేసుకుంటామని అనడం లాంటి అనేక ఉదాహరణలు అమెరికా సామ్రాజ్యవాద యుద్ధకాంక్షను తెలియజేస్తున్నాయని చెప్పారు. ప్రజలందరూ సామ్రాజ్యవాదానికి, యుద్ధోన్మాదానికి వ్యతిరేకంగా నిలబడాల్సిన సమయం ఆసన్నమైందన్నారు.లేకపోతే చాలా ఆస్తి, ప్రాణ నష్టాన్ని సమకాలీన ప్రపంచం ఎదుర్కోవాల్సి వస్తుందని చెప్పారు. ఇరాన్ కు సంఘీభావంగా ప్రపంచ శాంతిని కోరుకునే ప్రతి ఒక్కరు కలిసి రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఏంఎల్ న్యూ డెమోక్రసి జిల్లా కార్యదర్శి B.వెంకట్ నారాయణ, సిపిఎం నాయకులు కార్యదర్శి లంక రాఘువులు, అన్నమొల్ల కిరణ్ సీనియర్ నాయకులు బండి దత్త్రాత్రి, నాయకులు సురేందర్ మంజుల,అగ్గిమల్ల స్వామి, లింగాల చిన్నన్న ,పండుగ పొచ్చన్న , గంగసాగర్ తదితరులు పాల్గొన్నారు.

# డ్రగ్స్ వినియోగిస్తున్న జగదీశ్వర్ రెడ్డిని అదుపులోకి తీసుకున్న ఎక్సైజ్ పోలీసులు



**రాజేంద్రనగర్ మహా ;** రాజేంద్రనగర్ డివిజన్ పరిధి మైలర్ దేవ్ పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోనీ మెహఫిల్ హోటల్ రెస్టారెంట్ సమీపంలో ఏం డి ఎం ఏ డ్రగ్స్ వాడుతు ఉన్న వ్యక్తిని విశ్వసనీయ సమాచారం మేరకు శంషాబాద్ ఎక్సైజ్ పోలీసులు మంగళవారం అదుపులకు తీసుకున్నారు. పట్టుబడ్డ నిందితుడు డ్రగ్స్ విక్రయించే వ్యక్తిగా గుర్తించారు. ఇతడు ప్రకాశం జిల్లాకు చెందిన వట్టి జగదీశ్వర్ రెడ్డి (25) గా పోలీసులు గుర్తించారు. నిందితుడి వద్ద నుండి 23 గ్రాముల ఏం డి ఎం ఏ డ్రగ్స్, బజాజ్ పల్సర్ ద్విచక్ర వాహనం, సెల్ ఫోను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. జగదీశ్వర్ రెడ్డి పై ఉప్పల్ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ లో ఈ సంవత్సరం ఫిబ్రవరి నెలలో కేసు నమోదు అయినట్లు శంషాబాద్ ఎక్సైజ్ ఏ ఈ ఎస్ ఏ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ప్రధాన సరఫరాదారుడు బెంగళూరుకు చెందిన సైఫ్ షరీఫ్ పరారీలో ఉన్నట్లు సమాచారం. అతని కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారని పోలీసులు తెలిపారు.

# బడీడు పిల్లలు పనిలో కాదు పాఠశాలలో ఉండాలి

## చైల్డ్ లైన్ కోఆర్డినేటర్ సతీష్ కుమార్



**ఆదిలాబాద్, మహా:** బడీడు పిల్లలు పనిలో కాకుండా పాఠశాలల్లో ఉండాలనే కలెక్టర్ ఆదేశాల మేరకు బాల కార్మికులను గుర్తిస్తున్నామని చైల్డ్ లైన్ కోఆర్డినేటర్ సతీష్ కుమార్ తెలిపారు. మంగళవారం పట్టణంలో 170 కాలనీలో, న్యూ హౌసింగ్ బోర్డ్ సమీపంలో గుడిసెలు వేసుకుని ఉన్న వలస కూలీలు కుటుంబాల సర్వే నిర్వహించారు. బడి ఈడు పిల్లలను పాఠశాలకు పంపించాలని తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ నిర్వహించారు. గుర్తించిన బడీడు పిల్లలను వారు ఉంటున్న కాలనీల్లోని సమీప ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించారు. ఈ సందర్భంగా చైల్డ్ లైన్ కోఆర్డినేటర్ సతీష్ కుమార్ మాట్లాడుతూ... బాల కార్మిక వ్యవస్థను నిర్మిలించేందుకు బాలల పరిరక్షణ సమితి కృషి చేస్తుందన్నారు. కలెక్టర్, జిల్లా బాలల సంరక్షణ అధికారి ఆదేశాల మేరకు పట్టణంలో 170 కాలనీలో, న్యూ హౌసింగ్ బోర్డ్ సమీపంలో గుడిసెలు వేసుకుని ఉన్న వలస కూలీలు కుటుంబాల సర్వే చేపట్టడం జరిగిందన్నారు .ఈ కార్యక్రమంలో షూర్ ఎన్జీవో కోఆర్డినేటర్ వినోద్, చైల్డ్ లైన్ కేస్ వర్కర్ రామకృష్ణ, అవుట్ రిచ్ వర్కర్ కృష్ణవేణి ఉన్నారు.

# బావిలో పడి బాలుడు గల్లంతు

## గజ ఈతగాలతో గాలింపు చర్యలు



**రాజేంద్రనగర్, మహా ;** మైలార్ దేవ్ పల్లి డివిజన్ పరిధిలోని లక్మిగూడ గ్రామంలో ప్రమాదవశాత్తు బావిలో పడిన ఐదు సంవత్సరాల ప్రిన్స్ అనే బాలుడు గల్లంతైన సంఘటన మైలార్ దేవ్ పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం జరిగింది.

**స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం**

మైలార్ దేవ్ పల్లి డివిజన్ పరిధిలోని లక్మిగూడ గ్రామంలో ప్రమాదవశాత్తు ఐదు సంవత్సరాల ప్రిన్స్ అనే బాలుడు బావిలో పడ్డాడు. స్థానికులు పోలీసులకు సమాచారం చేరవేయడంతో సంఘటన స్థలానికి చేరుకున్న మైలర్ దేవ్ పల్లి పోలీసులు, డి ఆర్ ఎఫ్ సిబ్బంది, బావిలో గజ ఈతగాలతో బావిలో గాలింపు చర్యలు చేపట్టారు. తల్లిదండ్రులు స్థానికులు బాలుని ఆచూకీ కోసం ఎదురుచూస్తున్నారు. తల్లిదండ్రుల స్వగ్రామం బీహార్ గత కొంత కాలంగా లక్ష్మి గూడ రాజీవ్ గృహ కల్ప లో నివాసం వుంటున్నారు,

# మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా యుద్ధం చేయాలి

## జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్



**ఆదిలాబాద్, మహా:** మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా ప్రజలు, విద్యార్థులు జిల్లా పోలీసు యంత్రాంగం తో కలిసి యుద్ధం చేయాలని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ పిలుపునిచ్చారు. జిల్లాలో వారం రోజుల పాటు జరగనున్న యాంటి డ్రగ్ వీక్ లో భాగంగా మంగళవారం స్థానిక కాన్వెంట్ పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మాదకద్రవ్యాల భారిన పడితే కలిగే నష్టాలను విద్యార్థులకు వివరిస్తూ వాటికి దూరంగా ఉండాలని సూచనలు చేశారు. డ్రగ్స్ కు వ్యతిరేకంగా ముద్రించిన పోస్టర్లను విద్యార్థులు,ఉపాధ్యాయులతో కలిసి ఆవిష్కరించారు. ఐ యామ్ ఏ యాంటీ డ్రగ్ సోల్జర్ నినాదంతో ఏర్పాటు చేసిన ఫోటో పాయింట్ వద్ద విద్యార్థులతో కలిసి ఫోటోలు దిగారు. క్యూఆర్ కోడ్ తో యాంటీ డ్రగ్ సోల్జర్ సర్టిఫికేట్ ను పొంది అందుకు అనుగుణంగా ప్రవర్తించాలని సూచించారు. విద్యార్థులతో కలిసి డ్రగ్స్ ను వాడబోనని, డ్రగ్స్ కు సంబంధించిన ఎలాంటి సమాచారం అయినా జిల్లా పోలీస్ యంత్రాంగానికి సమాచారం అందిస్తామని ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ మాదక ద్రవ్యాల భారినపడి యువత జీవితాలను నాశనం చేసుకుంటున్నారని పేర్కొన్నారు. అనేక కుటుంబాలు రోడ్డున పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. డ్రగ్స్, గంజాయికి సంబంధించి ఎలాంటి సమాచారం ఉన్నా డయల్ 100కు ఫోన్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిఎస్పీ జీవన్ రెడ్డి, పట్టణ ఇన్స్పెక్టర్లు సునీల్ కుమార్, కరుణాకర్ రావు తదితరులు పాల్గొన్నారు.

# డ్రగ్స్ నిరోధానికి అందరు కృషి చేయాలి

## జిల్లా కలెక్టర్ రాజర్శిషా



**ఆదిలాబాద్, మహా:** జిల్లాలో డ్రగ్స్ నిరోధానికి ప్రతి ఒక్కరు తమ వంతు బాధ్యతగా కృషి చేయాల్సిన అవసరముందని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. వన మహోత్సవం, యాంటి డ్రగ్ వీక్ లో భాగంగా కలెక్టరేట్ కార్యాలయ ఆవరణలో మంగళవారం మొక్కలు నాటారు. ఫోటో పాయింట్ వద్ద అధికారులతో కలిసి ఫోటోలు దిగిన అనంతరం క్యూ ఆర్ కోడ్ ను స్కాన్ చేసి డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. డ్రగ్స్ రహిత జిల్లాగా ఆదిలాబాద్ ను తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరు తమ వంతు కృషి చేయాలన్నారు. ఇంటర్నేషనల్ డ్రగ్స్ డే సందర్భంగా జూన్ మిషన్ పరివర్తన్ నిర్వహిస్తున్నారని, వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటినట్లు పేర్కొన్నారు. మత్తు పదార్థాలను సేవించడం ద్వారా అనేక ఇబ్బందులు ఎదురవుతాయని తెలిపారు. ఆరోగ్య పాఠశాలలో భాగంగా ప్రతి గురువారం ఈ అంశాలపై చర్చించడం జరుగుతుందని, ప్రతి పాఠశాలలో యాంటి డ్రగ్ కమిటిలను సైతం ఏర్పాటు చేసినట్లు వివరించారు. మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థ లపై క్షేత్రస్థాయిలో మరింత అవగాహన కల్పించేలా కార్యక్రమాలు చేపట్టాలన్నారు. గంజాయి, మత్తు పదార్థాల గురించి సమాచారం ఉంటె వెంటనే 1908,14446, డయల్ హండ్రెడ్ కు సమాచారం అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్యామలదేవి, ఉట్నూర్ సబ్ కలెక్టర్ యువరాజ్ మార్మాట్, శిక్షణ కలెక్టర్ సలోని చబ్రా, డీఎఫ్ఓ ప్రశాంత్ బాజీరావు పాటిల్, జడ్పి సీఈఓ జితేందర్ రెడ్డి, డీఎం హెచ్ఓ నరేందర్ రాథోడ్, డీడబ్ల్యూఓ మిల్క తదితరులు పాల్గొన్నారు.

# ఈపీఎఫ్‌వో కీలక ప్రకటన




ఎంప్లాయీస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ (ఈపీఎఫ్ఓ) అడ్వాన్స్ క్లెయిమ్‌ల ఆటో సెటిల్‌మెంట్ పరిమితిని గణనీయంగా పెంచుతున్నట్లు ప్రకటించింది. ముఖ్యంగా మెడికల్ ఎమర్జెన్సీలు, పిల్లల పెళ్లిల్లు లేదా ఇంటి పునరుద్ధరణ వంటి అత్యవసర పరిస్థితుల్లో ఈపీఎఫ్ఓ సభ్యులకు త్వరితగతిన ఆర్థిక వెసులుబాటు అందించేలా ఈ చర్యలు తీసుకున్నట్లు చెప్పింది. తక్షణ ఆర్థిక సహాయం అవసరమైన సిబ్బందికి సకాలంలో డబ్బు అందేలా చేసే ప్రయత్నంలో భాగంగా కేంద్ర కార్మిక, ఉపాధి మంత్రి మన్సుఖ్ మాండవీయ ఈమేరకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. 'కార్మికులకు నిరంతరాయంగా, సకాలంలో ఆర్థికంగా వెసులుబాటు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉంది. దీనివల్ల సభ్యులు అవసరమైన సమయాల్లో పెద్ద మొత్తంలో వేగంగా డబ్బు పొందవచ్చు' అని మాండవీయ పేర్కొన్నారు. ఆటో సెటిల్‌మెంట్ సదుపాయం కొవిడ్ 19 మహమ్మారి కాలం నుంచే అందుబాటులో ఉంది.

**ఏమిటీ ఆటో సెటిల్‌మెంట్?**

క్లిష్ట ఆర్థిక పరిస్థితుల్లో సభ్యులు తమ ప్రావిడెంట్ ఫండ్‌లోని కొంత భాగాన్ని అడ్వాన్స్‌గా పొందడానికి అనుమతించే విధానం. కొవిడ్ సమయంలో రూ.1లక్ష వరకు ఇలా ఆటో సెటిల్‌మెంట్‌కు ఈపీఎఫ్ఓ అవకాశం ఇచ్చింది. ఇక నుంచి దీన్ని రూ.5 లక్షలకు పెంచుతున్నట్లు తెలిపింది. వైద్య అత్యవసర పరిస్థితులు లేదా విద్యా ఖర్చులు, ఇంటి రెన్యూవేషన్, పిల్లల పెళ్లి వంటి తక్షణ అవసరాలకు ఇలా పీఎఫ్ నిధులను విత్‌డ్రా చేసుకోవచ్చని చెప్పింది. ఈ విధానంలో నిధులు మ్యానువల్‌గా కాకుండా ఆటోమేటిక్‌గా అప్రూవ్ అవుతాయి. ఈ సర్వీసు పొందేందుకు చందాదారులు తమ 'నో యువర్ కస్టమర్ (కేవైసీ)' సమాచారం అప్‌డేట్ చేసుకోవాల్సి ఉంటుంది. ఆధార్, పాన్, బ్యాంకు ఖాతా వివరాలు వంటి అవసరమైన అన్ని డాక్యుమెంట్లను ఈపీఎఫ్ ఖాతాకు అనుసంధానం చేయాల్సి ఉంటుంది. పదవీ విరమణకు ముందు ప్రావిడెంట్ ఫండ్ బ్యాలెన్స్ పూర్తి ఉపసంహరణ అనుమతించబడనప్పటికీ పిల్లల వివాహం, విద్య లేదా ఇంటి పునరుద్ధరణ వంటి నిర్దిష్ట పరిస్థితులలో పాక్షికంగా విత్‌డ్రా చేసేందుకు అనుమతించారు. దీనివల్ల సభ్యులు తమ నిధులను ఎమర్జెన్సీ పరిస్థితుల్లో జాప్యం లేకుండా పొందవచ్చు.

**ఆటో సెటిల్‌మెంట్ కోసం అర్హతలు**

వైద్య అత్యవసర పరిస్థితులు: చందాదారులు లేదా తమపై ఆధారపడినవారు ఆసుపత్రిలో చేరడం, పెద్ద శస్త్రచికిత్సలు లేదా దీర్ఘకాలిక అనారోగ్యాలతో బాధపడుతుండడం.

ఉన్నత విద్య: చందాదారులు లేదా తమ పిల్లల ఉన్న విద్య కోసం.

**వివాహ ఖర్చులు:**

చందాదారు పెళ్లి లేదా పిల్లలు లేదా తోబుట్టువుల పెళ్లి ఖర్చులకు.

**ఇంటి పునరుద్ధరణ లేదా నిర్మాణం:**

ఇల్లు కొనడం లేదా ఇప్పటికే ఉన్న ఇంటి మరమ్మతుల కోసం.

ఈపీఎఫ్ స్కీమ్ రూల్స్ 68జే, 68కే, 68బీ ద్వారా పై కేటగిరీలోని అవసరాల నిమిత్తం పీఎఫ్ డబ్బును విత్‌డ్రా చేయవచ్చు. చందాదారు క్లెయిమ్ ఈపీఎఫ్ఓ ప్రమాణాలకు అనుగుణంగా ఉంటే మానవ ప్రమేయం లేకుండా ప్రాసెస్ అవుతుంది. అందుకు సాధారణంగా 72 గంటలు సమయం పడుతుంది.

# 1,487 గజాలు.. రూ. 33 కోట్లు

**గచ్చిబౌలిలో హౌసింగ్ బోర్డుకు చెందిన వాణిజ్య స్థలానికి వేలంలో భారీ ధర.. మొత్తం 11 ప్లాట్ల విక్రయంతో బోర్డుకు రూ. 65 కోట్ల ఆదాయం**

కూకట్‌పల్లి: భాగ్యనగరంలోని పలు ప్రాంతాల్లో హౌసింగ్ బోర్డుకు చెందిన 11 స్థలాలు సోమవారం బహిరంగ వేలంలో రికార్డు స్థాయి ధరలకు అమ్ముడయ్యాయి. మొత్తంగా బోర్డుకు రూ. 65.02 కోట్ల ఆదాయాన్ని అందించాయి. ముఖ్యంగా గచ్చిబౌలిలోని 1,487 గజాల ఒక వాణిజ్య స్థలం ఏకంగా రూ. 33 కోట్లు పలికింది. చదరపు గజానికి రూ. 1.20 లక్షలను ఆఫ్ సెట్ ధరగా నిర్ణయించగా వేలంపాటలో అది ఏకంగా రూ. 2.22 లక్షలు పలికింది. అలాగే అదే ప్రాంతంలోని ఓ ప్రాథమిక పాఠశాలకు చెందిన 1,206 గజాల స్థలం వేలంలో రూ. 13.51 కోట్లు పలికింది. అక్కడ చదరపు గజానికి రూ. 80 వేలను ఆఫ్ సెట్ ధరగా ఖరారు చేయగా వేలంలో గజం రూ. 1.12 లక్షలకు అమ్ముడుపోయింది. చింతల్‌లో నాలుగు స్థలాలు, నిజాంపేటలో నాలుగు ఫ్లాట్లు సైతం ఈ వేలంపాటలో అమ్ముడయ్యాయి. ఒక్క గచ్చిబౌలి (Gachibowli) ప్రాంతానికి సంబంధించిన భూముల వేలం ద్వారానే రూ. 55.56 కోట్ల మేర ఆదాయం హౌసింగ్ బోర్డుకు సమకూరింది. చింతల్‌లోని ఫ్లాట్ నెం.113, 114, 115 ద్వారా సుమారు రూ. 8.11 కోట్ల మేర ఆదాయం వచ్చింది. కేపీహెచ్‌బీ (KPHB) కమ్యూనిటీ హాల్‌లో జరిగిన ఈ వేలంలో 55 మంది పాల్గొన్నారు. ఈ మేరకు హౌసింగ్ బోర్డు వైస్ చైర్మన్, హౌసింగ్ కమిషనర్ వి.పి.గౌతం ఓ ప్రకటన విడుదల చేశారు.




## రెరా ట్రిబ్యునల్ చైర్మన్‌గా జస్టిస్ ఎ.సంతోష్‌రెడ్డి బాధ్యతలు

తెలంగాణ రియల్ ఎస్టేట్ నియంత్రణ సంస్థ (రెరా) అప్పీలేట్ ట్రిబ్యునల్ చైర్మన్‌గా హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ అనుగు సంతోష్‌రెడ్డి సోమవారం బాధ్యతలు చేపట్టారు. అనంతరం సభ్యులతో కలసి ట్రిబ్యునల్ కార్యకలాపాలు నిర్వహించారు. జస్టిస్ సంతోష్‌రెడ్డిని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం గత సోమవారం ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే.

# ఏటా రూ.10.8 లక్షలు జీతం.. రూ.3.2 లక్షలు పొదుపు అయినా..

సొంతంగా ఇల్లు కలిగి ఉండడం అనేది సామాన్యుడి కల. దేశంలోని కొన్ని నగరాల్లో ఇకపై అది కలగానే ఉంటుందని కొన్ని నివేదికల వివరాల ద్వారా తెలుస్తుంది. భారత వాణిజ్య నగరం ముంబయి వంటి నగరాల్లో అయితే సామాన్యుడు ప్రస్తుత పరిస్థితుల్లో డబ్బు పోగుచేసి ఇల్లు కొనడం దాదాపు అసాధ్యం అనే వాదనలున్నాయి. అందుకు పెరుగుతున్న ఆస్తుల విలువే ప్రధాన కారణమని రిపోర్ట్‌లు తెలుపుతున్నాయి. ఒక విశ్లేషణ ప్రకారం నెలకు రూ.90 వేలు వేతనం అంటే ఏటా రూ.10.8 లక్షలు ఆదాయం పొందే ఓ వ్యక్తి ఉన్నారనుకుందాం. వార్షికంగా 30.2% రేటుతో రూ.3.2 లక్షలు పొదుపు చేస్తున్నాడనుకుందాం. తాను ఒకవేళ ముంబయిలో స్థిరాస్తి కొనుగోలు చేయాలని భావిస్తుంటే అక్కడి సగటు ఆస్తి వ్యయం మార్చి 2025 లెక్కల నాటికి చదరపు అడుగుకు రూ.29, 911గా ఉంది. సాధారణ ఇంటి పరిమాణం 1,184 చదరపు అడుగులు లెక్కిస్తే ఇంటికి




మొత్తం వ్యయం రూ.3.54 కోట్లు అవుతుంది. దీని ప్రకారం ఏటా తాను పొదుపు చేస్తున్న డబ్బు ఆధారంగా 109 ఏళ్లకు రూ.3.54 కోట్లు సమకూరుస్తాడు. అంటే ఇప్పుడు ప్లాన్ చేస్తే 109 ఏళ్లు తర్వాత ఇల్లు కొంటాడు. అదికూడా ద్రవ్యోల్బణాన్ని లెక్కలోకి తీసుకోకపోతేనే! దాదాపు అదే ధర కలిగిన ఆస్తిని దేశంలోని ఇతర ప్రధాన నగరాల్లో కొనుగోలు చేయాలంటే కొంత తక్కువ సమయం పడుతుంది.

**గుర్‌గావ్‌లో ఇది 64 ఏళ్లుగా ఉంది.**
**బెంగళూరులో 36 ఏళ్లు**
**ఢిల్లీ-35 ఏళ్లు**
**చండీగఢ్‌లో 15 ఏళ్లు పడుతుంది.**

### సంక్షోభానికి కారణమేమిటి?

తీవ్రమైన భూ కొరత ఉండడం.
అధిక జనసాంద్రత, పట్టణ వలసలు పెరుగుతుండడం.
డిమాండ్ తగ్గినప్పటికీ డెవలపర్లు సిండికేట్‌గామారి ఇష్టారీతిన ధరలు పెంచడం.
విధానపరమైన ఒత్తిళ్లు ఉన్నప్పటికీ చౌక గృహాల నిర్మాణంపై డెపలపర్లు మొగ్గు చూపకపోవడం.
ఫలితంగా సంపన్నులు సైతం ఒకింత ఆలోచించి కొనుగోలు నిర్ణయం తీసుకునేలా రేట్లు పెరగడం.

## ఆధార్ కేంద్రాలకు వెళ్లాల్సిన అవసరం లేదు!

ఆధార్ కార్డులో అప్‌డేట్స్ చేయాలంటే ఆధార్ కేంద్రానికి వెళ్లాల్సిన అవసరం లేకుండా యూఐడీఏఐ చర్యలు చేపడుతుంది. ఆధార్ కార్డులో చిరునామా మార్చాలన్నా, మొబైల్ నంబర్ అప్‌డేట్ చేయాలన్నా, పేరు, పుట్టిన తేదీ.. వంటివాటిలో మార్పులు చేయాలన్నా ఇకపై ఆధార్ సెంటర్‌కు వెళ్లాల్సిన అవసరం లేకుండా సర్వీసులు అప్‌డేట్ చేస్తున్నారు. నేరుగా ఆన్‌లైన్‌లోనే నవంబర్ 2025 నుంచి సవరణ సదుపాయాన్ని కల్పించేలా యూఐడీఏఐ చర్యలు చేపడుతుంది. ప్రభుత్వం ప్రకటించిన ఈ విధానం వల్ల భౌతిక పత్రాలపై ఆధారపడడం తగ్గుతుంది. ఆధార్ అప్‌డేట్ కోసం ఆయా కేంద్రాలను సందర్శించే అసౌకర్యాన్ని తొలగిస్తుంది. అప్‌డేషన్ ప్రక్రియ ఆన్‌లైన్ సేవల ద్వారా వేగవంతం అవుతుంది. ఈ సర్వీసుల ద్వారా సురక్షితంగా, సులభంగా కొత్త ఆధార్‌ను పొందే వీలుంటుంది. దేశంలోని కొన్ని లక్షల మందికి ఈ సర్వీస్ ఉపయోగకరంగా మారుతుందని చాలామంది అభిప్రాయపడుతున్నారు. దరఖాస్తు సమయంలో పాన్, పాస్‌పోర్ట్, రేషన్ కార్డు వంటి ఇప్పటికే ప్రభుత్వ డేటాబేస్‌లో ఉన్న వివరాల ద్వారా యూఐడీఏఐ మీ వివరాలను తనిఖీ చేస్తుంది. పత్రాలను పదేపదే అప్‌లోడ్ చేయాల్సిన అవసరం లేకుండా ఇది నియంత్రిస్తుంది. విద్యుత్ బిల్లులు వంటి యుటిలిటీ బిల్లులను కూడా మీ చిరునామాను ధ్రువీకరించడానికి ఉపయోగించవచ్చు. నవీకరణ ప్రక్రియను ఈ చర్యలు గణనీయంగా క్రమబద్ధీకరిస్తాయి.

## దేశం-విదేశం NATIONAL-INTERNATIONAL

# 24 మంది విద్యార్థినులతో అనుచితం.. ఉపాధ్యాయుడు అరెస్ట్

సిర్మౌర్: పవిత్రమైన ఉపాధ్యాయు వృత్తిలో ఉంటూ అనైతిక పనులకు పాల్పడుతున్నవారిని మనం అప్పుడప్పుడు చూస్తుంటాం. ఇదే కోవలోకి వచ్చే ఉదంతమొకటి హిమాచల్‌ప్రదేశ్‌లోని ఒక ప్రభుత్వ పాఠశాలలో చోటుచేసుకుంది. మానవత్వానికే మచ్చతెచ్చే ఈ ఘటన చర్చనీయాంశంగా మారింది. ప్రభుత్వ పాఠశాలలో 24 మంది బాలికలను లైంగికంగా వేధించాడనే ఆరోపణలతో ఒక ఉపాధ్యాయుడిని అరెస్టు చేసిన ఉదంతం హిమాచల్‌లోని సిర్మౌర్ జిల్లాలో చోటుచేసుకుంది. లైంగిక వేధింపుల కమిటీ సమావేశంలో విద్యార్థులు పాఠశాలలోని గణిత ఉపాధ్యాయుడిపై ఫిర్యాదు చేయడంతో ఈ ఉదంతం వెలుగు చూసింది. ఆ ఉపాధ్యాయుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు అతనిపై పోక్సో చట్టంతో సహా వివిధ విభాగాల కింద కేసు నమోదు చేశారు. ఆ ప్రభుత్వ పాఠశాలలో శిక్షా సంవాద్ కార్యక్రమం



సందర్భంగా, ఎనిమిది నుంచి పదవ తరగతి వరకూ చదువుకుంటున్న 24 మంది విద్యార్థినులు పాఠశాలలోని ఉపాధ్యాయుని వేధింపులపై ప్రిన్సిపాల్‌కు ఫిర్యాదు చేశారు. ఆ ఉపాధ్యాయుడు తమను అనుచితంగా తాకారంటూ విద్యార్థులు లిఖితపూర్వక ఫిర్యాదును సమర్పించారు. దీంతో ప్రిన్సిపాల్ వారి తల్లిదండ్రులను పిలిపించి, పిల్లలు ఎదుర్కొంటున్న వేధింపుల గురించి అడగగా, వారు తమకు తెలియదని చెప్పారు. అయితే విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు పాఠశాల యాజమాన్యంతో పాటు ఆ ఉపాధ్యాయునికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ, అతనిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వెంటనే విద్యాశాఖ అధికారులు నిందితుడైన ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేశారు. రాష్ట్ర పాఠశాల విద్యా డైరెక్టర్ ఈ ఘటనపై విచారణ చేపట్టాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీచేశారు. పాఠశాల విద్యార్థినులు, ఉపాధ్యాయులు, ఇతర సిబ్బంది వాదనలను రికార్డ్ చేసి, వారంలోపు తన కార్యాలయానికి నివేదిక సమర్పించాలని ఆయన కోరారు. సిర్మౌర్ అదనపు పోలీసు సూపరింటెండెంట్ యోగేష్‌రోల్టా మాట్లాడుతూ నిందితుడైన ఉపాధ్యాయుడిని అరెస్టు చేసి, కేసు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

# యాడ్ షూటింగ్ కోసం వస్తే..

**నీకు సిటీ చూపిస్తానని చెప్పి..!**



ఉదయ్‌పూర్: రాజస్థాన్ రాష్ట్రంలో మరో దారుణం చోటు చేసుకుంది. ఓ యాడ్ షూట్‌లో భాగంగా రాజస్థాన్‌కు వచ్చిన ఫ్రెంచ్ యువతికి చేదు అనుభవం ఎదురైంది. యాడ్ షూటింగ్ పేరుతో ఆమెను ఒక రూమ్‌కు తీసుకెళ్లి అత్యాచారం చేశాడు ఈవెంట్ మేనేజ్‌మెంట్ ఉద్యోగి. ఆదివారం రాత్రి ఓ గ్రూప్‌తో కలిసి వచ్చిన వారంతా కలిసి డిన్నర్ చేశారు. అయితే ముందుగా ప్లాన్ చేసుకున్న సదరు ఉద్యోగి.. ఆ ఫ్రెంచ్ యువతికి ఉదయపూర్ అంతా చూపెడతానని నమ్మబలికాడు. దాంతో నమ్మి వెళ్లిన ఆమెను ముందుగా బుక్ చేసి పెట్టుకున్న హోటల్ రూమ్‌కు తీసుకెళ్లాడు ఈఎమ్ ఉద్యోగి. అనంతరం ఆమెపై అత్యాచారానికి ఒడిగట్టినట్లు పోలీసులు స్పష్టం చేశారు. యువతి ఫిర్యాదు ఆధారంగా దీనిపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు.. ఆ దుండగుడి కోసం వెతుకలాట ప్రారంభించారు.

వివరాల్లోకి వెళితే.. ఈవెంట్ మేనేజ్‌మెంట్ నిర్వహిస్తున్న షూటింగ్‌లో భాగంగా కొంతమంది ఉదయ్‌పూర్‌లోని బాద్‌గావ్ ఏరియాలోని టైగర్ హిల్స్‌లోని ఓ రెస్టారెంట్‌కు వచ్చారు. ఫ్రెంచ్ మహిళతో పాటు ఇద్దరు మహిళలు షూటింగ్ కోసం వచ్చారని పోలీస్ అధికారులు తెలిపారు. ఈ క్రమంలోనే వీరంతా డిన్నర్ పూర్తి చేసుకున్న తర్వాత తనను ఉద్యోగి కారులో ఎక్కించుకుని ఓ హెటల్‌కు తీసుకెళ్లాడని బాధితురాలు ఫిర్యాదులో పేర్కొన్నట్లు పోలీసులు పేర్కొన్నారు. ఉదయ్‌పూర్ సిటీ చూపిస్తానని చెప్పి తనపై అత్యాచారం చేశాడని యువతి ఫిర్యాదు ఆధారంగా పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఆ యువతిని మెడికల్ పరీక్షల కోసం ఆస్పత్రికి తరలించామన్నారు. ప్రస్తుతం నిందితున్ని పట్టుకునే పనిలో ఉన్నామని, సదరు హోటల్ రూమ్ సీసీ ఫుటేజ్ పరిశీలిస్తున్నామని ఉదయ్‌పూర్ ఎస్పీ యోగేష్ గోయల్ తెలిపారు.

## రోడ్డు ప్రమాదం.. ఇద్దరు మృతి

**9 మందికి తీవ్రగాయాలు**

శ్రీనగర్: జమ్ముకశ్మీర్‌లోని రాజౌరి జిల్లాలో ఈరోజు (మంగళవారం) తెల్లవారుజామున జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మహిళలు ప్రాణాలు కోల్పోగా, మరో తొమ్మిది మంది తీవ్రంగా గాయపడ్డారు. చట్యారిచింగస్ సమీపంలో ఉదయం 5 గంటల ప్రాంతంలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. రాజౌరి పట్టణం నుండి జమ్ముకు వెళ్తున్న టెంపో ట్రావెలర్ ఒక మినీ గూడ్స్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో టెంపో తునాతునకలైందని పోలీసులు తెలిపారు. మృతులను ఖోత్రా నివాసి ఇన్షా ఫాతిమా (26), ఫతేపూర్‌కు చెందిన ఫర్జాండ్ బేగం (50)గా గుర్తించారు. వీరిద్దరూ ఘటనా స్థలంలోనే మృతిచెందారు. గాయపడిన వారిలో మృతురాలు ఫర్జాండ్ బేగం భర్త మహ్మద్ ఇక్బాల్, వారి కుమార్తె రఫియా ఇక్బాల్ ఉన్నారు. క్షతగాత్రులను చికిత్స కోసం ఆస్పత్రులకు తరలించారు. వీరిలో ఏడుగురిని రాజౌరిలోని ప్రభుత్వ వైద్య కళాశాలకు తరలించగా, ఇద్దరికి స్థానికంగా చికిత్స అందిస్తున్నారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు ప్రమాదానికి గల కారణాన్ని తెలుసుకునేందుకు దర్యాప్తు ముమ్మరం చేశారు.

# ఆందోళనకరంగా గుండెపోటు మరణాలు

**హాసన్ జిల్లా అనగానే పశ్చిమ కనుమలకు ప్రవేశ ద్వారంగా, ప్రకృతి అందాలకు, వ్యవసాయానికి చిరునామాగా గుర్తుకొస్తుంది. కానీ ఎప్పుడు ఎవరి గుండె ఆగిపోతుందోననే దిగులు అక్కడ రాజ్యమేలుతోంది. గుండెపోట్ల భయం హాసన్‌ను పట్టిపీడిస్తోంది.**

యశవంతపుర: తల్లి గర్భంలో ఊపిరి పోసుకున్న నాటి నుంచి 60, 70 ఏళ్ల వరకు మోటారు పంపులా పనిచేసే గుండె త్వరగా అలసిపోతోంది. కరోనా వైరస్ విపత్తు వచ్చాక గుండె లయ తప్పుతోందనడానికి అనేక ఉదాహరణలున్నాయి. రాష్ట్రంలో హాసన్ జిల్లాలో నెల రోజుల్లో 13 మంది గుండెపోటుతో కన్నుమూయడం ఆందోళనకరంగా మారింది. హాసన్‌కు చెందిన రాజారాం అనే వ్యక్తి సీఎం సిద్ధరామయ్య కు ఈ జాఢ్యంపై లేఖ రాసి విచారణ చేయాలని మనవి చేశారు.

**4 నెలల్లో 250 మంది..**

ఈ నేపథ్యంలో యువకుల్లో గుండెపోటు గురించి 10 మంది వైద్యుల బృందం విచారణ చేసింది. 18 నుంచి 45 ఏళ్ల లోపువారు ఎందుకు చనిపోయారు అనేది అధ్యయనం చేశారు. దీంతో పాటు జిల్లాలో గత నాలుగు నెలల వ్యవధిలో 250 మంది గుండెపోటు, ఆకస్మికంగా మరణాలకు గురయ్యారు. కరోనా వైరస్ టీకా కారణమని కొందరు ఆరోపించారు. వైద్యుల బృందం విచారణలో టీకా సంబంధం లేదని నిర్ధారించారు.

**ఇతరత్రా కారణాలు**

యువతీ యువకులకు వివిధ కారణాలతో గుండెపోటు



వచ్చిందని వైద్యులు తెలిపారు. చనిపోయిన వారి కుటుంబ సభ్యులు, వైద్యులతో మాట్లాడి సమాచారం క్రోడీకరించారు. కొందరు అధిక ధూమపానం, మద్యపానం, గుట్కా సేవించడం వల్ల ఇతరత్రా వ్యాధులు సోకి గుండెపోటుతో చనిపోయారని పేర్కొన్నారు. అయితే ఇటువంటి అలవాట్లు లేని యువతులు, మహిళలు కూడా చాలామంది చనిపోయారు. తమ నిర్ధారణలతో వైద్యుల బృందం రాష్ట్ర ప్రభుత్వానికి నివేదికను అందజేయనుంది.

**ఒకే నెలలో 13 మంది బలి**

ఇటీవల హాసన్ నగరంలోని సత్యమంగల లేఔట్‌కు చెందిన చేతన్ (25), బేలూరు పట్టణవాసి నిషాద్ అహ్మద్ (35), మే 28 హొళెనరసిపుర పట్టణంలో సంధ్య (20), అరకలగూడు తాలూకా కోణనూరువాసి అభిషేక్ (19), అదే రోజు హాసన్ తాలూకా కెలవత్తి గ్రామానికి చెందిన డిగ్రీ ఫైనలియ్ యువతి కవన (20), జూన్ 11న హొళెనరసీపుర పట్టణవాసి నిశాంత్ (20) లు ఆకస్మికంగా మరణించారు. జూన్ 12న ఆలూరు తాలూకా మగ్గె గ్రామం వద్ద బస్సులో ప్రయాణిస్తున్న రవాణా శాఖ ఉద్యోగి బీఆర్ నాగప్ప(55), హాసన్ మాజీ నగరసభ సభ్యుడు నీలకంతప్ప(58), జూన్ 13న హాసన్ వద్ద రాజఘట్ట లో కారులో వెళ్తూనే దేవరాజ్ (43) చనిపోయారు. అలాగే హాసన్ నగరం తెలుగువారి వీధికి చెందిన సతీశ్ (57), జూన్ 14న హాసన్ తాలూకా దొడ్డపురవాసి కాంతరాజు (51) గుండెపోటుతో మృతి చెందారు.



# ఎన్టీఆర్ అభిమానిగా వెళ్లి.. నవీన్ చంద్ర ఫ్యాన్‌గా తిరిగొచ్చా..

పొలిమేర సినిమాలతో ఆడియన్స్‌లో క్రేజ్ తెచ్చుకున్న హీరోయిన్ కామాక్షి భాస్కర్ల. ప్రస్తుతం ఆమె షో టైమ్ అనే మూవీలో నటిస్తున్నారు. నవీన్ చంద్ర హీరోగా నటిస్తోన్న ఈ చిత్రంలో హీరోయిన్‌గా కనిపించనుంది. తాజాగా ఈ సినిమా ట్రైలర్‌ను మేకర్స్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఈవెంట్‌కు హాజరైన కామాక్షి భాస్కర్ల ఆసక్తికర కామెంట్స్ చేసింది. తాను జూనియర్ ఎన్టీఆర్‌కు వీరాభిమానినని కామాక్షి భాస్కర్ల అన్నారు. ఎన్టీఆర్ ఫ్యాన్‌గా అరవింద సమేత సినిమా చూసేందుకు థియేటర్‌కు వెళ్లి.. నవీన్ చంద్ర అభిమానిగా బయటికొచ్చానని తెలిపింది. పొలిమేర 2 చూసిన తర్వాత నవీన్ చంద్ర వ్యక్తిగతంగా నన్ను అభినందించారు. ఈ సినిమాలో నాకు చాలా ఫ్రీడమ్ ఇచ్చారు.. ఈ విషయంలో నవీన్ చంద్రతో పాటు డైరెక్టర్‌కు నా ధన్యవాదాలు.. మా సినిమాలను ఓటీటీలో కాకుండా థియేటర్లకు వచ్చి చూడాలని ఆడియన్స్‌కు విజ్ఞప్తి చేసింది కామాక్షి భాస్కర్ల.

# నా కోడలు ఐశ్వర్యని పబ్లిక్‌గా మెచ్చుకోను కానీ.. : అమితాబ్



సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండే సీనియర్ హీరోలలో అమితాబ్ బచ్చన్ ఒకరు. సినిమా అప్‌డేట్లతో పాటు పర్సనల్ విషయాలను కూడా అభిమానులతో షేర్ చేసుకుంటారు. అంతేకాదు సమయం దొరికినప్పుడల్లా లైవ్‌లోకి వచ్చి ఫ్యాన్స్‌తో చిట్ చాట్ చేస్తుంటాడు. వారు అడిగే ప్రతి ప్రశ్నకు ఓపికగా సమాధానం చెబుతుంటాడు. తాజాగా ఓ అభిమాని.. అమితాబ్‌ని విమర్శిస్తూ అడిగిన ఓ ప్రశ్నకు తనదైన శైలీలో సమాధానం చెప్పాడు బిగ్‌బీ.

**కొడుకుపై మాత్రమే ప్రశంసలు..!**

అమితాబ్‌పై ఓ విమర్శ ఉంది. ఆయన ఎప్పుడూ కొడుకు అభిషేక్ బచ్చన్‌ని పొగుడుతూనే ఉంటాడని.. అదే కోడలు ఐశ్వర్య, భార్య జయా బచ్చన్‌లను ప్రశంసిస్తూ ఒక్క ట్వీట్ కూడా చేయడు. కొడుకుని ప్రశంసినట్లుగానే భార్య, కోడలుని ఎందుకు ప్రశంసించరని కొందరు ఆయనను ట్రోల్ చేస్తుంటారు. తాజాగా ఓ అభిమాని ఇదే ప్రశ్నను డైరెక్ట్‌గా అమితాబ్‌నే అడిగాడు. ఐశ్వర్య, జయా బచ్చన్‌లను ఎందుకు ప్రశంసించరని ప్రశ్నించాడు. దానికి బిగ్‌బీ ఇలా సమాధానం ఇచ్చాడు.

**పబ్లిక్‌గా ప్రశంసించను కానీ..**

నిజమే.. నేను అభిషేక్‌ని ఎప్పుడూ ప్రశంసిస్తూనే ఉంటాను. అలాగే నా భార్య జయాబచ్చన్, కోడలు ఐశ్వర్యతో పాటు కూతురుని కూడా పొగుడుతుంటాను. కాకపోతే వారిని మనసులోనే మెచ్చుకుంటుంటాను. అది నాకు మహిళలపై ఉన్న గౌరవం'అని రిప్లై ఇచ్చాడు. మరో యూజర్..'అమితాబ్ రిప్లై ఇచ్చే వారంతా పెయిడ్ ఫ్యాన్స్' అని కామెంట్ చేయగా.. దానికి బిగ్‌బీ ఇలా రిప్లై ఇచ్చాడు. 'పెయిడ్ ఫ్యాన్స్ అని నిరూపించగలవా? నీది చాలా చిన్న మైండ్. అందుకే అలా భావిస్తున్నావు. నువ్వు కూడా డబ్బులు పెట్టి అభిమానులను సంపాదించుకోవచ్చు కదా? అని బిగ్‌బీ కౌంటర్ ఇచ్చాడు.

# సినిమాల్లేవు.. ఇప్పుడు అది కూడా ఆగిపోయే!

హీరోయిన్‌గా సమంత స్టార్ హోదా చూసింది. కానీ అదంతా ఒకప్పుడు. ఇప్పుడు చేతిలో పెద్దగా చెప్పుకోదగ్గ సినిమాలేం లేవు. కొన్నిరోజుల క్రితం 'శుభం' మూవీతో నిర్మాతగా మారింది. కంటెంట్ ఓకే అనిపించుకుంది కానీ పెట్టిన డబ్బులు అయితే వచ్చేశాయి. అలా నిర్మాతగా తొలి అడుగు పర్లేదనిపించుకుంది. కానీ నటిగానే ఈమెకు కష్టకాలం నడుస్తుందా అనిపిస్తుంది. ఎందుకంటే పరిస్థితి అలా ఉంది మరి! నాగచైతన్యకు 2021లో విడాకులు ఇచ్చిన సామ్.. తర్వాత కొన్నాళ్లకు తాను మయోసైటిస్ అనే అరుదైన వ్యాధితో బాధపడుతున్నట్లు బయటపెట్టింది. ఓ వైపు చికిత్స తీసుకుంటూనే విజయ్ దేవరకొండతో 'ఖుషి' సినిమా చేసింది. ఇది పర్లేదనిపించుకోగా.. తర్వాత 'సిటాడెల్' ఇండియన్ వెబ్ సిరీస్‌లో నటించింది. ఇది కూడా సమంతకు పెద్దగా ప్లస్ కాలేకపోయింది. ప్రస్తుతానికైతే 'రక్త్ బ్రహ్మాండ్' అనే వెబ్ సిరీస్‌లో నటిస్తోంది. ఇప్పుడు ఇది కూడా మొత్తానికే ఆగిపోయినట్లు టాక్ వినిపిస్తుంది. కొన్నాళ్ల క్రితం ఈ సిరీస్‌కి ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ పనిచేస్తున్న ఓ వ్యక్తి.. బడ్జెట్ విషయంలో ఆర్థిక అవకతవకలకు పాల్పడినట్లు ఆరోపణలు బయటకొచ్చాయి. కోట్ల రూపాయల స్కామ్ చేశాడని, 25 రోజులే షూటింగ్ జరిగినప్పటికీ.. సగానికి బడ్జెట్ ఖర్చయిపోయిందని టాక్ వచ్చింది. ఇదంతా కూడా ఓ ఆడిట్ ద్వారా బయటపడింది. అకౌంటింగ్‌లో అక్రమాలు జరిగినట్లు గుర్తించడంతో షూటింగ్‌ను ఆపేశారని టాక్ నడిచింది. ఇప్పుడు మిగిలిన బడ్జెట్ పెట్టి సిరీస్ పూర్తి చేసేందుకు నెట్‌ఫ్లిక్స్ పెద్దగా ఆసక్తి చూపించట్లేదట. దీంతో సిరీస్ మధ్యలోనే ఆపేశారని తెలుస్తోంది.



అయితే చిత్ర నిర్మాతలైన రాజ్ డీకే మాత్రం అలాంటిదేం లేదని సన్నిహితుల దగ్గర అంటున్నారు. ఒకవేళ గనుక ఈ ప్రాజెక్ట్ ఆగిపోతే మాత్రం సమంతకు కష్టకాలమే అని చెప్పొచ్చు. ఎందుకంటే ప్రస్తుతానికైతే ఈమె చేతిలో కొత్త ప్రాజెక్టులేం లేవు. అలా అని ప్రస్తుత దర్శకులు ఈమెకు హీరోయిన్ అవకాశాలు ఇస్తారా అనేది ఇప్పుడు సస్పెన్స్‌గా మారింది.

# హీరోయిన్ శృతిహాసన్ సోషల్ మీడియా ఖాతా హ్యాక్!

హీరోయిన్ శ్రుతి హాసన్ ట్విటర్ ఖాతా హ్యాకింగ్‌కు గురైంది. ఆమె అకౌంట్ నుంచి బిట్‌కాయిన్, క్రిప్టోకరెన్సీకి సంబంధించిన సందేశాలు దర్శనమిచ్చాయి. వరుసగా ఆమె ఖాతా నుంచి ఈ సందేశాలు రావడంతో ఫ్యాన్స్ సైతం షాకయ్యారు. హ్యాకింగ్ గురించి శృతిహాసన్ ఇన్‌స్టా వేదికగా తెలిపింది. దయచేసి ఎవరూ కూడా ఆ మేసేజ్‌లకు స్పందించవద్దని విజ్ఞప్తి చేసింది. శృతి హాసన్ ట్విటర్ ఖాతాలో క్రిప్టో కరెన్సీకి సంబంధించిన పోస్టులు వరుసగా దర్శనమిచ్చాయి. మావెరిక్స్ యజమాని - మార్క్ క్యూబన్ పేరుతో ఈ ట్వీట్స్ పోస్ట్ చేశారు. అయితే శృతి హాసన్ ఖాతా హ్యాక్ కావడం ఇదే మొదటిసారి కాదు. 2017లోనూ ఆమె ఖాతాను ఎవరో హ్యాక్ చేశారు. ఆ తర్వాత ఎవరో నా ఖాతాను హ్యాక్ చేశారంటూ సోషల్ మీడియా వేదికగా అభిమానులను అలర్ట్ చేసింది.



# నిర్మాత క్లారిటీ.. ఐకాన్ ఇకపై బన్నీది కాదు



అల్లు అర్జున్ ఇప్పుడు పాన్ ఇండియా సూపర్‌స్టార్. పుష్ప, పుష్ప 2 సినిమాలతో రేంజ్ ఎక్కడికో వెళ్లిపోయింది. దీంతో కెరీర్ విషయంలో బన్నీ ఆచితూచి అడుగులేస్తున్నాడు. త్రివిక్రమ్‌తో కమిటైన ప్రాజెక్ట్ పక్కనబెట్టి దర్శకుడు అట్లీకి ఓకే చెప్పింది కూడా బహుశా అందుకేనేమో? బన్నీ పరిస్థితి చూసి చాలా ఏళ్ల క్రితం అనుకున్న ఓ ప్రాజెక్ట్‌ని పక్కన బెట్టేశారు. ఈ విషయమై నిర్మాత దిల్ రాజు స్వయంగా క్లారిటీ ఇచ్చారు. 'పుష్ప'కి ముందు అల్లు అర్జున్ క్రేజ్.. తెలుగుతో పాటు మలయాళం వరకు మాత్రమే పరిమితం. అలా అప్పట్లో 'ఐకాన్' అనే ప్రాజెక్ట్ కమిట్ అయ్యాడు. దీనికి 'వకీల్ సాబ్' ఫేమ్ శ్రీరామ్ వేణు దర్శకుడు. దిల్ రాజు నిర్మాత. అఫీషియల్‌గా పోస్టర్ లాంచ్ కూడా చేశారు. కానీ పుష్ప చిత్రాలతో పాన్ ఇండియా స్టార్‌డమ్ వచ్చేసరికి.. 'ఐకాన్' విషయంలో దర్శకనిర్మాతలు వెనకడుగు వేశారు. తాజాగా 'తమ్ముడు' ప్రమోషన్లలో భాగంగా దిల్ రాజు దీని గురించి చెప్పారు. ప్రకటించే సమయానికి ఇప్పటికీ బన్నీ రేంజ్ మారిపోయిందని, కాబట్టి త్వరలో మరో హీరోతో 'ఐకాన్' తీస్తామని దిల్ రాజు చెప్పుకొచ్చారు. అలానే 'తమ్ముడు' రిలీజ్ టెన్షన్స్ అన్నీ అయిపోయాక.. 'ఐకాన్' స్క్రిప్ట్‌ని శ్రీరామ్ వేణు బయటకు తీస్తాడేమో అని ఈయన అన్నారు. హ్యూమన్ యాక్షన్ స్టోరీ అదని, ఎప్పుడు చేసినా బాగుంటుందని దిల్ రాజు అన్నారు. మరి ఆ స్టోరీ ఎవరికి సూట్ అవుతుందో? ఎప్పుడు పట్టాలెక్కుతుందో చూడాలి? అయితే వచ్చే ఏడాది బన్నీ.. తన నిర్మాణంలో ఓ సినిమా చేస్తారని దిల్ రాజు ప్రకటించారు. ఇది భారీ స్థాయిలో ఉంటుందని హింట్ ఇచ్చారు. కానీ దర్శకుడు ఎవరు ఏంటనేది మాత్రం రివీల్ చేయలేదు. కొన్నిరోజుల క్రితం బహుశా దీని గురించి అనుకుంటా కొన్నిరూమర్స్ వచ్చాయి. ప్రశాంత్ నీల్‌తో బన్నీ జట్టు కడతారని, దీనికి దిల్ రాజు నిర్మాత అన్నట్లు రూమర్స్ వచ్చాయి. మరికొన్నాళ్లు ఆగితే ఇది నిజమా కాదా అనేది తేలుతుంది.

# కన్నడ బ్యూటీతో చిరు స్పెషల్ సాంగ్!

మెగాస్టార్ చిరంజీవి ప్రస్తుతం అనిల్ రావిపూడితో సినిమా చేస్తున్నారు. దీని షూటింగ్ జోరుగా సాగుతోంది. మరోవైపు చిరు 'విశ్వంభర' నుంచి ఒక్కటంటే ఒక్క అప్డేట్ కూడా రావట్లేదు. అసలు ఈ మూవీని ఇప్పట్లో రిలీజ్ చేసే ఆలోచనలో నిర్మాతలు ఏమైనా ఉన్నారా అనేది తెలియట్లేదు. ఫైనల్‌గా ఇప్పుడు ఓ ముగింపు ఇచ్చేందుకు దర్శకనిర్మాతలు సిద్ధమవుతున్నారట. ఉన్న ఒక్క సమస్య కూడా తీరిపోయిందని తెలుస్తోంది. 'బింబిసార' ఫేమ్ వశిష్ఠ దర్శకత్వం వహించిన సినిమా 'విశ్వంభర'. దీన్ని కూడా ఫాంటసీ జానర్ కథతోనే తీశారు. అయితే చాన్నాళ్ల క్రితం టీజర్ రిలీజ్ చేయగా.. విపరీతమైన విమర్శలు వచ్చాయి. దీంతో టీమ్ పునరాలోచనలో పడిపోయింది. గ్రాఫిక్స్ పనుల్లో బిజీగా ఉన్నాడు. కొన్నిరోజుల క్రితం 'రామరామ' అంటూ సాగే ఓ పాట రిలీజ్ చేశారు. ఇది కూడా జనాల్లోకి పెద్దగా రీచ్ కాలేదు. అయితే చిరంజీవి లాంటి హీరోకు.. స్పెషల్ సాంగ్ చేసేందుకు హీరోయిన్ దొరకట్లేదని మొన్నటివరకు రూమర్స్ వినిపించాయి. ఇప్పుడు వాటికి సమాధానం దొరికేసినట్లు తెలుస్తోంది. కన్నడ నటి నిష్విక నాయుడు.. చిరు పక్కన డ్యాన్స్ చేయనుందని, ఈ పాటతో షూటింగ్ పూర్తి కానుందని సమాచారం. ఒకవేళ అంతా పూర్తి చేసినా సరే ఈ ఏడాదిలో సినిమా రిలీజ్ చేస్తారా అనేది అనుమానంగా ఉంది. ఎందుకంటే జూలైకి ఎన్నిరోజులు లేదు. ఆగస్టులో తారక్, రజినీకాంత్ సినిమాలు ఉన్నాయి. సెప్టెంబరులో మిరాయ్, ఓజీ లాంటి చిత్రాలు రెడీగా ఉన్నాయి. పోనీ అక్టోబరులో ప్లాన్ చేద్దామా అంటే అక్కడ కూడా అఖండ 2, కాంతార 2 లాంటి పాన్ ఇండియా సినిమాలున్నాయి. డిసెంబరులో 'రాజాసాబ్' ఉండనే ఉన్నాడు. ఇలా రాబోయే ఆరు నెలలు ఫుల్ ప్యాక్డ్‌గా రిలీజులు ఉన్నాయి. మరి వీటన్నింటి మధ్యలో 'విశ్వంభర'ని రిలీజ్ చేస్తారా? లేదంటే ఏం చేస్తారనేది చూడాలి? ఇక నిష్విక నాయుడు విషయానికొస్తే.. 'బిచ్చగాడు' కన్నడ రీమేక్ అమ్మ ఐ లవ్ యూ అనే సినిమాతో హీరోయిన్‌గా కెరీర్ ప్రారంభించింది. తర్వాత చిన్న చిన్న మూవీస్ చేసింది. మరి ఇలాంటి అనామక హీరోయిన్‌ని చిరు సరసన తీసుకోవాలనే ఆలోచన ఎవరిది? దీనికి కారణమేంటి అనేది తెలియాల్సి ఉంది.



EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com

# రైతుకు భరోసా వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎం, మంత్రులు

**పాల్గొన్న జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే, అధికారులు, రైతులు**

**వరంగల్ మహా;** రాష్ట్రంలోని రైతులకు వానాకాలం పంటల సాగుకు పెట్టుబడి సాయాన్ని అందజేసిన సందర్భంగా హైదరాబాద్ నుండి రైతన్నకు భరోసా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఇతర మంత్రులు రాష్ట్రంలోని రైతు వేదికల నుండి పాల్గొన్న రైతులను ఉద్దేశించి మంగళ వారం సాయంత్రం మాట్లాడారు.



**ఇందులో భాగంగా**

వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండల కేంద్ర రైతు వేదిక నుండి మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన రైతులతో కలిసి జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, వర్ధన్నపేట ఎమ్మెల్యే కె ఆర్ నాగరాజు, అధికారులు, ప్రజాప్రతినిధులు రైతులు పాల్గొన్నారు. హైదరాబాద్ నుండి నిర్వహించిన రైతన్నకు భరోసా కార్యక్రమం సాయంత్రం నాలుగు గంటలకు ప్రారంభం కాగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రైతులను ఉద్దేశించి చేసిన ప్రసంగాలను వర్ధన్నపేట రైతు వేదిక నుండి రైతులతో కలిసి జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, వర్ధన్నపేట ఎమ్మెల్యే కె ఆర్ నాగరాజు, వీక్షించారు. ఈ కార్యక్రమంలో ఏ ఎం సి చైర్మన్ వెంకటయ్య, జిల్లా వ్యవసాయ అధికారి అనురాధ, స్థానిక తహసీల్దార్ విజయ్ సాగర్ ఎంపీడీవో వెంకట రమణ, మునిసిపల్ కమిషనర్ సుధీర్ కుమార్ , ఏఓ విజయ్ కుమార్ వ్యవసాయ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

# ప్రజల భాగస్వామ్యంతో వన మహోత్సవాన్ని విజయవంతం చేయాలి

**రాష్ట్ర ముఖ్య కార్యదర్శి కే రామ కృష్ణా రావు**

**వరంగల్, హన్మకొండ మహా;** ప్రజలను భాగస్వామ్యం చేస్తూ వన మహోత్సవం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రాష్ట్ర ముఖ్య కార్యదర్శి కే రామ కృష్ణా రావు అన్నారు. మంగళవారం హైదరాబాద్ నుంచి సి.ఎస్ కే.రామ కృష్ణా రావు ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాల పై వరంగల్, హనుమకొండ జిల్లాల కలెక్టర్ల తో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఆన్ లైన్ నుంచి అటవీ పర్యావరణ శాఖ మంత్రి వర్యులు కోండా సురేఖ హాజరయ్యారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో కలెక్టర్లు డాక్టర్ సత్య శారద, స్నేహ శబరీష్ సమీకృత జిల్లాల కలెక్టరేట్ల నుంచి పాల్గొన్నారు. వన మహోత్సవం కార్యక్రమం, ఇందిరమ్మ ఇండ్లు, ఎరువుల లభ్యత, ఆయిల్ పామ్ పంట విస్తరణ, సీజనల్ వ్యాధుల నియంత్రణకు చర్యలు, భూ భారతి దరఖాస్తుల పరిష్కారం వంటి పలు అంశాల పై సీఎస్ సుదీర్ఘంగా చర్చించి పలు సూచనలు చేశారు.





రాష్ట్ర ముఖ్య కార్యదర్శి
కే. రామ కృష్ణా రావు మాట్లాడుతూ

2 లక్షల 30 వేల కు పైగా ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలను లబ్ధిదారులకు పంపిణీ చేశామని, లక్షకు పైగా ఇండ్ల నిర్మాణ పనులు గ్రౌండ్ అయ్యాయని అన్నారు. పెద్ద వర్షాలు కు రవడానికి ముందే మంజూరు చేసిన ఇందిరమ్మ ఇండ్ల గ్రౌండింగ్, బేస్మెంట్ స్థాయి వరకు నిర్మాణం జరిగేలా చూడాలని సీఎస్ సూచించారు. ఇందిరమ్మ ఇండ్ల కోసం ఉచితంగా ఇసుక సరఫరా చేస్తూ సీనరేజి చార్జిలను ప్రభుత్వం రద్దు చేసిందని అన్నారు. డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పెండింగ్ పనులు లబ్ధిదారులు పూర్తి చేసుకునేలా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని అన్నారు. ప్రస్తుతం ఎంత మేరకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణం జరిగిందో ఎంబీ రికార్డులను నమోదు చేసి లబ్ధిదారులకు ఇండ్లను కేటాయించాలని, ప్రభుత్వం మిగిలిన పనులు పూర్తి చేసేందుకు అవసరమైన నిధులు లబ్ధిదారుల ఖాతాలో జమ చేస్తుందని అన్నారు. పిఎం ఆవాస్ యోజన అర్బన్ 2.0 క్రింద మనకు లక్షా 13 వేల ఇండ్లను కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిందని, ప్రతి పట్టణం నుంచి కనీసం 500 మంది నిరు పేదలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని కలెక్టర్ లకు సీఎస్ సూచించారు. వన మహోత్సవం కార్యక్రమం క్రింద ఇండ్లకు పంపిణీ చేసే మొక్కల పెంపకం సైతం పరిశీలించాలని, మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని సీఎస్ కలెక్టర్ల కు సూచించారు. ప్రతి జిల్లా ప్రత్యేకమైన ప్రణాళికను సిద్ధం చేసుకుని వన మహోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించాలని, నాటిన మొక్కల వివరాలను ఎప్పటికప్పుడు జియో కోఆర్డినేట్స్ తో ఆన్ లైన్ లో నమోదు చేయాలని అన్నారు. ప్రతి జిల్లాలో ఎరువుల లభ్యత స్టాక్ పై రివ్యూ పెట్టాలని అన్నారు. జూలై వరకు అవసరమైన స్టాక్ ప్రస్తుతం అందుబాటులో ఉందని, సెప్టెంబర్ నాటికి అవసరమైన ఎరువుల స్టాక్ ప్రోక్యూర్ చేస్తున్నామని అన్నారు. ఎరువుల స్టాక్ ను ప్రత్యేక అధికారులను నియమించి ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని అన్నారు. రిటైల్ విక్రయాలను డిజిటలైజ్ చేయాలని కలెక్టర్ లకు సీఎస్ సూచించారు. వ్యవసాయ సహకార సంఘాలు, ఎరువుల షాప్ వద్ద ఎక్కడ కొరత రాకుండా జాగ్రత్త చర్యలు తీసుకోవాలని అన్నారు.

# అండర్ గ్రౌండ్ డ్రైనేజీ డీపీఆర్ త్వరగా సిద్ధం చేయండి

- నగర మేయర్ గుండు సుధారాణి
- కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ తో కలిసి యు జి డి పురోగతి పై కన్సల్టెన్సీ అధికారులతో సమీక్ష
- పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా యు జి డి పురోగతి వివరణ..



**వరంగల్ మహా;** గ్రేటర్ వరంగల్ నగరంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ నిర్మాణానికి అవసరమగు డీటెయిల్ ప్రాజెక్ట్ రిపోర్ట్ ను త్వరితగతిన సిద్ధం చేయాలని గ్రేటర్ వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి ఆదేశించారు. మంగళవారం సాయంత్రం బల్దియా ప్రధాన కార్యాలయంలోని మేయర్స్ కాన్ఫరెన్స్ చాంబర్లో మేయర్ గుండు సుధారాణి, కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ తో కలిసి అండర్ గ్రౌండ్ డ్రైనేజ్, సివిరేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్ల ఏర్పాటు నిమిత్తం రూపొందిస్తున్న డీటెయిల్ ప్రాజెక్ట్ రిపోర్ట్ పురోగతిని బిల్డ్ కాన్ కన్సల్టెన్సీ, అధికారులతో సమీక్షించి సమర్థ నిర్వహణకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా బిల్డ్ కాన్ కన్సల్టెన్సీ ప్రతినిధి అగర్వాల్ అండర్ గ్రౌండ్ డ్రైనేజ్, ఏర్పాటుకు అవసరమవు సివరేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్ల ఏర్పాటు, 66 డివిజన్లో జోన్ల వారీగా విభజన, ఎస్ టి పి ల ఏర్పాటుకు భూ కేటాయింపు, తదితర అంశాలపై వివరించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ గ్రేటర్ వరంగల్ లో యూజీడి ఏర్పాటుకు ఇదివరకే కన్సల్టెన్సీ ద్వారా డిపిఆర్ రూపొందించి ఇంజనీర్ ఇన్ చీఫ్ కు సమర్పించగా, అందులో మార్పులు చేస్తూ 9 జోన్ లు, సబ్ జోన్లకు అదనంగా మరికొన్ని సబ్జొన్లను ఏర్పాటు చేస్తూ పూర్తి నివేదిక సమర్పించాలని ఇంజనీర్ ఇన్ చీఫ్ కోరిన మేరకు, ఆయా ప్రాంతాలలో ఉన్న గ్రౌండ్ రియాలిటీ ని బట్టి సబ్ జోన్లుగా విభజిస్తూ డి పి ఆర్ ను త్వరితగతిన రూపొందించి సమర్పించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఇన్చార్జ్ ఎస్ఈ మహేందర్, ఇన్చార్జి సిపి రవీందర్ రాడేకర్, బిల్డ్ కాన్ ప్రతినిధి అగర్వాల్, ఈ ఈ లు, డి ఈ లు, టౌన్ ప్లానింగ్ అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రైతు భరోసా తొమ్మిది రోజుల్లో 9,000 కోట్లు

- రైతులతో ముఖ్యమంత్రి ముఖాముఖి
- రైతుల ఖాతాలో రైతు భరోసా నిధులు జమ
- జిల్లాలో 237069 మంది రైతులకు 267.28 కోట్లు
- కందుకూరు మండలంలో రైతు భరోసా సంబరాలు
- జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమంలో భాగంగా ప్రవేశ పెట్టిన "రైతు భరోసా" పథకం కింద కేవలం 9 రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా 9,000 కోట్ల రూపాయలను రైతుల ఖాతాలలో జమ చేసిన సందర్భాన్ని పురస్కరించుకొని మంగళవారం హైదరాబాద్ లో నిర్వహించిన "రైతు భరోసా సంబరాలలో భాగంగా రాష్ట్ర ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డి, రైతులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలం కొత్తగూడ గ్రామంలో నిర్వహించిన రైతు భరోసా విజయోత్సవ సంబరాలు ప్రత్యక్ష ప్రసార కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ... 2025 సంవత్సరం వానాకాలంకు సంబంధించి జిల్లాలో రైతు భరోసా కింద మొత్తం 237069 మంది రైతులకు 267.28 కోట్లు ఖాతాలలో జమ చేయడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి నరసింహారావు, ఉద్యాన శాఖ అధికారి సురేష్, ఆర్డీవో జగదీశ్వర్, రైతులు, స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# శాకంభరీ నవరాత్ర మహోత్సవాలకు మంత్రికి ఆహ్వానం



**వరంగల్ మహా;** చరిత్ర ప్రసిద్ధిగాంచిన వరంగల్ మహానగరంలో భూతల మణిద్వీపంలో విరాజిల్లుతున్న శ్రీ భద్రకాళి దేవస్థానంలో 15 రోజుల పాటు జరిగే శాకంభరీ నవరాత్ర మహోత్సవాలు ఈ నెల 2606 2025 గురువారం నుండి ప్రారంభం కానున్నాయి. ఈ సందర్భంగా 26062025 గురువారం అమ్మవారికి సహస్ర కలశాభిషేకం జరుగుతుంది. అనంతరం నిత్యాయాగం ప్రారంభమౌతుందని ఆలయ ఈవో శేషు భారతి తెలిపారు. అమ్మవారిని దర్శించడానికి వేలాదిగా భక్తులు గుడికి పోటెత్తుతారు. ఈ సందర్భంగా ఆలయాన్ని సందర్శించే భక్తుల సౌకర్యార్థం ధర్మకర్తల మండలి విస్తృతమైన ఏర్పాట్లు చేస్తోంది. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్తలు జారతి వెంకటేశ్వర్లు, తొగరు క్రాంతి, అనంతుల శ్రీనివాసరావు, ఎక్స్ ఆఫీషియో మెంబర్ పార్నంది నర్సింహమూర్తి, అర్చకులు టక్కర్లు సత్యం, కార్య నిర్వహణాధికారి శేషుభారతి, హైదరాబాదు లోని తెలంగాణా రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖా మంత్రి కొండా సురేఖ నివాసానికి వెళ్ళి ఉత్సవాలకు ఆహ్వానించారు. ఉత్సవాలకు తప్పకుండా విచ్చేస్తానని మంత్రి హామి ఇచ్చారని ధర్మకర్తలు తెలిపారు.

# ప్రైవేట్ స్కూళ్లపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి

**విద్యార్థి సంఘం (టిఎస్ఎస్ఓ) రాష్ట్ర అధ్యక్షులు లక్ష్మీనివాస్**



**రాజేంద్రనగర్ మహా ;** శంషాబాద్ కేంద్రంలో ఉన్నటువంటి 50 ప్రైవేటు స్కూలు చట్టవిరుద్ధంగా స్కూలు ముందు ఇష్టం వచ్చినట్లు టెక్నో టాలెంట్ గ్రామర్ పెట్టుకుని మధ్యతరగతి కుటుంబాల మంచి లక్షల రూపాయలు వసూలు చేస్తూ చట్ట విరుద్ధంగా బుక్స్ డ్రస్సులు అమ్ముతూ ఎమ్మార్పీస్ రేట్లు కన్నా అధికంగా వసూలు చేస్తూ ఏ అధికారి మమ్మల్ని ఏమి చేయదు అనే దీమాతో ప్రవేట్ స్కూల్ చలామణి అవుతున్నాయి. ప్రవేటు స్కూల్ ల పైన చట్టపరమైనటువంటి చర్యలు తీసుకొని చట్ట విరుద్ధంగా నడుస్తున్నటువంటి స్కూల్లను వెంటనే సీజ్ చేయాలని శంషాబాద్ మండల ఎంఈఓకి వినతి పత్రం మంగళవారం అందజేశారు. స్కూల్ లపై చర్యలు లేని పక్షంలో విద్యార్థి సంఘంలతో కలిసి చట్ట పరంగా ముందుకి వెళ్తామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధికార ప్రతినిధి మానాజిపేట్ రమేష్ గౌడ్ . పాలమూరు జిల్లా అధ్యక్షుడు యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

# తుపాకీ మిస్ ఫైర్.. తప్పిన ప్రమాదం



**ఆదిలాబాద్,. మహా:** ఆదిలాబాద్ పట్టణంలోని శివాజీ చౌక్ లో ఉన్న ఎస్బిఐ ప్రధాన కార్యాలయంలో మంగళవారం ఉదయం తుపాకీ మిస్ ఫైర్ అయింది. ఈ ప్రమాదంలో ఎవరికీ ప్రాణ నష్టం జరగలేదు. భద్రత సిబ్బంది తన తుపాకీని శుభ్రం చేసుకునే సమయంలో పొరపాటున స్ట్రిగర్ కు వేలు తగలడంతో ఓ తూటా పైన ఉన్న స్లాబ్ కు తాకింది. ఈ సమయంలో బ్యాంకులో ఖాతాదారులు ఎవరు లేకపోవటంతో బ్యాంకు అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. కాగా ఈ విషయమై బ్యాంకు అధికారులు విచారణ జరుపు తున్నట్లు సమాచారం.

# ప్రభుత్వాధికారులు విధుల పట్ల బాధ్యతగా వ్యవహరించాలి

**మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**



**మంచిర్యాల, మహా :** ప్రభుత్వాధికారులు వారి వారి విధుల పట్ల బాధ్యతగా వ్యవహరించాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలో గల హాజీపూర్ మండలం తహశీల్దార్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయాలను ఆకస్మికంగా సందర్శించి రిజిస్టర్లు, రికార్డులు పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అధికారులు, ఉద్యోగులు విధుల పట్ల బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డుల కొరకు చేసుకున్న దరఖాస్తులను క్షేత్ర స్థాయిలో పరిశీలించి అర్హులకు అందించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు తెలిపారు. పలు రకాల ధృవపత్రాల కొరకు విద్యార్థులు, ఇతరులు చేసుకున్న దరఖాస్తులను నిబంధనల ప్రకారం పరిశీలించి నిర్ణీత గడువులోగా జారీ చేయాలని ఆయన ఆదేశించారు. అనంతరం మండలంలోని కర్ణమామిడి గ్రామంలో గల కస్తూరిభా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి వంటశాల, గదులు, హాజరు పట్టిక, పరిసరాలను పరిశీలించారు. ప్రతి విద్యార్థికి పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు, ఏక రూప దుస్తుల అందించాలని తెలిపారు. నూతన మెనూ ప్రకారం సకాలంలో విద్యార్థులకు నాణ్యమైన ఆహారం, శుద్ధమైన త్రాగునీటిని అందించాలని వివరించారు. ఆహారం తయారు చేసే సమయంలో తాజా కూరగాయలు, నాణ్యమైన నిత్యావసర సరుకులు వినియోగించాలని సిబ్బందికి సూచించారు. వర్షాకాల సమయంలో విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా త్రాగునీరు, విద్యుత్, మూత్రశాలలు ఇతర అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలని కలెక్టర్ ఆదేశించారు. విద్యార్థులకు అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులను నియమించి నాణ్యమైన విద్య అందించే దిశగా చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. పాఠశాల ఆవరణలో మూత్రశాలలు, తరగతి గదులు, పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని, పారిశుద్ధ్య నిర్వహణపై పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. బడి బయట ఉన్న పిల్లలు, మధ్యలో బడి మానివేసిన పిల్లలను గుర్తించి వారి తల్లిదండ్రులకు విద్య ఆవశ్యకతను వివరించి వారిని తిరిగి పాఠశాలలో చేర్పించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రభుత్వం విద్యారంగ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించిందని, విద్యార్థులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఉన్నత లక్ష్యాలను ఎంచుకుని సాధించే దిశగా ఏకాగ్రతతో కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# బ్రాండెడ్ పేరిట.. రేషన్ బియ్యం విక్రయం

**ఇద్దరు ఘరానా మోసగాళ్ల అరెస్ట్.. 79.30 క్వింటాళ్లు సీజ్**



**ఆదిలాబాద్, మహా:** ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న రాయితీ సన్నబియ్యాన్ని బ్రాండెడ్ రైస్ పేరిట వివిధ రకాల సంచులలో నింపి ప్రజలకు అధిక డబ్బుకు విక్రయిస్తున్న ఇద్దరు ఘరానా మోసగాళ్లను అరెస్టు చేసినట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. పోలీసులకు అందిన విశ్వసనీయ సమాచారం ప్రకారం.. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో ప్రత్యేక బృందం ఏర్పాటు చేసి పోలీసులు తనిఖీలు చేయగా.. శివాజీ చౌక్ వద్ద గల ఇద్దరి వ్యాపారుల దుకాణాలలో దాదాపు 80 క్వింటాళ్ల రాయితీ బియ్యాన్ని ప్రజలకు అమ్ముతుండగా..వాటిని స్వాధీనం చేసుకొని ఇద్దరు వ్యాపారులైన గూగుల్వార్ రాజేశ్వర్, షేక్ అయూబ్ లపై వన్ టౌన్ పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ఈ రాయితీ బియ్యం దాదాపు 326 బ్యాగుల్లో 79.30 క్వింటాళ్లు ఉందని వెల్లడించారు. ప్రభుత్వం పేద ప్రజలకు అందిస్తున్న పథకాన్ని దుర్వినియోగం చేస్తున్న ప్రతి ఒకరిపై కఠిన చర్యలు తీసుకోబడతాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్ రెడ్డి, సిసిఎస్ ఇన్స్పెక్టర్ పి. చంద్రశేఖర్, వన్ టౌన్ సీఐ బి. సునీల్ కుమార్, ఎస్సై అశోక్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఈనెల 26న మినీ జాబ్ మేళా

**మంచిర్యాల జిల్లా ఉపాధి కల్పన అధికారి రవికృష్ణ**

**మంచిర్యాల, మహా :** మంచిర్యాల జిల్లా కేంద్రం వాగ్దేవి డిగ్రీ కళాశాలలో ఈ నెల 26 నాడు ఉదయం 10 గంటల 30 నిమిషలకు మినీ జాబ్ మేళా నిర్వహించడం జరుగుతుందని జిల్లా ఉపాధి కల్పన అధికారి రవికృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఎల్.ఐ.సి. ఆఫ్ ఇండియామంచిర్యాల శాఖలో మంచిర్యాల జిల్లాలో ఖాళీగా ఉన్న 100 (మహిళా కెరీర్ ఏజెంట్స్‌భీమా శక్తి) పోస్టులను భర్తీ చేసేందుకు ఎస్.ఎస్.సి. పైన విద్యార్హత కలిగి, 18 సంవత్సరాల పైన వయస్సు గల మహిళా అభ్యర్థులు అర్హులని, ఎం.ఎన్.సి. బ్యాంక్ కంపెనీ నందు తెలంగాణ వ్యాప్తంగా ఖాళీగా ఉన్న 60 రిలేషన్ షిప్ మేనేజర్ పోస్టుల భర్తీ చేసేందుకు ఏదేని డిగ్రీ అర్హత కలిగిన 26 సంవత్సరాల వరకు వయస్సు గల అభ్యర్థులు అర్హులని తెలిపారు. ఇతర వివరాలకు 9912832330, 8096857078, 9110368501 నంబర్లలో సంప్రదించవచ్చని, ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.


# రైతు భరోసా సంబురం

**అన్నదాతల ఖాతాల్లో పెట్టుబడి సాయం జమ**

**ఆదిలాబాద్ జిల్లాలో కాంగ్రెస్ శ్రేణుల ఆనందోత్సాహం**




**ఆదిలాబాద్, మహా:** రాష్ట్ర ప్రభుత్వం రైతుల ఖాతాల్లో రైతు భరోసా నిధులు జమ చేసింది. ఇప్పటి వరకు 15 ఎకరాల వరకు జమ కావడంతో అన్నదాతల్లో ఆనందం వ్యక్తమవుతోంది. ప్రభుత్వం నిర్ణయంతో కాంగ్రెస్ శ్రేణుల సంబరాలు మిన్నంటాయి. వానాకాలం పంటల సాగు కోసం రైతుభరోసా నగదు బదిలీ విజయవంతంగా పూర్తయిన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం సంబరాలకు పిలుపునిచ్చింది. మంగళవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రైతు భరోసా సంబరాలు నిర్వహించారు. పలు ఆదిలాబాద్, జైనథ్, బేల, మావలమండలాలతో పాటు జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు, రైతులు సంబరాలు నిర్వహించారు. రైతులు ఒకరికొకరు మిఠాయిలు తినిపించుకున్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు, ఇన్చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు, కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జ్ కంది శ్రీనివాస రెడ్డి ఫ్లెక్సీలకు పాలాభిషేకం చేశారు. 9 రోజుల్లో రూ.9 వేల కోట్ల నగదు బదిలీ చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతుల గుండెల్లో నిలిచిపోతారని అన్నదాతలు కొనియాడారు. ఈ సారి రైతుభరోసా పథకాన్ని రేవంత్ సర్కారు ప్రతిష్ఠాత్మకంగా తీసుకొని ఎలాంటి పరిమితులు, షరతులు విధించకుండా వ్యవసాయ భూముల జాబితాలో ఉన్న మొత్తం విస్తీర్ణానికి పెట్టుబడి సాయం అందించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.



# పాత్రికేయులపై అనిశిత వాక్యాలు సరికాదు

**బీ.ఆర్.ఎస్. మందమర్రి పట్టణ అధ్యక్షులు జంగిలి రవీందర్**

**మంచిర్యాల, మహా :** పాత్రికేయులపై అనిశిత వాక్యాలు చేయడం సరికాదని బీ.ఆర్.ఎస్. మందమర్రి పట్టణ అధ్యక్షులు జంగిలి రవీందర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం స్థానిక టీబీజీకేఎస్ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పాలక పార్టీ, వారి అనుచరులపై విరుచుకుపడ్డారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ పార్టీ నేతలు విచ్చలవిడిగా రెచ్చిపోతున్నారని అన్నారు. ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా వ్యవహరిస్తున్న మీడియా ప్రతినిధులపై కాంగ్రెస్ నాయకులు పైడిమల్ల నర్సింగ్ అనుచిత వాక్యాలు చేయడం సరికాదని హితవు పలికారు. సామాజిక స్పృహతో లాభాపేక్ష లేకుండా వారి వారి విధులను నిర్వహిస్తున్న వారిని విమర్శించడం హేయమైన చర్య అని ధ్వజమెత్తారు. ఈ వ్యవహారాన్ని భారత రాష్ట్ర సమితి పూర్తిగా ఖండిస్తోందని పేర్కొన్నారు. ఈ నేత ఇంతకు క్రితం బీసీ సంఘం నేతలను, నేతకాని కులస్తులను, ఇతరులపై విమర్శల పోస్టులు పెట్టి ఎంతగానో అవమానించారని వెల్లడించారు. ఇతడిని ఇతడి అనుచరులను చెన్నూరు ఎమ్మెల్యే, కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేకానంద కట్టడి చేయాలని డిమాండ్ చేశారు. మందమర్రి పట్టణంలో పోలీస్ లా అండ్ ఆర్డర్ అమలు కావడం లేదని విమర్శించారు. తక్షణమే సదరు వ్యక్తిపై కేసును నమోదు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అధికార పార్టీకి పోలీసులు కొమ్ముకాస్తున్నారని అసహనం వ్యక్తం చేశారు. ఇతడిపై తక్షణమే కేసు నమోదు చేయకుంటే మా ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఓ రాజశేఖర్, ఎండి అబ్బాస్, బండారు సూరిబాబు, మేడిపల్లి సంపత్, మద్ది శంకర్, బర్ల సదానందం, మాజీ పట్టణ ప్రధాన కార్యదర్శి కొంగల తిరుపతిరెడ్డి, బోరిగం వెంకటేశం, ఓదెలు, సాగర్ తదితరులు ఉన్నారు.

